



# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 5-7-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 సంచిక 326 రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi





# ప్రైవేటే చోదక శక్తి

## భారీ అభివృద్ధికి సంస్కరణలే కీలకం
## ఆర్థిక సర్వే స్పష్టీకరణ

- 2019-20లో 7 శాతానికి పెరగనున్న ఆర్థికవృద్ధి రేటు
- 2018-19లో 3.4 శాతానికి ద్రవ్యోల్బణం పరిమితం
- పదవీవిరమణ వయసు పెంచక తప్పని పరిస్థితి
- దిగువ కోర్టులలోనే 87.5% కేసుల పెండింగ్
- అన్ని బ్రాడ్‌గేజ్ రైలు మార్గాల విద్యుదీకరణ

**దిల్లీ:** అయిదేళ్లుగా కనిష్ఠ స్థాయికి దిగజారిన వృద్ధి రేటు మళ్లీ ఊర్ధ్వముఖ ప్రయాణాన్ని ప్రారంభించిందని, ఆర్థిక వ్యవస్థ బంతి మాదిరిగా పైకి ఎగురుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. గత ఏప్రిల్ నుంచి పరిస్థితి మారిందని, 7 శాతం వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని తెలిపింది. ఆర్థిక వ్యవస్థ రూపాంతరీకరణలో ప్రైవేటు రంగం పాత్ర ఆవశ్యకతను నొక్కి చెప్పింది. ప్రగతిపై వాస్తవాలను వెల్లడిస్తూ, విధానాలపై పాలకులకు దిశానిర్దేశం చేస్తూ గురువారం వార్షిక ఆర్థిక సర్వే ఆవిష్కృతమయింది. విధానాలను తరచూ మార్చకుండా, సుస్థిరత పాటించాలని శాసనకర్తలకు సర్వే సూచించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో 2018-19 సంవత్సరపు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. ఇది నూతన ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ రూపొందించిన తొలి సర్వే నివేదిక కావడం విశేషం. ఇందులోని అంశాలను అనంతరం ఆయన విలేకరులకు వివరించారు.

ప్రస్తుత సంపదను రెట్టింపు చేసి 2024-25 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరీకరణ చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ఈ సర్వే ప్రముఖంగా ప్రస్తావించింది. ఇందుకు భారీగా పెట్టుబడులతో పాటు, పాలన రంగంలో సంస్కరణలు అవసరమని పేర్కొంది. ఈ ఆశయ సాధనకు ప్రయివేటు రంగమే కీలకమని గుర్తించింది. ఈ భారీ లక్ష్యాన్ని అందుకోవాలంటే ఏటా 8 శాతం వృద్ధి రేటును సాధించాల్సి ఉంది. ఇది జరగాలంటే 'పొదుపు, పెట్టుబడులు, ఎగుమతులు' అనే 'ధన వలయం' ఏర్పాటు కావాలి. ప్రస్తుతం భారత్ 2.7 ట్రిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలో ఆరో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. వచ్చే ఏడాది బ్రిటన్‌ను పక్కన పెట్టి అయిదో స్థానానికి చేరనుంది.

**ప్రయివేటు రంగానికి ప్రోత్సాహం**

ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి ప్రయివేటు రంగమే కీలక చోదక శక్తి అని సర్వే అభిప్రాయపడింది. మార్కెట్‌లో డిమాండు ...మిగతా 2లో



**తెలంగాణ కుటుంబ సర్వే భేష్**

అగ్ర దేశాల్లో మాదిరిగా ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రశంస 2లో

## స్పష్టమైన విధానాలు ఉండాలి

సుస్థిర ప్రగతి సాధించాలంటే ప్రభుత్వం పెట్టుబడుదారుల అంచనాలకు అందేవిధంగా స్పష్టమైన విధానాలను రూపొందించాలి. అమలులో ఏకపక్ష ధోరణులు కనిపించనీయకూడదు. అస్పష్టతకు తావీయకుండా సరైన మార్గదర్శనం చేయాలి. 'అస్పష్ట విధానాల సూచి'ని రూపొందించి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించాలి. విధానాల్లో సుస్థిరత ఉండాలంటే వాటికి చట్టబద్ధత కల్పించాలి. ద్రవ్య విధానం రూపకల్పన బాధ్యతలను రిజర్వు బ్యాంకుకు అప్పగించినట్లు, మిగిలినవాటిని వివిధ సంస్థలకు కట్టబెట్టాలి. ప్రయివేటు సంస్థలు నాణ్యత ధ్రువీకరణ పత్రాలను పొందడానికి పోటీ పడుతున్నట్లుగానే, ప్రభుత్వ సంస్థలూ ప్రయత్నించాలి.

# బ్యాలెట్‌తోనే పుర పోరు

- ఆగస్టు రెండో వారంలో ఎన్నికలు!
- ఒకే దశలో పోలింగ్ నిర్వహణ
- జులై 18 నాటికి వార్డుల వారీ ఓటర్ల జాబితాలు సిద్ధం
- 19 నాటికి కులాల వారీగా ఓటర్ల గుర్తింపు పూర్తి



**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో పురపాలక ఎన్నికలు ఆగస్టు రెండో వారంలో నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. గత విడత ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించినా.. ఈ దఫా బ్యాలెట్ ద్వారానే పురపోరు జరగనుంది. వార్డుల వారీగా ఓటర్ల జాబితా ముసాయిదాను ఈ నెల 12న ప్రచురించి తుది జాబితాను 18న ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. 19 నాటికి పురపాలక శాఖ వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా ఓటర్లను గుర్తించే ప్రక్రియను పూర్తి చేయనుంది. వర్గాల వారీగా ఓటర్లను గుర్తించే ప్రక్రియ పూర్తయిన వెంటనే పురపాలక రిజర్వేషన్లను ప్రకటించనున్నారు. ఈ నెల 21న ఎన్నికల ప్రకటన విడుదల చేసి ఆగస్టు 11న పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒకే దశలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

**ఏర్పాట్లు ప్రారంభించండి: ఎన్నికల సంఘం..** పురపాలక ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయిలో ఏర్పాట్లు ప్రారంభించాలని ...మిగతా 2లో

## గో'దారి'కి భారీ సొరంగం!

90 కిలోమీటర్ల మేర నిర్మాణం 5లో

380 కిలోమీటర్ల దూరం నీటి మళ్లింపు

లక్ష కోట్ల రూపాయల వ్యయం అంచనా

ప్రతిపాదనకు తుది రూపం తెచ్చిన ఇంజినీర్లు

త్వరలో ఇరు రాష్ట్రాల బృందాల భేటీలో చర్చ

## మూడోసారి ఎంసెట్ ఆప్షన్ల ప్రక్రియ వాయిదా

- ఈనెల 5వ తేదీకి బదులు 6 నుంచి ప్రారంభం
- రుసుములపై నేడు జీఓ రాకుంటే తాత్కాలిక రుసుములతో కౌన్సెలింగ్

15లో

**ఎంసెట్ కన్వీనర్ కోటా సీట్లు 64,709**

- ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైంది 53,795
- ఇంజినీరింగ్ అత్యధిక రుసుం రూ.1.34 లక్షలు!

# నేడే బడ్జెట్

- ఆర్థిక పద్దును ప్రవేశపెట్టనున్న నిర్మలాసీతారామన్

**దిల్లీ:** భారతదేశపు తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ శుక్రవారం తన మొదటి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజాన్నిచ్చే ఉద్దీపన చర్యలతో పాటు, సామాన్యులకు కొంతమేర పన్ను ప్రయోజనాల్ని కల్పించే చర్యలు ఈ బడ్జెట్‌లో ఉండొచ్చని భావిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత అవసరాలు, ద్రవ్య పరిమితుల మధ్య కఠిన పరిస్థితుల్లో తొలి బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. కొన్ని వర్గాల వారికి వ్యక్తిగత ఆదాయ పన్ను ఉపశమనాల్ని కల్పించడంతో పాటు, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, సామాజిక రంగాల్లో వ్యయాల్ని పెంపొందించే అవకాశం ఉంది. వృద్ధిరేటుకు ఊపునిచ్చేలా రహదారులు, రైల్వే మార్గాలు వంటి మౌలిక రంగంలో వ్యయాలకు పెద్ద ఎత్తున అండదండలు కల్పించనున్నట్లు తెలుస్తోంది. వాణిజ్యం నెమ్మదించడం, కొన్ని దేశాల్లో ఆర్థిక రక్షణాత్మక విధానం పెరగడం, అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం, రష్యా, ఇరాన్, వెనెజువెలాలపై అమెరికా ఆంక్షలు వంటి పరిణామాలు దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయి. ఈ క్రమంలో కొత్త విధాన చర్యల ద్వారా వృద్ధిని మరింతగా పెంచే ఉద్దీపన చర్యలు ఉండొచ్చనే అంచనాలు పెరుగుతున్నాయి.

**నిరుద్యోగులకు శుభవార్త**

# ఇక తెలుగులోనూ గ్రామీణ బ్యాంకు పరీక్ష

- మిగిలిన ప్రాంతీయ భాషల్లోనూ నిర్వహణ
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడి

**ఈనాడు, దిల్లీ:** తెలుగు రాష్ట్రాల ఉద్యోగార్థులకు ఇది భారీ శుభవార్త, ఇకపై బ్యాంకు పరీక్షల్ని తెలుగులోనే రాసుకోవచ్చు. నిరుద్యోగులు ఎంతో కాలంగా కోరుతున్న డిమాండ్ ఇన్నాళ్లకి నెరవేరినట్లయింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల(ఆర్ఆర్‌బీ)కు సంబంధించి స్కేల్-1 అధికారులు, కార్యాలయ సహాయకుల పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు చేపట్టే పరీక్షలను ఇకపై ఆంగ్లం, హిందీతోపాటు 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడించారు. ప్రాంతీయ భాషల్లో నైపుణ్యముండే వారు ఉద్యోగం సాధించే విషయంలో ఈ నిర్ణయం బాగా ఉపయోగపడుతుందని ఆమె గురువారం పార్లమెంటులో ప్రకటించారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, ఉద్యోగ అవకాశాలను స్థానిక యువత వరకూ విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ...మిగతా 2లో




బోనాల ఉత్సవాలు పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గోల్కొండకు చేరిన శోభాయాత్ర 2లో




## పతాక పోరుకు రంగం సిద్ధం

ప్రపంచకప్‌లో లీగ్ దశ ముగిసినట్లే. సెమీస్ జట్లేవో దాదాపుగా ఖరారైపోయింది. ఇక ఎవరితో ఎవరన్నదే తేలాల్సి ఉంది. టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన అగ్ర జట్లే నాకౌట్‌లో అడుగు పెడుతున్నాయి. వీటి మధ్య రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో టోర్నీలో ఇప్పటిదాకా ఈ జట్ల ప్రదర్శన, నాకౌట్‌లో వీటి అవకాశాలు, మిగతా జట్ల వైఫల్యంపై 'థర్డ్ అంపైర్' విశ్లేషణ..

ఛాంపియన్స్‌లో



# పాలన మరింత చేరువ

- నూతన జిల్లా పరిషత్‌లతో అనేక ప్రయోజనాలు
- 9 నుంచి 32కి పెరిగిన జడ్పీలు



**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లు చెబుతారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని బాపూజీ అన్న మాటలు గ్రామాలకు ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. అలాంటి గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు మాత్రం కోకొల్లలు. వీటి పరిష్కారంలో పంచాయతీరాజ్ వ్యవస్థనే కీలకం. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లా పరిషత్‌లతో పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కానుంది. సమస్యల పరిష్కార పరంగా ప్రజలకు ఇటు జడ్పీ సమావేశాలకు హాజరయ్యే సభ్యులకు, పంచాయతీరాజ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో జిల్లా పరిషత్‌ల సంఖ్య 9 నుంచి 32కు పెరగనున్నందున 'స్థానిక' పాలన కొత్తరూపును సంతరించుకోనుంది.

**దూరం కానున్న రవాణా ఇబ్బందులు**

జిల్లా పరిషత్‌లు 1959లో ఆవిర్భవించాయి. అప్పటివరకు పరోక్షంగా ఎన్నికలు జరగ్గా మండల వ్యవస్థ అమల్లోకి వచ్చాక 1987లో మే నెలలో జడ్పీఛైర్మన్‌కు నేరుగా ఎన్నికలు నిర్వహించారు. అప్పుడు ప్రజల చేత ఎన్నికైన మండల పరిషత్ అధ్యక్షులు(ఎంపీపీ) జడ్పీలో సభ్యులుగా వ్యవహరించేవారు. ఆ తర్వాత 1992 నుంచి 1995 వరకు ప్రత్యేక అధికారి పాలన విధించారు. అనంతరం మండలాల్లో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ(ఎంపీటీసీ) సభ్యుల వ్యవస్థ వచ్చింది. ...మిగతా 2లో

## నేడు 20 కొత్త జడ్పీలు ఆవిర్భావం

- మొత్తం 28 జడ్పీల్లో కొలువుదీరనున్న నూతన పాలకవర్గాలు
- ఆగస్టు 7న మరో నాలుగింటిలో పాలన ఆరంభం

16లో

Eenadu epaper

# తెలుగింట జనాభా సంక్షోభం?

- 2041 నాటికి ఏపీలో జనాభా వృద్ధిరేటు దాదాపుగా సున్నా
- తెలంగాణలోనూ ఇబ్బందే...
- పెరగనున్న వృద్ధుల సంఖ్య
- తగ్గనున్న యుక్తవయస్కులు
- లింగ నిష్పత్తిలో భేష్
- ఆర్థిక సర్వే వెల్లడి

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాలు భవిష్యత్తులో జనాభా సంక్షోభాన్ని ఎదుర్కోనున్నాయా? ప్రస్తుతం జపాన్ తరహాలో పని చేయగలిగే యువత సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య పెరగనుందా? యుక్తవయస్కుల సంఖ్య భారీగా తగ్గిపోనుందా? 2041 కల్లా ఆంధ్రప్రదేశ్‌లో జనాభా వృద్ధి రేటు సున్నాకు చేరనుందా.. అంటే అవుననే అంటోంది ఆర్థిక సర్వే. తెలుగు రాష్ట్రాలే కాదు.. దేశంలోని చాలా రాష్ట్రాల్లో జనాభా వృద్ధిరేటు తగ్గనుందని చెబుతోంది.. చాలా రాష్ట్రాలకు వలసలు ఉంటే తప్ప అక్కడి జనాభా పెరగదని అంటోంది ఆర్థికసర్వే. వీటితో పాటు మరెన్నో వాస్తవాలను ఈ సర్వే కళ్లకు కట్టింది. ఈ చేదు నిజాలతోపాటు కొన్ని తీపి కబుర్లనూ అందించింది. తెలుగు రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి మెరుగుపడింది. ఆయుఃప్రమాణాలు పెరుగుతున్నాయి. మరణశాతాలు తగ్గుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2041 నాటికి జనాభా వృద్ధి రేటు సున్నాకు చేరుతుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. వచ్చే 2 దశాబ్దాల కాలంలో తెలుగు రాష్ట్రాల్లో యుక్తవయస్కుల సంఖ్య 10% తగ్గిపోయి 60 ఏళ్ల పైబడిన వయోవృద్ధుల సంఖ్య పెరుగుతుందని పేర్కొంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో 2018-19 ఏడాది ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. అందులోని వివరాల ప్రకారం...



### అవీ ఇవీ..

- 2015-16 నుంచి 2018-19 మధ్యకాలంలో తెలుగు రాష్ట్రాల్లో లింగనిష్పత్తి పురోగమనంలో సాగింది. భేటీ బచావో- భేటీ పఢావో కార్యక్రమం పెద్ద రాష్ట్రాలపై మంచి ప్రభావాన్ని చూపింది. లింగనిష్పత్తి 980కి మించి ఉన్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చేరాయి. 2015-16 నాటికి ఏపీలో ఈ నిష్పత్తి 873 లోపు ఉంది.
- 5- 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో బడికి వెళ్లేవారి సంఖ్య దేశవ్యాప్తంగా తగ్గుముఖం పడుతూ వస్తోంది.
- ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లలో 40% ప్రాథమిక పాఠశాలల్లో 50%కంటే తక్కువ పిల్లలున్నారు.
- ఏపీలో 2001లో సగటు సంతాన సాఫల్య నిష్పత్తి 2.3% ఉండగా 2041 నాటికి అది 1.5%కి చేరనుంది. తెలంగాణలోనూ ఇది 2.3% నుంచి 1.6%కి చేరే అవకాశం కనిపిస్తోంది.

### జనాభా వృద్ధిరేటు

- తెలంగాణలో 2031 నుంచి 2041 నాటికి తెలంగాణలో జనాభా వృద్ధి రేటు : 0.21%
- ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధిరేటు : 0 %
- కర్ణాటక, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, మహారాష్ట్రల్లో జనాభా వృద్ధిరేటు: 0.1% నుంచి 0.2%
- 2031-41 మధ్య తమిళనాడులో వృద్ధిరేటు: తిరోగమనం
- 2021-41 మధ్యకాలంలో తెలంగాణలో జనాభా పెరుగుదల : 7.4%
- 2041నాటికి తెలంగాణ జనాభా : 4 కోట్లు
- 2021-41 మధ్యకాలంలో ఏపీలో జనాభా పెరుగుదల : 3.4%
- 2041 నాటికి ఏపీ జనాభా : 5.43 కోట్లు

### మొత్తం జనాభాలో..

- వచ్చే 20 ఏళ్లలో తెలంగాణలో యుక్తవయస్కుల తగ్గుదల : 14%
- 20-59 ఏళ్ల వయసువారి తగ్గుదల : 5%
- 60 ఏళ్లు పైబడిన వారి పెరుగుదల : 10%
- ఏపీలో 2011 నాటికి 0-19 వయసున్న పిల్లలు : 34.8%
- 2011 నాటికి 20-59 ఏళ్ల వయసున్న వారు : 55.1%
- వచ్చే 20 ఏళ్లలో టీనేజీ పిల్లల తగ్గుదల : 13%
- 60 ఏళ్లు పైబడిన వారి పెరుగుదల : 10%

# కుటుంబ సర్వే భేష్

**కేంద్ర ఆర్థిక సర్వేలో తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే గురించి ప్రస్తావన**

- సమాచార అనుసంధానం బాగుందని కితాబు
- అగ్ర దేశాల్లో మాదిరిగా ఉందని ప్రశంస
- 25 విభాగాల సమాచారం ఒకేచోట
- వ్యక్తిగత వివరాలు అనుసంధానం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమం సమగ్ర కుటుంబ సర్వేను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన 25 రకాల డేటాను ప్రభుత్వశాఖలతో అనుసందానం చేయడాన్ని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే ప్రత్యేకంగా ప్రస్తావించింది. లండన్‌లో రవాణా సమాచారం, అమెరికాలో ప్రభుత్వ సంస్థల డేటా ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన విషయాలను.. వాటివల్ల కలిగిన ఫలితాలను విశ్లేషిస్తూ.. తెలంగాణలో డేటా అనుసంధానాన్ని వాటితో పోల్చింది. 2014 ఆగస్టులో తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రణాళికాశాఖ సేకరించిన ఆ సమాచారం ఆధారంగా ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 25 రకాల డేటాను, ప్రతి వ్యక్తికి సంబంధించిన ఏడు అంశాల సమాచారాన్ని అనుసంధానం చేసింది. ప్రతి వ్యక్తికి సంబంధించిన నేరాలు, ఆస్తులు, సబ్సిడీలు, యుటిలిటీలు, విద్య, పన్నులు వంటి సమాచారాన్ని క్రోడీకరించి ఒక దగ్గర చేర్చింది. అదే వ్యక్తికి సంబంధించిన సమీప బంధువుల భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, ఇతర దగ్గరి బంధువుల సమాచారంతో అనుసంధానపరిచింది. ఈ సమాచారం దుర్వినియోగం కాకుండా, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలగకుండా, ఎవరూ మార్పులు చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఏ శాఖకు సంబంధించిన సమాచారాన్ని ఆ శాఖ మాత్రమే మార్పులు, చేర్పులు చేసుకునేలా అవకాశం కల్పించింది. అలాగే ఒక శాఖకు సంబంధించిన సమాచారాన్ని మరో శాఖ చూసేందుకు మాత్రమే అవకాశం ఉంటుంది తప్ప మార్పులు, చేసేందుకు అవకాశం ఉండకుండా చర్యలు తీసుకుంది.

### ఎక్కడికక్కడే సమాచారం

మనదేశంలోని చాలా రాష్ట్రాల్లో సమాచారం (డేటా) సేకరణ పూర్తిగా వికేంద్రీకరణగా ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఏ శాఖలు, విభాగాలు వేటికవి సమాచారాన్ని సేకరించి ఉంచుకుంటున్నాయని.. ఒక వ్యక్తికి సంబంధించిన వివరాలు వేర్వేరు శాఖల వద్ద ఉంటుండడంతో బహుళ వినియోగానికి అవకాశం ఉండటంలేదని పేర్కొంది. సమాచారాన్ని అందరూ వినియోగించుకునేలా చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొంది. ప్రధానంగా సౌకర్యంగా ఉంటుందని, సమయంతో పాటు డబ్బు ఆదా అవుతాయని వివరించింది.

### లండన్‌లో రవాణా ఆన్‌లైన్..

రవాణాకు సంబంధించి లండన్ నగరంలో కాలపట్టికలు, సర్వీసులు సహా సమగ్ర సమాచారం ఎలాంటి రుసుం చెల్లించకుండా ఎవరైనా ఉపయోగించుకునేలా అందుబాటులో ఉంటుంది. అనేక ట్రావెల్ యాప్‌లు దీన్ని వినియోగించుకుంటున్నాయి. దీనివలన సమయం ఆదా కావడంతో పాటు తక్కువ ఖర్చుతో ప్రజారవాణాకు సంబంధించి డేటా వినియోగంలోకి వచ్చింది. 42 శాతంమంది లండన్‌వాసులు ఈ సమాచారాన్ని వినియోగించుకుంటున్నారు. వినియోగదారులకు సమయం ఆదా కావడంతో పాటు అక్కడి ప్రభుత్వానికి, ప్రజలకు ఏటా 15 మిలియన్ పౌండ్ల నుంచి 58 మిలియన్ పౌండ్ల వరకూ ఆదా అవుతోంది.

### యూఎస్‌లో ఇలా చేశారు..

2009లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక విధానం రూపొందించాలని నిర్ణయించారు. ఫెడరల్ ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ సంస్థలు తమ డేటాను పూర్తిగా ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాయి. యూఎస్ ప్రభుత్వం 1.38 లక్షల డేటాసెట్ సమాచారాన్ని 2015 ఫిబ్రవరిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

# స్వచ్ఛత.. ఇంకా తీరని ముచ్చట

- రాష్ట్రాలు చేయాల్సింది చాలానే ఉంది
- మరుగుదొడ్లు ఒక భాగం మాత్రమే
- ఓడీఎఫ్‌గా మార్చడంలో వెనుకపడ్డ తెలంగాణ
- మరుగుదొడ్డి వల్ల నీళ్లవిరేచన మరణాలు తగ్గుముఖం
- పేదల పొదుపులో పెరుగుదల
- కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

స్వచ్ఛభారత్ సాధనకు రాష్ట్రాలు ఇంకా చేయాల్సినవి చాలానే ఉన్నాయని కేంద్ర ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. దేశాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో మరుగుదొడ్ల నిర్మాణం ఒక భాగం మాత్రమేనని, నివాస ప్రాంతాల్లో మురుగు లేకుండా చూడటం.. నీటి వనరులను శుభ్ర పరుస్తుండటం.. కాలుష్య నిర్మూలన.. ప్లాస్టిక్ సమస్యలపై దృష్టి పెట్టడం వంటివన్నీ స్వచ్ఛభారత్ కోసం చేపట్టాల్సిన తక్షణ విధులుగా సర్వే నివేదిక పేర్కొంది. గ్రామాలను ఆరుబయలు మలవిసర్జన రహితం (ఓడీఎఫ్)గా మార్చటంతో తెలంగాణ, ఒడిశా, గోవా, బిహార్ రాష్ట్రాలు కొంత వెనుకబడి ఉన్నట్టు పేర్కొంది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

- దేశంలో 93 శాతంమంది గ్రామీణులకు మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. నూరు శాతం ఓడీఎఫ్‌గా మారిన రాష్ట్రాల్లో నీళ్ల విరేచనాలు, మలేరియా, తక్కువ బరువుతో జననాలు బాగా తగ్గాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 2014లో దేశంలో నీళ్ల విరేచనాల వల్ల మరణాలు 1.40 లక్షలు ఉండగా.. 2018కి వాటి సంఖ్య 50,000కు తగ్గింది. పిల్లల ఆరోగ్యాలు మెరుగుపడ్డాయి.
- యూనిసెఫ్ సర్వే ప్రకారం ఓడీఎఫ్ ప్రాంతాల్లోని ప్రతి ఇంటిలో ఏడాదికి రూ.50,000 ఆదా అవుతున్నాయి. చేతులను శుభ్రపర్చుకోవటం వంటి అలవాట్ల వల్ల రోగాలు తగ్గడంతో ఆ మేరకు పొదుపు మొత్తాలు పెరుగుతున్నాయి. ఓడీఎఫ్ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి అయిన ఖర్చుతో పోలిస్తే పదేళ్ల వ్యవధిలో 1.7 రెట్లు ఎక్కువగా పొదుపు పెరుగుతుంది. నిరుపేద కుటుంబాల్లో ఇటువంటి పొదుపు 2.4 రెట్లు ఎక్కువగా ఉంటుంది.
- గ్రామాల్లో చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో పరిష్కరించడం ఇప్పుడు అత్యవసరం. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తవుతున్నందున ఇక చెత్తపై ప్రత్యేక దృష్టి సారించటం స్వచ్ఛభారత్ లక్ష్యం కావాలి.
- పర్యావరణం, నీటి నిర్వహణ అంశాలను చేపట్టాల్సివుంది. నదులను పరిశుభ్రంగా ఉంచటమూ తప్పనిసరి.
- స్వచ్ఛ భారత్ కోసం ప్రవేశపెడుతున్న పథకాలను అమలు చేసేందుకు రాష్ట్రాలు వివిధ కార్యక్రమాలను చేపట్టాలి. సూక్ష్మ రుణాలు, రాయితీతో కూడిన రుణాలు అందుబాటులో ఉంచాలి. కార్పొరేట్ కంపెనీలు సామాజిక బాధ్యతతో చేపట్టే కార్యకలాపాలు, ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యం వంటివి అవసరం. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వల్ల పర్యావరణ ఫలితాలు అద్భుతంగా ఉంటాయి.
- చాలా రాష్ట్రాలు నూరుశాతం గ్రామాలను ఆరుబయలు మలవిసర్జన రహితం (ఓడీఎఫ్)గా మార్చాయి. గోవా 5.84 శాతం, ఒడిశా 45.36 శాతం, తెలంగాణ 73.99 శాతం, బిహార్ 82.95 శాతం గ్రామాలను మాత్రమే చేయగలిగాయి.

### ఆర్థిక సర్వే ప్రధానాంశాలు

- సగటు జీవితకాలం పెరగడంతో పదవీవిరమణ వయసు పెంచక తప్పని పరిస్థితి
- రూ. 50 వేల కోట్ల మేర వసూలైన మొండి బకాయిలు
- 2019-20లో తగ్గనున్న ముడిచమురు ధరలు, పెరగనున్న వినియోగం
- పెట్టుబడులకు దేశంలో సానుకూల వాతావరణం
- ఆహార రాయితీల హేతుబద్ధీకరణ తప్పనిసరి
- దేశంలోని మొత్తం కార్లలో విద్యుత్‌కార్లు 0.6%. చైనాలో 2%, నార్వేలో 39%
- గత సంవత్సరం 6.4%గా ఉన్న ద్రవ్యలోటు 2018-9లో 5.8% ఉండే అవకాశం
- 2019 జూన్ నాటికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు 42,220 కోట్ల డాలర్లు
- పర్యాటకం, ఆతిథ్యం, రవాణా, స్థిరాస్తి, వినోద రంగాల్లో ఎక్కువ ఉద్యోగాల సృష్టి
- దిగువ కోర్టులలోనే 87.5% కేసుల పెండింగ్. వీటితో పాటు హైకోర్టులలో ఖాళీల భర్తీ అవసరం
- స్వచ్ఛభారత్‌తో మెరుగుపడుతున్న ప్రజారోగ్యం, తద్వారా సుందర భారతం
- బేటీ బచావో బేటీ పఢావో నుంచి బద్లావ్ (బేటీ ఆప్‌కీ ధనలక్ష్మీ ఔర్ విజయలక్ష్మి)

# ఇక తెలుగులోనూ గ్రామీణ బ్యాంకు పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు ఈ పరీక్షల్ని కేవలం ఆంగ్లం, హిందీల్లో మాత్రమే నిర్వహిస్తుండడంతో స్థానిక భాషల్లో విద్యనభ్యసించిన అభ్యర్థులు నష్టపోతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇకపై.. తెలుగు, అస్సామీ, బంగ్లా, గుజరాతీ, కన్నడ, కొంకణి, మలయాళం, మణిపురి, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూల్లో కూడా నిర్వహించనున్నారు. ఈ నిర్ణయం సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ-8(2019) మెయిన్స్ పరీక్ష నుంచి అమలవనుంది. ప్రస్తుతం దేశంలో 45 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పనిచేస్తుండగా, మొత్తంగా 90 వేలమంది సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ నేత ఎల్. హనుమంతయ్య ప్రశంసించారు. ఈ సౌకర్యాన్ని జాతీయ బ్యాంకుల్లో నియామక పరీక్షలకూ వర్తింపజేయాలని సూచించారు. రాజ్యాంగ షెడ్యూల్‌లోని అన్ని భాషల్లోనూ ఆర్ఆర్‌బీల నియామక పరీక్షలు నిర్వహించాలని ఆర్జేడీ నేత మనోజ్ ఝా కోరారు.



అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించేందుకు వెళ్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్. పక్కన నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్

# గోల్కొండ బోనాలు ప్రారంభం

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. పోతురాజుల నృత్యాలు, బ్యాండు మేళాలు, సాంస్కృతిక బృందాలు వెంటరాగా... లంగర్ హౌస్ చౌరస్తాలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అమ్మవారికి పూజలు నిర్వహించి బోనాల వేడుకలకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్లు సాక పోసి, రాష్ట్ర ప్రజలను చల్లగా కాపాడాలని మంత్రులు వేడుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, కేసీఆర్ ప్రభుత్వం బోనాల ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని మంత్రి తలసాని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా బోనాల వేడుకలు నిర్వహిస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్ తెలిపారు. పాతబస్తీ ఉమ్మడి దేవాలయ కమిటీ తరఫున అమ్మవారికి బంగారు వెండి బోనం సమర్పించారు. ఎమ్మెల్యే రాజాసింగ్, నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్, అదనపు కమిషనర్ అనీల్‌కుమార్ పెద్ద సంఖ్యలో ప్రజలు వేడుకలకు హాజరయ్యారు.

# పాలన మరింత చేరువ

(మొదటి పేజీ తరువాయి)

ఇదే సమయంలో మండలానికి ఒక జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ(జడ్పీటీసీ) సభ్యుడిని ఎన్నుకున్నారు. అప్పటినుంచి జిల్లాపరిషత్‌లో జడ్పీటీసీలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మాదిరిగా ఎంపీపీలు శాశ్వత ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. జిల్లాలు విస్తీర్ణ పరంగా పెద్దగా ఉండటంతో సభ్యులు సమావేశాలకు వెళ్లివచ్చేందుకు అష్టకష్టాలు పడేవారు. ఉదాహరణకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను తీసుకుంటే బెజ్జూర్ మండలం నుంచి జడ్పీటీసీ, ఎంపీపీ.. జిల్లా కేంద్రానికి వచ్చివెళ్లాలంటే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. దీని కోసం వేకువజామున ప్రత్యేక వాహనంలో బయలు దేరితేనే తొమ్మిది పదిగంటలకల్లా ఆదిలాబాద్ చేరుకునేవారు. బస్సులో రావాలంటే జిల్లా కేంద్రం వచ్చేందుకు మధ్యాహ్నం సమయం పడుతుంది. దీంతో ఆర్థికంగా భారమైనా అద్దె వాహనాల్లోనే చాలామంది సభ్యులు వచ్చి సమావేశాలకు హాజరయ్యేవారు. ప్రతి రెండునెలలకోమారు జరిగే జడ్పీ స్థాయి సంఘ, మూడు మాసాలకోమారు నిర్వహించే జడ్పీ సర్వసభ్య సమావేశాలకు హాజరుకావాల్సి ఉంటుంది. తాజాగా కొత్త జడ్పీల ఆవిర్భావం వలన సభ్యులకు రవాణా సమస్యలు దూరం కానున్నాయి.

### 32 జడ్పీలతో సుపరిపాలన

జిల్లా పరిషత్ ఆధీనంలోనే మండల పరిషత్‌లు ఉంటాయి. జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన బాధ్యత వీటిదే. జిల్లా పరిషత్.. గ్రామీణ ప్రాంతంతో సంబంధమున్న అన్నిశాఖలకు చెందిన సమస్యల పరిష్కారానికి వేదికగా ఉపయోగపడుతుంది. సంక్షేమ పథకాల అమల్లో అక్రమాలు, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం..ఇలా జడ్పీ సమావేశాల్లో దేనిపైన అడిగినా అక్కడ సమాధానం లభిస్తుంది. పెద్ద జడ్పీలతో ఎక్కువ సంఖ్యలో ఉన్న సభ్యులందరూ సమస్యలను ప్రస్తావించేందుకు సమయం సరిపోయేది కాదు.

సమస్య పరిష్కారం కోసం సంబంధిత జిల్లా అధికారి ఒకవేళ క్షేత్రస్థాయి పరిశీలనకు ఆయా మండలాలకు వెళ్లాలన్నా దూరాభారమే. జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) పెద్ద జిల్లాల వల్ల సరైన పర్యవేక్షణ చేయలేక పోయేవారు. పరిధి తగ్గడంతో చిన్న జడ్పీలతో పర్యవేక్షణ సులువు అయినట్లే. అన్ని శాఖల అధికారులకు సైతం ఇది ఉపయోగపడనుంది. ఇక సభ్యులందరికీ మాట్లాడేందుకు అవకాశం దొరకనుంది. 9 జిల్లా పరిషత్‌ల నుంచి 32 జిల్లా పరిషత్‌లు ఆవిర్భవించడంతో పంచాయతీరాజ్ పాలన ఆయా జిల్లాల్లో ప్రజలందరికీ చేరువ కానుంది.

### ఉద్యోగులకు ప్రయోజనమే

జడ్పీల విభజనతో ఉద్యోగులకు సైతం ప్రయోజనం చేకూరనుంది. పంచాయతీరాజ్ ఉద్యోగులతోపాటు జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో పనిచేసే ఉపాధ్యాయులకు సాధారణ భవిష్య నిధి(జీపీఎఫ్) ఖాతాల పర్యవేక్షణ కోసం జడ్పీ కార్యాలయంలోనే ప్రత్యేక విభాగం ఉంటుంది. జిల్లాను బట్టి 6 వేల నుంచి 8 వేల వరకు ఉద్యోగులు ఉంటారు. ఖాతా ఉన్న వారికి ఏమైనా చిక్కులు ఏర్పడితే జడ్పీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇది దూరప్రాంతాల వారికి ఇబ్బందే. దీనికితోడు జడ్పీ నిధులతో జరిగే పనులు పూర్తయ్యాక జడ్పీ కార్యాలయం ఉన్న చోటనుంచే విడుదలయ్యేవి. దీంతో దూర ప్రాంతాల వారికి ఇబ్బంది ఎదురయ్యేది. ఇకపై ఇలాంటి ఇబ్బందులు దూరం కానున్నాయి. ఉద్యోగుల ఖాళీలన్నీ భర్తీచేసి, గతంలో మాదిరిగా నిధులు విడుదల చేస్తే జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు బలోపేతం అవుతాయనడంలో సందేహం లేదు.

# రైతులకు వడ్డీలేని రుణ బకాయిల చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: రైతులకు వడ్డీలేని రుణాలకు సంబంధించిన బకాయిల చెల్లింపునకు రూ. 256 కోట్లను విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండున్నరేళ్లుగా ఈ బకాయిలు పెండింగులో ఉన్నాయి.

1869 - 2019 ఈనాడు మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

### ప్రేమ మూలిక!

కత్తులు దూసే కరడుగట్టిన శత్రువును కూడా స్నేహితుడిగా మార్చగల అత్యంత అరుదైన మహిమాన్విత మూలికే ప్రేమ. ఈ మూలికా వృక్షం సహనం, అహింసల నుండే పెరుగుతుంది.

– మహాత్మా గాంధీ

# ఆకునూర్.. కొమ్ము గుట్టలు భద్రం

- క్వారీ అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఫలించిన వివిధ సంఘాల పోరాటం

సైదాపూర్, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్ రెవెన్యూ గ్రామ శివారు పరిధిలోని సర్వాయిపాపన్న గుట్టలకు ఎట్టకేలకు ముప్పు తప్పింది. గ్రానైట్ మాఫియా నుంచి గుట్టలు ఇక సురక్షితంగా ఉండనున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కలర్ గ్రానైట్‌కు అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పలు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సర్దార్ సర్వాయి పాపన్న పాలించిన సర్వాయిపేట ప్రాంతం చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఇక్కడ సర్వాయి పాపన్న కట్టించిన కోటలు, బురుజులు... కొమ్ముగుట్టకు సమీపంలో నిర్మించిన చెరువులు పర్యాటక శోభను సంతరించుకున్నాయి. సర్వాయిపేట- ఆకునూర్ గ్రామాల మధ్య ఉన్న కొమ్ముగుట్టపై గ్రానైట్ మాఫియా కన్ను పడింది. 2011లో అప్పటి ప్రభుత్వం పలువురికి అనుమతులు ఇచ్చింది. ఆయా గుట్టల ప్రాముఖ్యం.. తవ్వకాలతో జరిగే నష్టాలపై 'ఈనాడు' జిల్లాపత్రికలో నాడు కథనాలు వెలువడ్డాయి. శివరాంపల్లి గ్రామానికి చెందిన జీవవైవిధ్య కమిటీ, రాష్ట్ర గీత సంఘం, జిల్లా ప్రజాఫ్రంట్ ఆందోళనలు చేపట్టాయి. 2014లో అప్పటి జిల్లా పాలనాధికారి, జిల్లా రెవెన్యూ అధికారి క్వారీకి అనుమతులు తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ గ్రానైట్ కంపెనీ పట్టు వదలకుండా క్వారీకి ఇటీవల అనుమతులు పొందింది. గత నెలలో సంబంధిత కంపెనీ యజమానులు క్వారీ ఏర్పాటుకు భూమి పూజ చేయడానికి రాగా ప్రజలు అడ్డుకున్నారు. క్వారీ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలంటూ పాపన్న గీత కార్మిక సంఘం, గౌడజన సంఘాలు, జీవ వైవిధ్య కమిటీ, ప్రజాఫ్రంట్‌లు ఐక్యంగా ధర్నాలు చేపట్టాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం క్వారీ అనుమతులు రద్దు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

### మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు గౌడ సంఘాల కృతజ్ఞతలు

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరులోని తెలంగాణ సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కోట, గుట్టల ప్రాంతంలో మైనింగ్ అనుమతుల రద్దుపై గీత, గౌడ సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సంఘాల నాయకులు గురువారం రాత్రి సచివాలయంలో ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి, కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ చూపి, సీఎం కేసీఆర్‌కు విన్నవించగా ఆయన స్పందించి మైనింగ్ లీజును రద్దు చేశారని సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి సచివాలయంలో క్షీరాభిషేకం చేశారు.

# ప్రైవేటే చోదక శక్తి

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుదల, సామర్థ్యం పెంపుదల, కార్మికుల ఉత్పాదకశక్తిలో మెరుగుదల, నూతన సాంకేతిక పరిజ్ఞానం అమలు, ఉద్యోగాల కల్పన, 'సృజనాత్మక విధ్వంసం' చేపట్టడంలో ప్రైవేటు రంగం కీలకంగా వ్యవహరిస్తుంది. కార్మిక రంగంలో సంస్కరణలు ప్రారంభించాలి. గృహ వినియోగ వస్తువుల డిమాండు పెరిగేందుకు ప్రోత్సాహకర ఆర్థిక విధానాలను అనుసరించాలి.

### వరుణుడి కరుణా ముఖ్యమే

ఆర్థిక వ్యవస్థ విస్తరించాలంటే పెట్టుబడులతో పాటు, వస్తువుల వినియోగమూ పెరగాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చమురు ధరలు తగ్గే సూచనలు ఉన్నాయి. ఇదే జరిగితే వస్తువుల వినియోగం పెరుగుతుంది. గ్రామ ప్రాంతాల్లో వస్తువుల కొనుగోళ్లు పెరగాలంటే వ్యవసాయ దిగుబడులు, ధరలు బాగుండాలి. ఇది సాకారం కావాలంటే వర్షాలు సక్రమంగా కురవాలి.

### అంతా నిరాశాపూరితం: చిదంబరం

ఆర్థిక సర్వేలో ప్రభుత్వ నిరాశావాదం కనిపిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి. చిదంబరం వ్యాఖ్యానించారు. రంగాల వారీగా వృద్ధి లక్ష్యాలను ఇవ్వలేదని, ద్రవ్య లోటుపై రాజీపడకుండా నిధుల సమీకరణపై స్పష్టత ఇవ్వలేదని, 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా పడే భారాన్ని అంచనా వేయలేదని విమర్శించారు.

# బ్యాలెట్‌తోనే పుర పోరు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ బి.నాగిరెడ్డి జిల్లా కలెక్టర్లు, పురపాలక కమిషనర్లను ఆదేశించారు. గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రచురణతో పాటు ఎన్నికల అధికారులు, సహాయ అధికారులు, ఇతర పర్యవేక్షకుల నియామకం చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లను గుర్తించడం, సిరా, బ్యాలెట్ బాక్సుల సంఖ్య, బ్యాలెట్ పత్రాలకు అవసరమైన కాగితం, ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌లను గుర్తించడం వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని నాగిరెడ్డి స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారి, ఎన్నికల అధికారులు, నోడల్ అధికారుల నియామకం, ఎన్నికల సామగ్రి కొనుగోలు, సిబ్బందికి శిక్షణ, సామగ్రి పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను గుర్తించాలని పేర్కొన్నారు. జోనల్ ఆఫీసర్లను నియమించాలని నాగిరెడ్డి సూచించారు.

### ఈసారి బ్యాలెట్ పోరు

గత విడత 2014వ సంవత్సరంలో పురపాలక ఎన్నికలను ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ల ద్వారా నిర్వహించారు. ఈసారి మాత్రం బ్యాలెట్ పత్రాలతో పురపాలక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా జరపాలనే నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలవైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. ఈవీఎంలను సిద్ధం చేసుకోవడం తదితరాలకు సమయం తీసుకునే అవకాశం ఉన్నందున బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు పూర్తి చేయనున్నారు.

### పుర పోరు తేదీలు

వార్డుల వారీగా ఓటర్ల జాబితా ముసాయిదా: జులై 12

అభ్యంతరాల స్వీకరణ: 12 నుంచి 16 వరకు

వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా: 18

జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం: 12

పురపాలికల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం: 13

పురపాలక కమిషనర్ల స్థాయిలో అభ్యంతరాల పరిష్కారం: 17

వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణ: 18

ఎన్నికలు జరిగేవి.. పురపాలక సంఘాలు: 131

నగరపాలక సంస్థలు: 3 (కరీంనగర్, నిజామాబాద్, రామగుండం)

ఎన్నికలు జరగనివి..

పాలకవర్గాల గడువు ఉన్న నగరపాలక సంస్థలు: హైదరాబాద్, ఖమ్మం, వరంగల్

గడువు ఉన్న పురపాలక సంఘాలు: సిద్దిపేట, అచ్చంపేట

షెడ్యూల్ట్ ప్రాంతాల్లో ఉంటూ ఎన్నికలు జరగని మున్సిపాలిటీలు: మందమర్రి, పాల్వంచ, మణుగూరు

### గ్రహం అనుగ్రహం

**5-7-2019 శుక్రవారం**

శ్రీ వికారి నామ సం॥ ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; శుక్ల పక్షం
తదియ: రా. 7.04 తదుపరి చవితి
ఆశ్లేష నక్షత్రం: రా. 3.56 తదుపరి మఖ
అమృత ఘడియలు: రా.2.24 నుంచి 3.55 వరకు
వర్జ్యం: సా. 5.20 నుంచి 6.51 వరకు
దుర్ముహూర్తం: ఉ.8.09 నుంచి 9.01 తిరిగి మ.12.29 నుంచి 1.21 వరకు
రాహుకాలం: ఉ.10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.5-34; సూర్యాస్తమయం: సా.6.33

### వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| ఖమ్మం | 42.0 | 28.0 |
| తిరుపతి | 40.6 | 29.1 |
| నల్గొండ | 38.4 | 23.4 |
| విజయవాడ | 37.6 | 27.9 |
| విశాఖపట్నం | 36.4 | 29.0 |
| హన్మకొండ | 36.3 | 27.5 |
| సూర్యాపేట | 35.0 | 30.0 |
| హైదరాబాద్ | 32.6 | 24.6 |
| రామగుండం | 31.6 | 25.4 |
| ఆదిలాబాద్ | 31.5 | 24.6 |
| నిజామాబాద్ | 31.1 | 25.4 |
| కరీంనగర్ | 29.0 | 24.0 |
| మహబూబ్‌నగర్ | 28.9 | 24.0 |

Eenadu epaper




For Institutional/Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in | *Ex-showroom Price Telangana drum variant. #Down payment excluding the processing fee. Finance at the sole discretion of financier at dealership. Terms & Conditions apply.

**Authorised Dealers For Bajaj Auto Ltd.:** Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545 • Nizamabad BIJAY BAJAJ 08462-234013,234014 , 8885671855, VIJAYA GANAPATHI AUTOMOTIVES 08462-238239,9849590160 • Mancherial MAHI BAJAJ 08736-259088 9912278641 • Adilabad SRR MOTORS 9491249451,9491159452, 2221966 • Warangal ANIKA BAJAJ 0870-2422299, 9885953888 • Hanamkonda SELECT BAJAJ 7702611220, 0870-6565205 • Nalgonda SANSAI BAJAJ 9160789555, 9160888876 • Miryalaguda SANSAI BAJAJ 9247020304, 9160059997 • Khammam VENKATRAMANA BAJAJ 9100266191,9618378135 • Kothagudem SAI ANJANA BAJAJ 7799444544, 9912162299 • Mahboobnagar HAROON BAJAJ 08542-220060, 220070 , 9010844457 • Gadwal SRI SAI BAJAJ 8886667721 • Siddipet TALWAR BAJAJ 7702015577. **Authorised Service Centre**: JAGITIAL 8522038460, 9949565692 SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849184700, 9849362096, MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064, JANNARAM 9440004495, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, , NIRMAL 9010792792, THORRUR 9440874469, MAHABUBABAD 9949518874, 9063932333 MARRIPEDA 9908243623, KESAMUDRAM 9705580303, NARSAMPET 9346070143, MULUGU 7396336262, JANGAON 7702711220, STN GHANPUR 7702322110, PARKAL 7702922110, BHUPAL PALLY 8341027588, CHOUTUPAL 9290121333, BHONGIR 9247023637, MUNUGODE 9912996208, SURYAPET 8886936767, KODAD 9542488888 9848644441, THALLADA 9701802572, YELLANDU 9849869835, SATHUPALLI 9491924400, MADHIRA 8886888789, ENKURU 7732020146, ASWARAOPET 8367219219, WYRA 9052528181, NELAKONDAPALLI 9959691501, BHADRACHALAM 7799555355, PALAVANCHA 9848382500, MANUGURU 9440509779, WANAPARTHY 9010878618, KODANGAL 9010844470, KOTHAKOTA 9666211068, KALWAKURTHY 9010878619, SHADNAGAR 9010844462, NAGARKURNOOL 966610050, Makthal 9640783999 , PEBBAIR 9603926999 , KALLURU 9000380161, AMANGAL 8978934455, IEEJA 9989922894, SHANTINAGAR 9494767233, YERRAVALLI 9948276249, ALAMPUR 9849304403.

Eenadu epaper

ఈనాడు

## వృద్ధి మంత్రం

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఘనత మనదేనన్న తాజా ఆర్థిక సర్వే 2019-20 సంవత్సరంలో భారత వృద్ధి రేటు ఏడు శాతానికి తగ్గబోదని అంచనా వేస్తోంది. వేరే మాటల్లో, మూడు నెలలనాటి అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) భవిష్యద్దర్శనానికిది ప్రతిధ్వని! ఏడాదిన్నర క్రితం పార్లమెంటుకు సమర్పించిన సర్వే 2018-19లో వృద్ధిరేటు ఏడునుంచి ఏడున్నర శాతందాకా ఉండనుందన్నా, వాస్తవంలో అది 6.8శాతానికే పరిమితమైంది. 1950-73 మధ్య జపాన్ జీడీపీలో 10శాతానికి మించి వృద్ధి నమోదు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయంటున్న తాజా ఆర్థిక సర్వే- భారీ మెజారిటీతో పునరధికారం సాధించిన ఎన్డీయే రెండో జమానాలో వ్యయీకరణ, ప్రైవేటు పెట్టుబడులు విస్తరించి స్థూల దేశీయోత్పత్తి కొత్త రెక్కలు తొడుక్కోవడం తథ్యమంటోంది. 2024 నాటికి అయిదు లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ. 350 లక్షల కోట్ల) భారీ ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి అధమపక్షం ఎనిమిది శాతం వృద్ధిరేటు ఆవశ్యకమనడంలోనే విధాన సంస్కరణలది కీలక భూమికన్న సందేశం ప్రస్ఫుటమవుతోంది. అన్నదాతలు ఈసురోమంటున్న వ్యవసాయ ప్రధాన దేశంలో నాటకీయ వృద్ధిరేటు ఆకాశంలోంచి ఊడిపడదు. రైతుల రాబడిని రెండింతలు చేసేందుకు 14.5శాతం మేర ఉండాల్సిన వ్యవసాయాభివృద్ధి రేటు రెండేళ్ల క్రితం సంతృప్తికర స్థాయిలో వానలు కురిసినప్పుడే రెండు శాతానికి పరిమితమైనప్పుడు, లోటు వర్షపాతం వెక్కిరిస్తున్న ఈ ఏడాది ఎలా పుంజుకోగలదో ఆర్థికవేత్తలే వివరించాలి! పెట్టుబడులు, పొదుపు, ఎగుమతులు, వృద్ధి, ఉపాధి అవకాశాలు ఇతోధికమైతే భారత ఆర్థిక స్వస్థతకు తిరుగుండదని కృష్ణమూర్తి సుబ్రమణియన్ చేతుల మీదుగా రూపొందిన సర్వే నమ్మకంగా చెబుతోంది. తక్కిన ప్రపంచ దేశాలు వృద్ధిపరమైన సవాళ్లను ఎదుర్కొంటుండగా, మరోవైపు వాణిజ్య యుద్ధమేఘాలు కలవరపరుస్తుండగా- స్వీయ వృద్ధి ప్రస్థానం మందగించకుండా భారత్ ఎలా కాచుకుంటుందన్న ప్రశ్నకు నేటి బడ్జెటే బదులివ్వాలి!

పొరుగున జన చైనా మధ్యతరగతి ప్రజానీకం ఆదాయ ప్రయోజనాలకు గొడుగుపట్టే విధాన సంస్కరణలకు పెద్దపీట వేయగా, దేశంలో దశాబ్దాల తరబడి ఆ కీలక పార్శ్వం దారుణ నిర్లక్ష్యానికి గురైంది. వృద్ధి, ఉపాధి చెట్టపట్టాలు కట్టి సాగితేనేగాని సమతుల ప్రగతి దుర్లభమన్న స్పృహ మునుపటి ప్రభుత్వాల్లో కొరవడ్డ పర్యవసానంగా జాతి ఇప్పటికీ భారీ మూల్యం చెల్లించుకుంటోంది. రిజర్వ్‌బ్యాంక్ సారథ్య బాధ్యతలు చేపట్టకముందు ఏడేళ్లనాటి ఆర్థిక సర్వేలో రఘురాం రాజన్ ఉపాధి కల్పన ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని ఉద్బోధించారు. రెండేళ్ల క్రితం తనవంతుగా ముఖ్య ఆర్థిక సలహాదారు హోదాలో అరవింద్ సుబ్రమణియన్ 'ఉపాధి రహిత వృద్ధి'పై ఆందోళన చెందినా- కార్యాచరణ తేటపడలేదు. దేశంలో ఉపాధి అవకాశాల విస్తరణకు నూతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం దోహదపడగలదంటున్న నిన్నటి సర్వే- ముఖ్యంగా సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమ (ఎస్ఎమ్ఎస్ఈ)లను ప్రభుత్వం అక్కున చేర్చుకోవాలని సిఫార్సు చేసింది. ఉపాధి కల్పన, ఎగుమతుల పెంపుదల, ఆర్థికాభివృద్ధి తదితరాలు పరస్పరం ముడివడిన అంశాలంటున్న సర్వే ఉద్బోధ గతానికి భిన్నమైన భావజాలాన్ని ఆవిష్కరిస్తోంది. ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో రాబడి పెంపొందే అవకాశాలు ఉంటాయన్న సర్వే ఆశావహ అంచనాలే విస్మయపరుస్తున్నాయి. వాతావరణ మార్పుల దుష్ప్రభావాల కారణంగా సేద్య రాబడి 20-25 శాతం మేర క్షీణిస్తుందన్న గత సర్వే మదింపుల్ని తోసిరాజనే స్థితిగతులు నేడు ఎక్కడున్నాయి? గ్రామీణ ప్రాంతాల నుంచి నిరంతర వలసలను నిరోధించేలా స్థానికంగా ఖాదీ, కుటీర పరిశ్రమలకు ఊపిరులూదాలన్న కమిటీల సూచనలు; రైతు జీవన భద్రతను లక్షిస్తూ స్వామినాథన్ చేసిన సహేతుక సిఫార్సులు ఎన్నింటినో పేరబెట్టినన్నాళ్లు- కలతబారిన కుగ్రామాలు కుదుటపడవు!

గడచిన అయిదేళ్లూ స్థిర ప్రగతి సాధ్యపడిందని కితాబిచ్చే క్రమంలో కొన్ని అంశాలకు మసిపూసి మారేడు చేసే యత్నం ఆర్థిక సర్వే నిష్పాక్షికతను బోనులో నిలబెట్టేదే. కేంద్రపన్నుల విభాజ్య నిధిలో రాష్ట్రాల వాటా 32 నుంచి 42 శాతానికి పెంపొందడం ద్రవ్య సమాఖ్య స్ఫూర్తికి దర్పణమనడం అతిశయోక్తే. ఈ నాలుగేళ్లలో రాష్ట్రాలకు నికర కేటాయింపులు ఏ దశలోనూ 35 శాతానికి మించలేదన్న అధ్యయనాలు కేంద్రప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయి! దేశంలో పారిశుద్ధ్య సేవలు అంతంతమాత్రమేనని తూర్పారపట్టిన పార్లమెంటరీ స్థాయీసంఘం, వివిధ రాష్ట్రాల్లో రూ.14 వేలకోట్లకు పైగా స్వచ్ఛ నిధులు మురిగిపోతున్నాయని నిరుడీ రోజుల్లో లెక్క చెప్పింది. ఆ ఊసెత్తని ఆర్థిక సర్వే స్వచ్ఛభారత్ నుంచి స్వస్థ భారత్ మీదుగా సుందర భారత్‌కు ప్రస్థానిద్దామని పిలుపిస్తోంది! సాంకేతికతతో ఉపాధి హామీ పథకాన్ని పరిపుష్టీకరించడం మొదలు పరిమిత సంఖ్యలో ఖాళీల భర్తీ ద్వారా జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో పెండింగ్ కేసులకు మోక్షం ప్రసాదించడం వరకు భిన్న పార్శ్వాల్ని ఈ సర్వే స్పృశించింది. సత్వర న్యాయపాలన సహా అనేకాంశాలపై నిర్ణయరాహిత్యం, అనిశ్చితి అయిదు దశాబ్దాలుగా వెలుపలి పెట్టుబడిదారుల్ని బెంబేలెత్తించాయన్నది చేదు నిజం. తాజా ఆర్థిక సర్వే సూటిగా హెచ్చరించకపోయినా- దేశీయ తయారీ రంగం మందభాగ్యంతో కునారిల్లుతోంది. విద్యుత్, స్థిరాస్తి, టెలికాం, బొగ్గు, విమానయానం వంటి మౌలిక రంగాలు తరతమ భేదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఆరోగ్యం, విద్య, తలసరి ఆదాయాల ప్రాతిపదికన భారత్‌ది మధ్యస్థ ప్రగతేనని సమితి నివేదిక ఇటీవలే నిర్ధారించింది. పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు అవినీతి, అవకతవకల చీడపట్టి జనాభాలో పదిశాతం (13.6 కోట్లమంది) అత్యంత నిరుపేదలు అప్పుల ఊబిలో కూరుకుపోయిన దేశం మనది. దుర్భర దారిద్ర్యాన్ని దునుమాడటంతోపాటు అపార మానవ వనరుల్ని సద్వినియోగపరచుకునేలా సేద్యం, పరిశ్రమలు, సేవారంగాల్లో దీటైన విధాన క్షాళనే దేశాన్ని పురోగమింపజేయగలిగేది. ఈ సమగ్ర చిత్రాన్ని కళ్లకు కట్టడంలో నిన్నటి సర్వే విఫలమైందనే చెప్పాలి!

# లెక్క తేలని నల్లధనం



డాక్టర్ కల్లూరు శివారెడ్డి

లెక్కాపత్రాల్లేని లక్షల కోట్ల రూపాయల సొమ్ము రెక్కలొచ్చి దేశం నుంచి ఎగిరిపోయిందన్న మాట గడచిన కొన్నేళ్లుగా వినిపిస్తూనే ఉంది. దేశ, విదేశాల్లో భారతీయులు దాచుకున్న డబ్బు ఎంత, దాన్ని బయటకు తీసుకురావడమెలా అన్నది గడచిన ఇరవయ్యేళ్లుగా పౌర, రాజకీయ వర్గాల్లో అత్యంత చర్చనీయమైన అంశం! దీనిపై విత్త పరిశోధన సంస్థలు, ఆర్థిక నిపుణులు చేసిన అంచనాలపై మొదటి నుంచి విశ్లేషకుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఒకవైపు భారత స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో నల్లధనం వాటా 22.4 శాతంగా ఉందని 2010లో ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. మరోవంక దేశ జీడీపీలో నల్లధనం 75 శాతానికి పైగానే ఉందని 'ఫిక్కీ' అంచనాలు వినిపించింది. అక్రమ సొత్తుకు సంబంధించి వివిధ సంస్థలు, అనేక సమయాల్లో భిన్నమైన అంచనాలు సమర్పించాయి. ఆ అంచనాలపై సందేహాలు ఉండటంవల్ల దేశంలో నల్లధనం లెక్కలను నిర్దుష్టంగా నిగ్గుతేల్చాలని 2011లో నాటి కేంద్ర ప్రభుత్వం భావించింది. ఆ బాధ్యతను విఖ్యాత సంస్థలైన- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్ఎం) అనే మూడు ప్రభుత్వ పరిశోధన సంస్థలకు అప్పగించారు. అక్రమ సొత్తు తీరుతెన్నులపై ఈ మూడు సంస్థలు వేర్వేరుగా అధ్యయనాలు నిర్వహించి- 2014లో తమ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాయి. ఆ నివేదికలను పార్లమెంటరీ స్థాయీసంఘానికి ప్రభుత్వం పరిశీలన కోసం నివేదించింది. దాదాపు అయిదేళ్ల తరవాత 24 జూన్, 2019న వీరప్ప మొయిలీ సారథ్యంలోని ఆ ప్యానెల్ నివేదికాంశాలను పార్లమెంటుకు సమర్పించింది. విచిత్రంగా ఆ మూడు సంస్థల నివేదికలను పరిశీలిస్తే వాటికీ నల్లధనం విస్తృతిపై స్పష్టమైన అంచనా లేదని బోధపడుతోంది. ఎన్ఐపీఎఫ్‌పీ, ఎన్‌సీఏఈఆర్, ఎన్ఐఎఫ్ఎం సంస్థలు ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం 1980-2010 మధ్య దేశం గడపదాటించి భారతీయులు దాచిన సంపద విలువ- 21,648 కోట్ల డాలర్ల నుంచి 49,000 కోట్ల డాలర్ల మధ్యలో ఉంది. ఈ మూడు సంస్థలు సమర్పించిన లెక్కల్లో తీవ్రమైన వ్యత్యాసాలున్నాయి. నల్లధనంపై అంచనాలే స్పష్టంగా లేని పరిస్థితుల్లో, దాని కట్టడికి జరిపే పోరాటం ఏ మేరకు సత్ఫలితాలిస్తుందన్నది చర్చనీయాంశం!

## అసంపూర్ణ అంచనాలు

భారత స్థూల దేశీయోత్పత్తి (2009-10, 2010-11)లో నల్లధనం వాటా ఏడు శాతంనుంచి 120 శాతం మధ్య ఉందని ఆ సంస్థలు అంచనా వేశాయి. ఆ సంస్థలు వెలువరించిన గణాంకాలు ఒక దానితో మరొకటి పొంతన లేకుండా ఉండటంతో- నిజానిజాలపై ఎప్పటి గందరగోళమే పునరావృతమైంది. ఇంకాస్త సమయం లభించి ఉంటే నల్లధనాన్ని నిర్దిష్టంగా లెక్కించడం అంత 'కష్టమేమీ కాదు' అని పార్లమెంటు ప్యానెల్ సారథిగా వీరప్ప మొయిలీ వెలిబుచ్చిన అభిప్రాయం వాస్తవాలకు దూరంగా ఉంది. దేశంలో నల్లడబ్బు ఎంతన్నదానిపై కచ్చితమైన లెక్క తేలకపోవడానికి ప్రధాన కారణం నల్లధనాన్ని సరిగ్గా నిర్వచించుకోలేకపోవడమే! నల్లధనాన్ని లెక్కించడానికి వివిధ సంస్థలు అనేక రకాల గణాంక శాస్త్ర పద్ధతులను ఉపయోగించడం అస్పష్టత కొనసాగడానికి రెండో కారణం. సాధారణ భాషలో నల్లధనం అంటే చట్టవిరుద్ధ మార్గాల ద్వారా, ఆదాయంపై పన్ను దాటవేయడం ద్వారా సమకూర్చుకున్న సంపద.



## ప్రభుత్వంపై బృహత్తర బాధ్యత

నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలు వంటి చట్ట విరుద్ధ మార్గాల్లో సొమ్ము సమకూర్చుకునే వ్యక్తులు ఎలాగూ ఆ వివరాలను ప్రభుత్వ విభాగాలకు వెల్లడించరు. మరోవంక చట్టబద్ధంగా సంపాదించిన ఆదాయాలపై పన్ను ఎగవేయడం. ఉదాహరణకు, ఎవరైనా ఆర్థికవేత్త సదస్సులో ఒక విషయంపై ఉపన్యసించినందుకు నిర్వాహకులు ఆయనకు నగదు రూపంలో కొంత మొత్తం చెల్లించారనుకుందాం. ఆయన ఆ మొత్తాన్ని తన వార్షికాదాయ పన్ను చెల్లింపుల్లో ఆదాయంగా చూపకపోతే అది నల్ల ఆదాయం కిందికే వస్తుంది. ఇలాంటివన్నీ కలిస్తేనే నల్ల ఆర్థిక వ్యవస్థ (బ్లాక్ ఎకానమీ) తయారవుతుంది. నల్లధనాన్ని ఇక్కడ నిర్వచించిన తీరే దాన్ని లెక్కించడాన్ని కష్టతరం చేస్తుంది! తమ ఆర్థిక కార్యకలాపాలను పౌరులు ప్రభుత్వాలకు వెల్లడించకపోతే వాటి వివరాలను నిర్దిష్టంగా లెక్కించడం సర్కారుకు సాధ్యం కాదు. స్థిరాస్తి, మైనింగ్, ఫార్మాస్యూటికల్స్, పాన్ మసాలా, గుట్కా, పొగాకు పరిశ్రమ, బులియన్ మార్కెట్, చిత్ర పరిశ్రమ, విద్య వంటి రంగాల ద్వారా దేశంలో నల్లధనం పెద్దయెత్తున పోగుడుతోందని పార్లమెంటు ప్యానల్ వెల్లడించిన నివేదికలు స్పష్టీకరిస్తున్నాయి. నకిలీ కరెన్సీ నోట్ల చలామణీని అరికట్టడం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం వంటి లక్ష్యాలతో 'పెద్దనోట్ల రద్దు' వంటి నిర్ణయం తీసుకుని అమలు జరిపినప్పటికీ- ఒనగూడిన ఫలితాలపై భిన్నాభిప్రాయాలున్నాయి.

### లొసుగులే శాపాలు

చట్టాల్లోని లోపాలను ఉపయోగించుకొని నల్లధనం విస్తరించింది. అది ఒకరకంగా దేశంలో సమాంతర ఆర్థిక వ్యవస్థనే సృష్టించింది. ప్రభుత్వాలూ, కేంద్ర బ్యాంకులూ తమ నిర్ణయాలను అమలు చేయడంలో నల్లధనం తీవ్ర ప్రతిబంధకంగా ఉంది. ఎనిమిదో దశకం నుంచి దేశంలో ప్రబలిన నల్లధనం కారణంగా భారతావని అయిదు శాతం ఆర్థిక వృద్ధిని కోల్పోతోందన్నది నిపుణుల అంచనా. నల్లధనం సమస్య లేకపోయినట్లయితే భారత్ ఈ సరికే అమెరికా తరవాత అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెంది ఉండేది. భారత్ తలసరి ఆదాయం ప్రస్తుతం ఉన్న 2015.6 డాలర్ల (2018 మార్చి నాటికి) కంటే 11 రెట్లు గొప్ప స్థితిలో ఉండి మధ్య ఆదాయ దేశాల సరసన ఒకటిగా నిలిచేది. ఈ సమాంతర ఆర్థిక వ్యవస్థ కారణంగా భారతావని తన పూర్తి శక్తి సామర్థ్యాలతో వికసించలేకపోతోంది. దేశంలో రెండో దశ ఆర్థిక సంస్కరణల అమలు తరవాత నల్లధనంపై ప్రభుత్వాల వైఖరి కొంత కఠినతరంగానే మారిందని చెప్పాలి.

## దేశీయంగానే అధికం

2014నాటి సార్వత్రిక ఎన్నికల్లో భారతీయులు విదేశాల్లో దాచుకున్న నల్లధనం వెలికితీత అన్నదే ప్రధాన ప్రచారాంశంగా మారింది! మోదీ సర్కారు తొలి దశలో అధికారంలోకి వచ్చినప్పటినుంచి నల్లధనం వెలికితీతకు సంబంధించి అనేక చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు, బ్లాక్ మనీ అండ్ ఇంపొజిషన్ ఆఫ్ టాక్స్ చట్టం (2015), బినామీ లావాదేవీల సవరణ బిల్లు (2015), వివిధ దేశాలతో ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొనే ఒప్పందాలు, వస్తుసేవల పన్ను అమలు వంటివి ముఖ్యమైనవి. మూడున్నర లక్షల రూపాయల మేర లావాదేవీలు సాగించే అనుమానాస్పద సంస్థల (షెల్ కంపెనీలు) రిజిస్ట్రేషన్ల రద్దు వంటి చర్యలనూ ప్రభుత్వం తీసుకుంది. వాటికి తోడు ఆదాయ ప్రకటన పథకం (ఐడీఎస్)-2016 వంటి అమ్నెస్టీ పథకాన్నీ అమలు చేశారు. 1997లో అమలు చేసిన స్వచ్ఛంద ఆదాయ ప్రకటన పథకం (వీడీఐఎస్) రూ.33,000 కోట్ల నల్లధనం వెలికిరావడానికి కారణమైంది. తద్వారా పదివేల కోట్ల రూపాయల మేర పన్ను ఆదాయం ప్రభుత్వానికి దఖలు పడింది. 2016 ఐడీఎస్‌ద్వారా రూ.65,250 కోట్ల నల్లధనం బయటపెట్టారు. నిజానికి పెద్దయెత్తున మేటలు వేసిన నల్లధనంతో పోలిస్తే బయటపడిన మొత్తం చాలా స్వల్పం. ఏదో ఒక అంచనా పద్ధతిని ప్రాతిపదికగా తీసుకుని నల్లధనాన్ని వివిధ కాలావధుల్లో లెక్కించాలి. ఆ రకంగా గణించిన మొత్తం ఆయా కాలావధులు గడిచేకొద్దీ తగ్గుతుందా లేక పెరుగుతుందా అన్న విషయాన్ని లెక్కతేల్చాలి. దాని ఆధారంగా ప్రభుత్వం తన కార్యాచరణను అమలుచేయాలి. నల్లధనాన్ని అరికట్టేందుకు తొలుత పన్ను ఎగవేతకు సంబంధించిన లొసుగులను పూడ్చివేయాల్సి ఉంటుంది. 2001లో జీడీపీలో పన్నుల వాటా 8.7 శాతంగా ఉంది. అది 2008నాటికి 12.1శాతానికి చేరింది. ఆ తరవాత 2019నాటికి ఆ వాటా 10.9 శాతానికి పడిపోయింది. పన్ను ఆదాయం కోసుకుపోకుండా గట్టి చర్యలు తీసుకోవడం ఇప్పుడు చారిత్రక అవసరం. అప్పుడే నల్లధన వ్యాప్తిని అడ్డుకోవడం సాధ్యమవుతుంది. ఎన్ఐఎఫ్ఎం అంచనాల ప్రకారం మొత్తం నల్లధనంలో దేశం దాటింది కేవలం 10 శాతమే! అంటే హెచ్చు మొత్తంలో నల్లధనం దేశీయంగానే వివిధ రంగాల్లో, వివిధ రూపాల్లో పాతుకుపోయిందన్నమాట. ఈ డబ్బును వెలికితేవాలంటే పన్నుల రేట్లను తగ్గించి పౌరులకు నల్లడబ్బును బయటపెట్టే అవకాశాలు పెంచాలి. ప్రత్యక్ష పన్ను చట్టాలను సరళీకృతం చేసి, వాటిని మరింత హేతుబద్ధంగా తీర్చిదిద్దాలి. దేశంలో చోటుచేసుకునే వివిధ లావాదేవీలపై ఆకస్మిక తనిఖీలు జరగాలి. చెల్లింపుల్లో ఎలాంటి అక్రమాలు జరిగినా, జరిమానాలు విధించడంతోపాటు- ఆయా సంస్థల వ్యాపార రిజిస్ట్రేషన్లనూ రద్దుచేసే స్థాయిలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. మరోవంక ప్రతి వ్యాపార లావాదేవీని డిజిటలీకరించి ఆర్థిక వ్యవస్థలో సాధ్యమైనంత మేర పారదర్శకత తీసుకురావాలి. అప్పుడే దారితప్పిన ఆర్థిక కార్యకలాపాలను గుర్తించే అవకాశాలు మెరుగుపడతాయి.

(రచయిత- పుణెలోని గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనమిక్స్‌లో ఆచార్యులు)

# కాసుల గర్భాలకు కళ్లెం

అద్దెగర్భం (సరోగసీ) విధానంలో వాణిజ్య పోకడలను నిరోధించే బిల్లును కేంద్ర మంత్రివర్గం అనుమతించడంతో 'భారత్‌లో కృత్రిమ పద్ధతుల్లో పిల్లల తయారీ' వ్యాపారానికి ఇక కళ్లెం పడనుంది. అదే సమయంలో అద్దె గర్భం ఇవ్వడానికి బంధువర్గం, స్నేహితులు దొరక్కపోతే మాతృత్వం కోసం ఆరాటపడే దంపతుల ఆశలు నీరుగారే పరిస్థితి ఎదురుకానుంది. అనేక కారణాల వల్ల పిల్లలు కలగని భార్యాభర్తలకు అద్దెగర్భం విధానం ఒక వరం లాంటిది. భారతదేశంలో ఈ విధానం 2002 నుంచి 2018 వరకు విదేశీయులకు సంతాన సాఫల్య వరదాయినిగా నిలిచింది. అనేకమంది దేశ, విదేశీ దంపతులకు పిల్లలను అందించి 'ప్రపంచ ఊయల'నే పేరు గడించింది. 'సరోగసీ హబ్'గా పేరొంది 'ఫెర్టిలిటీ టూరిజం' కేంద్రంగా అభివృద్ధి చెందింది. గుజరాత్‌లోని ఆనంద్, సూరత్, జమున నగరాల్లో సంతాన సాఫల్య కేంద్రాలు స్వల్పకాలంలోనే ఇబ్బడి ముబ్బడిగా వెలిసి, 'కృత్రిమ పిల్లల ఉత్పత్తి కుటీర పరిశ్రమలు'గా వృద్ధిచెందాయి.

సంతానోత్పత్తి పర్యాటకానికి ఇజ్రాయెల్ ప్రపంచంలోనే ప్రసిద్ధి పొందింది. అమెరికా, అనేక ఐరోపా దేశాలనూ ఈ విధానం ఆకట్టుకుంది. అక్కడున్న చట్టాల ప్రకారం అద్దెగర్భం ద్వారా బిడ్డను పొందడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అక్కడి చట్టాలూ కఠినతరం. ఆయా దేశాల్లో వాణిజ్య ధోరణిలో అద్దె గర్భాల ద్వారా పిల్లల్ని పొందడం పూర్తిగా నిషేధం. రష్యా, ఉక్రెయిన్, జార్జియా, థాయ్‌లాండ్, అమెరికాలో కొన్ని రాష్ట్రాలు మాత్రమే వాణిజ్యపరమైన అద్దె గర్భాల పద్ధతిని అనుమతిస్తున్నాయి. ఫలితంగా అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలకు చెందిన దంపతులు భారత్ వైపు దృష్టి సారిస్తున్నారు. మనదేశంలో అద్దె గర్భానికయ్యే సగటు వ్యయం 10 నుంచి 15 లక్షల రూపాయలు. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో అయ్యే వ్యయంతో పోలిస్తే మూడోవంతు మాత్రమే. ఐక్యరాజ్య సమితి 2012లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం భారత్‌లో సాలీనా 40 కోట్ల డాలర్ల వ్యాపార లావాదేవీలు జరిగినట్లు అంచనా. నగరాల నుంచి పట్టణాల వరకు మూడువేల అధికారిక, అనధికారిక సంతాన సాఫల్య కేంద్రాలు వెలిసినట్లు ఈ సర్వే తెలిపింది. 'సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చ్' అనే సంస్థ తన అధ్యయనంలో గుజరాత్, మహారాష్ట్రలోని పేద, మధ్యతరగతి మహిళలు అనేకమంది, గర్భాలు అద్దెకు ఇవ్వడాన్ని ఓ ఉపాధిగా ఎంచుకున్నారని వెల్లడైంది.

'బేబీ మంజిస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు వల్ల అద్దెగర్భం విధానం చట్టబద్ధత దేశంలో చర్చకు దారితీసింది. 2007లో జపాన్ దంపతులు ఇకుఫుమి, యుకియమద గుజరాత్‌లోని ఆనంద్‌లోని 'ఆకాంక్ష సంతాన సాఫల్య కేంద్రం' వైద్యుడు పటేల్‌ను సంప్రదించారు. అద్దెగర్భం ద్వారా మంజి అనే పాప పుట్టింది. ఇంతలో జపాన్ దంపతులు విడాకులు తీసుకున్నారు. బేబీ మంజిని స్వీకరించడానికి తల్లి యుకియమద నిరాకరించింది. దీంతో ఈ కేసులో తల్లి ఎవరు, బిడ్డ ఏ కుటుంబానికి చెందుతుంది, ఆ బిడ్డ



పార్లమెంటు ముందుకు బిల్లు

జాతీయత తదితర విషయాలపై సమస్య తలెత్తింది. మంజి కేసు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీనికి సంబంధించి చట్టాలు తయారు చేయాలనే ఆలోచనలకు నాంది పలికింది. మన దేశంలో ఏ రకమైన చట్టాలు, నియమ నిబంధనలు లేని కారణంగా గ్రామీణ నిరుపేద మహిళలు దోపిడికి గురయ్యారు. సంతాన సాఫల్య కేంద్రాల నిర్వాహకులు కనీస వృత్తి విలువలు పాటించలేదు. అద్దెగర్భానికి సంబంధించి 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' విధివిధానాల్ని రూపొందించింది. ఈ క్రమంలోనే 'అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ బిల్లు- 2010', తాజాగా 'సరోగసీ రెగ్యులేషన్ బిల్లు' వంటివి వెలుగులోకి వచ్చాయి. గతంలోనే లోక్‌సభలో అద్దెగర్భం నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టారు. అప్పట్లో దిగువ సభలో బిల్లు పాసైనా, ఎగువసభ వద్ద నిలిచిపోయింది. దీంతో మళ్లీ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు వాణిజ్యపరమైన అద్దె గర్భం విధానాన్ని పూర్తిగా నిషేధించింది. ధనాపేక్ష లేని, దగ్గరి బంధువులు, రక్తసంబంధీకుల సహకారంతో పిల్లల్ని కనడానికి అనుమతిస్తూ నియమాలు రూపొందించారు. విదేశీ, ప్రవాస భారతీయులకు పిల్లలు పొందే హక్కును నిషేధించారు. నియమాలను ఉల్లంఘిస్తే పదేళ్ల జైలుశిక్ష లేదా పది లక్షల రూపాయల జరిమానా విధించనున్నారు. అద్దెగర్భం ద్వారా సంతానం పొందే బదులు అనాథలను దత్తత తీసుకునేలా సంతానంలేని దంపతులను ప్రోత్సహించే దిశగా ఈ బిల్లు తెచ్చారన్నది ఒక వాదన. డబ్బు ఆశ చూపి, గ్రామీణ మహిళలను వైద్యులు, దళారులు దోపిడి చేస్తున్నారనేది మరో అంశం. సహజీవనం, స్వలింగ వివాహాలను అనుమతించిన సమయంలో ఈ బిల్లును కేవలం 'హెటిరో సెక్సువల్' దంపతులకు మాత్రమే అనుమతించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమనే విమర్శలున్నాయి. బిల్లు అమలైతే గర్భాన్ని అద్దెకివ్వడం ద్వారా గుజరాత్‌లో ఒక మహిళ తొమ్మిది నెలల వ్యవధిలో దాదాపు నాలుగు లక్షల రూపాయలు సంపాదించే అవకాశం కోల్పోతుందని ఒక అధ్యయనం పేర్కొంది. ఇది చాలా సున్నితమైన, భావోద్వేగాలతో కూడుకున్న సమస్య. పిల్లల్ని కనడం, కనకపోవడం దంపతుల ఇష్టం. ప్రభుత్వ జోక్యం ఎందుకన్న విమర్శలూ ఉన్నాయి. ఈ సమస్యను సామాజిక కోణంలో ఆలోచించి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాణిజ్య ధోరణులను నిషేధించినా, తెరచాటున ఈ వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా విస్తరించే ప్రమాదమూ లేకపోలేదు. 'ది హేగ్ కన్వెన్షన్-1980' లాంటి అంతర్జాతీయ చట్టాలతో పాటు, మనదేశంలో పటిష్ఠమైన న్యాయవ్యవస్థను ఏర్పాటుచేసి ఈ సమస్యలను అధిగమించే ప్రయత్నం చేయాలి. 'అమ్మతనాన్ని' పొందలేని మహిళలకు పిల్లల్ని ప్రసాదించే వెసులుబాటు కల్పిస్తూ, ఇది దుర్వినియోగం కాకుండా నివారణ చర్యలు చేపట్టినప్పుడే ఈ చట్టానికి సార్థకత చేకూరుతుంది.

– డాక్టర్ రమేష్ బుద్ధారం

## ఈనాడు లేఖలు

### ఆట పదునెక్కితేనే ప్రపంచ కప్పు

ప్రపంచకప్పు క్రికెట్ సెమీఫైనల్‌కు భారత దేశం అర్హత సాధించినా జట్టు ఆటతీరు విషయంలో అభిమానుల్లో కొంత అసంతృప్తి లేకపోలేదు. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ వంటి చిన్నజట్లపైనా చెమటోడ్చి గెలవాల్సి రావడం అందుకు నిదర్శనం. కీలకమైన టాస్ కోల్పోయి, ఆరంభంలో తడబాటు పడినా, తరవాతి ఆటగాళ్లు నిలిచి పరుగులు రాబట్టాలి. బంతి ఎక్కువగా స్వింగ్ అయ్యే ఇంగ్లాండులో బౌండరీలు, సిక్సర్లకన్నా ఒకటి రెండు పరుగులు రాబట్టడం ద్వారా ఇన్నింగ్సును నిర్మించాలి. పెద్ద స్కోరు కావాలంటే దిగువశ్రేణి బ్యాట్స్‌మన్ల రాణింపూ అవసరం. భారత జట్టులో అది లోపిస్తోంది. అనుభవజ్ఞుడు ధోని మందకొడి బ్యాటింగ్ జట్టులోని ఇతర ఆటగాళ్లపై ఒత్తిడి పెంచుతోంది. దిగువశ్రేణిలో బ్యాటింగ్, తొలి ఓవర్లలోనే వికెట్లు పడగొట్టేలా బౌలింగ్ మరింత పదునుతేలితే- ప్రపంచకప్పు మనదేననడంలో మరో మాట లేదు!

- టి.జయచంద్రమోహన్, షాపూర్, హైదరాబాద్

### పూర్తిస్థాయి మంత్రివర్గమేది?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఆరు నెలలైనా ఇంకా పూర్తి స్థాయిలో మంత్రివర్గం ఏర్పాటు కాలేదు. దీంతో పలు శాఖల్లో స్తబ్దత నెలకొంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు అర్హులందరికీ అందాలంటే ఆయా శాఖల అధికారులకు సంబంధిత అమాత్యుల నుంచి సూచనలు, దిశానిర్దేశం అవసరం. ప్రధానమైన పలు శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ముఖ్యమంత్రి ఇప్పటికైనా పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ చేరేలా చర్యలు చేపట్టాలి. అదే సమయంలో ఆయా శాఖల్లో ఉద్యోగాల ఖాళీలను గుర్తించి, సత్వరం నియామకాల ప్రక్రియను చేపట్టి సుపరిపాలనను ప్రజల చెంతకు చేర్చాలి.

- టి.సాయిచరణ్, బోరిగాం, నిర్మల్‌జిల్లా

## ఇద్దరూ ఇద్దరే!

భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రధానమైన పాతివ్రత్య ధర్మాన్ని పాటిస్తూ లోకానికి ఆదర్శ పాత్రులైన నారీమణులెందరో ఉన్నారు. వారిలో సీతాదేవి, ద్రౌపది ప్రముఖులు. ఒకరు త్రేతాయుగానికి చెందినవారైతే, మరొకరు ద్వాపరయుగానికి చెందినవారు. వీరి కారణంగానే రామాయణ మహాభారతేతిహాసాలు ప్రభవించాయి. ఘనచరిత్రను సృష్టించిన ఈ ఇద్దరు నాయికల పుట్టుకలో సారూప్యం ఉంది. వారిద్దరూ 'అయోనిజలే' (మాతృగర్భం నుంచి పుట్టనివారే) కావడం ఒక విశేషం. ఇద్దరూ పాతివ్రత్యధర్మానికి అనుగుణంగా ఆజీవనపర్యంతం నిలిచారు. ధర్మనిబద్ధతకోసం ఎన్నో అగచాట్లు పడ్డారు. అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. కష్టసుఖాల్లో భర్తల వెంటే నడిచారు. సమస్త లోకానికే ఆదర్శ వనితలయ్యారు. అత్యంత కష్టకాలంలో సైతం ఏ మాత్రం ధైర్యాన్ని కోల్పోకుండా, మహావిపత్తులను ఎదుర్కొన్న సాధ్వీమణులు వీరు.

సీతాదేవి రావణాపహృతయై, లంకానగరంలోని అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య బందీగా పడిఉన్న సమయంలో ఆమె ప్రదర్శించిన ధైర్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రతినిత్యం రావణుడు అశోకవనానికి వచ్చి తనను వరించాలంటూ ఎంతగా భయపెట్టినా మొక్కవోని ధైర్యంతో సీతమ్మ ఏమంది? 'ఓ రావణా! పరస్త్రీని అయిన నన్ను చెరబట్టి నీవు అధర్మానికి పాల్పడ్డావు. నిన్ను నేను కాలితో కూడా తాకను. నా భర్త నాకు సర్వస్వం. దీనుడైనా, రాజ్యహీనుడైనా అతడే నా దైవం. నన్ను చేపట్టాలనే దురాశను వదలుకో. రాముడి కోపాగ్నికి నీవు భస్మం కాకముందే మేలుకో!' అని ధైర్యంగా చెప్పింది. హనుమంతుడు లంకకు వెళ్ళి, 'అమ్మా! నిన్ను సురక్షితంగా తీసుకొనిపోయి రామసన్నిధికి చేరుస్తాను' అన్నప్పుడు- 'హనుమా! నీవు అంతటి శక్తిసంపన్నుడవే. కాదనను. కానీ నా రాముడు నన్ను తీసికొని పోగల సమర్థుడు. అతడి వెంట మాత్రమే నేను వస్తాను' అని పలికిన ధార్మిక వనిత ఆమె!

ద్రౌపది ఆజీవనాంతం తన భర్తల వెంట నడచిన సాధ్వీమణి. మాయాజూదంలో సర్వస్వం కోల్పోయిన ధర్మరాజు ఒప్పందానికి లొంగి ద్రౌపదిని దుర్యోధన సభకు రమ్మని ప్రాతిగామిని పంపినప్పుడు- 'ఓ ప్రాతిగామీ! ఇది దైవికంగా జరిగిందని నేను అనుకొంటున్నాను. ప్రపంచంలో అన్నింటికీ మించింది ధర్మం. ఆ ధర్మానికి నేను కట్టుబడి ఉంటాను. అయితే నాకు సంభవించిన ఈ క్లిష్టపరిస్థితిని ధర్మజ్ఞులైన పెద్దలకు వివరించి, వారు ఎలా ఆజ్ఞాపిస్తే అలాగే నడచుకుంటాను' అని పలికిన తీరు అమోఘం!



అంతర్యామి

అరణ్యవాస సమయంలో సీతాదేవి, ద్రౌపది ఎదుర్కొన్న కష్టాలు వారి సహనశీలానికి ఉదాహరణలు. వారిద్దరూ అధర్మ వాంఛితులైన దుష్టవర్తనుల వల్ల బాధలు అనుభవించినవారే. రావణబాధితురాలైన సీతాదేవి ఎన్ని కష్టాలను అనుభవించిందో, దుర్యోధన దుశ్శాసన శకుని కీచక సైంధవాది దుష్టుల వల్ల ద్రౌపది అన్ని కష్టాలను ఎదుర్కొన్నది. చివరికి అశ్వత్థామ చేతిలో తన అయిదుగురు కొడుకులు హతమై పుత్రశోకం మిగిలినా, ధైర్యంతో నిలిచి, భర్తలకు చేదోడువాదోడుగా తన ధర్మాన్ని నిర్వహించిన ద్రౌపది అందరికీ ఆదర్శం.

ఏనాడూ సుఖాలను, సంపదలను కోరకుండా కట్టుబట్టలతో పతుల వెంట నడచి, వారే తమ సర్వస్వం అనుకొని జీవితాంతం అగచాట్లు పడిన ధీరవనితలు వీరు! అందుకే వీరి చరిత్రలు లోకారాధ్యాలైనాయి! వీరి జీవనశైలి మానవాళికి జీవనసారంగా మారింది! ఇతిహాసాలు మానవనాగరికతలను ఎంతగానో ప్రభావితం చేస్తాయనడానికి రామాయణ, మహాభారతాలు నేటికీ ప్రత్యక్ష నిదర్శనాలు.

– డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

# అభివృద్ధి.. సంక్షేమం.. ఇదే లక్ష్యం

ఆర్థిక సర్వే సారాంశమిదీ..

గడిచిన అయిదేళ్లలో సాధించిన వృద్ధి గురించిన సమగ్ర విశ్లేషణ.. రాబోయే కాలంలో చేయాల్సిన పనులకు మార్గదర్శనం.. వీటన్నింటి సమాహారంగా ఆర్థిక సర్వే సాగింది. ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ రూపొందించిన ఈ సర్వేను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించేందుకు ఆర్థిక సర్వే మార్గాన్ని సూచించింది. సామాజిక రంగం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంధన భద్రతలో పురోభివృద్ధి నుంచి పొందిన లబ్ధిని ఇది తెలియజేస్తోంది.

– ప్రధాని నరేంద్ర మోదీ




## పదవీ విరమణ వయసు పెంచాల్సిందే

భారతీయుల సగటు జీవితకాలం పెరుగుతుండటంతో పదవీవిరమణ వయసు 60 ఏళ్ల నుంచి పెరగడం అనివార్యంగా కనిపిస్తోంది. 2031-41 మధ్యకాలంలో దేశజనాభా 0.5 శాతం పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఫలితంగా పదవీవిరమణ వయసును పెంచక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్ లాంటి దేశాల తరహాలోనే మనదేశంలోనూ సంతానసాఫల్యత తగ్గి, జీవితకాలం పెరుగుతోంది. జనాభా ఇదే స్థాయిలో ఉండాలంటే ప్రతి మహిళ సగటున 2.1 మంది పిల్లలను కనాల్సి ఉండగా, 13 ప్రధాన రాష్ట్రాల్లో ఇది 1.6 - 1.7 మధ్యే ఉంటోంది. దీనివల్ల వృద్ధుల జనాభా రాబోయే దశాబ్దంలో పెరుగుతుందని అంచనా. అందుకే పదవీవిరమణ వయసును పెంచక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. 19 ఏళ్ల లోపున్నవారి సంఖ్య ఇప్పటికే పడిపోతోంది. 2011లో ఇది 41% ఉండగా, 2041 నాటికి 25%కు తగ్గుతుందని భావిస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గడంతో పాఠశాలల అవసరం తగ్గి, వాటిని విలీనం చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. 60 ఏళ్లు దాటినవారి సంఖ్య 2011లో 8.6% ఉంటే 2041 నాటికి అది 16%కు చేరుకుంటుంది. 2041 నాటికి 20-59 ఏళ్ల మధ్య వయసుండేవారి జనాభా 59%కు చేరుకునేలా ఉంది. ఆసుపత్రులు ప్రస్తుతమున్న స్థాయిలోనే ఉంటే తలసరి పడకల అందుబాటు తగ్గుతుంది కాబట్టి వాటి సంఖ్యను పెంచడంపై దృష్టి పెట్టాలి.

**వృద్ధుల సంక్షేమంపై శ్రద్ధ**

వృద్ధుల సంక్షేమంపై శ్రద్ధ చూపాలి. అందుకోసం ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెంచాలి. తక్కువ జీతాలు, వేతనాల్లో తేడాలు.. సమ్మిళిత అభివృద్ధి సాధనకు ఆటంకాలుగా మారుతున్నాయి. చట్టాలు, విధానాల్లో మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కార్మికశక్తిని సమర్థంగా వినియోగించడం ద్వారా ఇలాంటి అవరోధాలను అధిగమించే అవకాశం ఉంది.

## వేతనాల్లో అసమానతలు తొలగించాలి

మనదేశంలో ప్రభావవంతమైన వేతన వ్యవస్థ అవసరం. అది వేతనాల్లో అసమానతలను రూపుమాపగలగాలి. పేదరికాన్ని తగ్గించగలగాలి. ప్రధానంగా దిగువ స్థాయుల్లో సమ్మిళిత వృద్ధికి దోహదపడాలి. గత 70 ఏళ్లలో మనదేశంలో కనీస వేతన వ్యవస్థ విస్తరించి.. సంక్లిష్టంగా మారింది. నైపుణ్యం లేని(అన్ స్కిల్డ్) ఉద్యోగుల విషయంలోనే దాదాపు 429 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్, 1915 షెడ్యూల్డ్ ఉద్యోగ విభాగాలు ఉన్నాయి. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ముగ్గురు వేతన కార్మికుల్లో ఒకరు కనీస వేతన చట్టం పరిధిలోకి రావడం లేదు. కాబట్టి వేతన వ్యవస్థను సరళీకరించాలి. భౌగోళిక ప్రాంతాల ఆధారంగా అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు విభాగాలవారీగా కనీస వేతనాలను నిర్ధారించాలి. కార్మికులంతా వాటి పరిధిలోకి రావాలి. అప్పుడే వారికి తగిన రక్షణ చేకూరుతుంది. సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది.

## నీటికొరతను అధిగమిద్దాం

పలు ప్రాంతాల్లో వర్షాభావం వల్ల పంట దిగుబడులపై ప్రభావం ఉంటుంది. భూగర్భజలాలు పడిపోతున్నాయి. నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రైతులను సాగునీటి సమర్థ వినియోగం దిశగా ప్రోత్సహించాలి. 2050 నాటికి మన దేశంలో నీటి కొరత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. 'భూముల నుంచి ఉత్పాదకత' ఆధారంగా కాకుండా 'సాగునీటి సమర్థ వినియోగంతో ఉత్పాదకత' దిశగా వ్యవసాయం మళ్లే విషయమై దృష్టి సారించాలి. సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించేందుకు రాయితీలు ఇవ్వాలి. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలతో భూసారం, సమర్థ నీటి వినియోగం పెరుగుతాయి. పాడి, పశుపోషణ, మత్స్య రంగాలకు విధానాల రూపకల్పనపై దృష్టి సారించాలి. 2018-19లో వ్యవసాయ రంగ వృద్ధి మందగించింది.

## ఆహార రాయితీల నియంత్రణ తప్పదు

పేదలకు ఆహారభద్రత కొనసాగాలంటే ఆహార రాయితీలను నియంత్రించక తప్పదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆహార రాయితీలకు రూ.1,71,298 కోట్లు కేటాయించగా, 2019-20 తాత్కాలిక బడ్జెట్ నాటికి రూ.1,84,220 కోట్లకు పెరిగింది. రాయితీల హేతుబద్ధీకరణతో అందరికీ ఆహారభద్రత కల్పించవచ్చు. ఆహారధాన్యాల సేకరణ ధరకు, పేదలకు అందించే ధరకు మధ్య వ్యత్యాసం పెరగడం వల్లే రాయితీబిల్లు పెరుగుతోంది. ఆహారభద్రత చట్టం కింద దేశంలోని 80 కోట్ల మంది పేదలకు రాయితీ అందుతోంది. 2013-14లో కిలో గోధుమల ధర రూ.19 ఉండగా అది 2018-19 నాటికి రూ.24.35కు, బియ్యం ధర రూ.26.15 నుంచి రూ.34.72కు పెరిగింది. కానీ గోధుమలను కిలో రూ.2, బియ్యం కిలో రూ. 3 చొప్పునే ఇస్తున్నారు.

## పన్ను చెల్లింపు.. అప్పులు తీర్చడం పవిత్ర కర్తవ్యం!

పన్నుల చెల్లింపు, అప్పులు తీర్చడం 'పవిత్ర కర్తవ్యం'. భారతీయ సంస్కృతిలో మతానికి చాలా ప్రాధాన్యం ఉంది. పన్నులు, రుణాల చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఆధ్యాత్మికతను జోడించాలి. హిందూమతంలో అప్పు తీర్చకపోవడం పాపం, నేరం. అలా చేస్తే నరకంలో శిక్షలు అనుభవించాల్సి వస్తుందంటారు. తల్లిదండ్రులు మరణించినా, వారికి పాపం తగలకుండా ఉండాలంటే పిల్లలు ఆ అప్పులు తీర్చాలని చెబుతారు. ఇస్లాం మతంలో 'ఓ అల్లా.. పాపాలు, అప్పుల నుంచి నేను నీ శరణు కోరుతున్నాను' అని ఉంటుంది. అప్పులు తీర్చకపోతే ఎవరూ స్వర్గంలోకి వెళ్లలేరు. బైబిల్‌లోనూ పరస్పర ప్రేమ తప్ప మరే అప్పూ పేరుకుపోకుండా చూడాలని, పాపులు అప్పు తీసుకుని తీర్చరని.. నీతిగలవారు తీర్చేస్తారని ఉంటుంది. ఇలా సర్వమత సారాంశాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం ద్వారా ఆర్థికవ్యవస్థకు నైతిక ప్రవర్తనను అనుసంధానించేలా చూడాలి. అప్పులు తీర్చడం, పన్నులు చెల్లించడం ఒక పవిత్ర కర్తవ్యంగా వారు భావించేలా చేయాలి. ఇంకా ప్రతి జిల్లాలో అత్యధికంగా పన్ను చెల్లించే 10 మందికి విశేషాధికారాలు కల్పించాలి. ఇమ్మిగ్రేషన్ కౌంటర్లలో దౌత్యవేత్తల తరహా ప్రయోజనాలు, విమానాశ్రయాల్లో వేగంగా వెళ్లగలగడం, రోడ్లు, భవనాలు, పాఠశాలలకు వారి పేర్లు పెట్టాలి. పన్నులు చెల్లిస్తే హోదా, గౌరవం దక్కుతాయన్న విషయం అందరికీ తెలుస్తుంది.

## స్వచ్ఛ భారత్‌తో ఆరోగ్యం మెరుగు

'స్వచ్ఛ భారత్'తో పలు రాష్ట్రాలు బహిరంగ మలవిసర్జన రహితం(ఓడీఎఫ్)గా ఆవిర్భవించాయి. ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పాఠశాలల్లో విద్యార్థినుల శాతాన్ని పెంచడంలోనూ ఈ కార్యక్రమం దోహదపడింది. 'స్వచ్ఛ భారత్'ను 2014లో ప్రారంభించారు. అప్పటి నుంచి 9.5 కోట్ల మరుగుదొడ్లను నిర్మించారు.

## స్మార్ట్ నగరాల్లో పనులు భేష్

స్మార్ట్ నగరాల కార్యక్రమంలో 100 నగరాల్లో రూ. 2.05 లక్షల కోట్ల ప్రాజెక్టులు ప్రతిపాదించగా, వాటి అమలు తీరు బాగుంది. సమీకృత కమాండ్, కంట్రోల్ కేంద్రాలు, స్మార్ట్ రహదారులు, స్మార్ట్ నీరు, ఇంటి పైకప్పుల మీద సౌరఫలకాల ఏర్పాటు విషయంలో పురోగతి బాగుంది.

## బ్రాడ్‌గేజ్ మొత్తం విద్యుదీకరణ

2021 నాటికి రైల్వే బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్ 100% విద్యుదీకరణ లక్ష్యం. ఈ ఏడాది ఏప్రిల్ 1కి 35,488 కి.మీ. విద్యుదీకరణ పూర్తయింది. రైలు ప్రమాదాలు తగ్గాయి. 2018-19లో వస్తురవాణా అంతకుముందు సంవత్సరం కంటే 61.84 మిలియన్ టన్నులు ఎక్కువ. 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్' మిషన్ పరిశుభ్రతపై దృష్టి సారించింది.

## కార్మికచట్టాల సవరణతో ఉద్యోగసృష్టి

కార్మిక చట్టాలను సవరించడం, కొన్ని ఆంక్షలను ఎత్తివేయడం ద్వారా ఉద్యోగాల సృష్టిని పెంచవచ్చు. ఇటీవల రాజస్థాన్ అలాంటి మార్పులే చేపట్టింది. మన దేశంలో రానున్న దశాబ్ద కాలంపాటు పనిచేయగల వయసున్న వ్యక్తుల జనాభా ఏటా దాదాపు 97 లక్షల చొప్పున పెరుగుతుంది. 2030ల్లో ఆ పెరుగుదల ఏటా 42 లక్షలుగా మారుతుంది. వారిలో 60% మందికి పని కల్పించాలంటే.. రానున్న పదేళ్లపాటు ఏటా 55-60 లక్షల ఉద్యోగాలను సృష్టించాలి. 2007-14 మధ్య రాష్ట్రాలు కార్మిక చట్టాలను పెద్దగా సంస్కరించలేదు. 2014లో రాజస్థాన్ సంస్కరణలు చేపట్టగా మరికొన్ని రాష్ట్రాలు దాన్ని అనుసరించాయి. కార్మిక చట్టాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న రాష్ట్రాలు తగినన్ని ఉద్యోగాలను సృష్టించలేకపోతున్నాయి. సరిపడా మూలధనాన్నీ సమకూర్చుకోలేకపోతున్నాయి.

## ప్రైవేటు రంగానికీ డేటా అందించాలి

ఎంపికచేసిన 'కొంత' డేటాను వాణిజ్య వాడకానికి ఇవ్వాలి. దీనికి రుసుము వసూలుచేయాలి. డిమాండును అంచనా వేసి, ఇప్పటివరకు ఎవరూ గుర్తించని మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విశ్లేషణ సంస్థలకు డేటాను అమ్మాలి. ప్రభుత్వం వద్ద ఉన్న డేటాతో ప్రైవేటు రంగం లబ్ధిపొందేందుకు అవకాశాలున్నాయి. డేటాగోప్యతకు పెద్దపీట వేస్తూనే పేదల ప్రయోజనం కోసం ప్రభుత్వం వద్ద అపారంగా ఉన్న డేటాను వినియోగించుకోవచ్చు. ప్రజల ఆరోగ్య రికార్డులతో కూడిన 'జాతీయ ఆరోగ్య రిజిస్ట్రీ' ఒకటి ఏర్పాటుచేయాలి.

## ఉపాధిపనుల నిర్వచనం మారాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథక సమాచారంతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభ పరిస్థితులను అంచనా వేసే సూచిని అభివృద్ధి చేయాలి. ఇందుకు ఉపాధి హామీ కార్మికుల పని డిమాండ్ డేటాను వినియోగించాలి. ఉపాధి హామీ పనులు చేసేవారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా వేసే చెల్లింపులను పెంచాలి. కార్మికుల నైపుణ్యాలూ పెంచాలి. ఈ పథకం కింద 'పనుల' నిర్వచన పరిధిని పెంచాలి. ప్రజలు పేదరికం నుంచి బయట పడేలా.. వివిధ ఆదాయ మార్గాలతో వారి జీవితాల్లో వైవిధ్యం తెచ్చే విషయమై దృష్టి సారించాలి.

## కోర్టుల పనిదినాలు పెరగాలి

సులభతర వాణిజ్య నిర్వహణకు కోర్టుకేసులు అవరోధంగా ఉన్నాయి. పెండింగ్ కేసులను తగ్గించాలంటే న్యాయస్థానాల పనిదినాలు పెంచడం, న్యాయమూర్తుల నియామకం అవసరం. పెండింగులో ఉన్న కేసుల్లో 87.5% దిగువ కోర్టుల్లోనివే. వీటిలో 2279 పోస్టులు, హైకోర్టులలో 93 పోస్టులు భర్తీచేస్తే నూరుశాతం కేసులు పరిష్కారం అవుతాయి. సత్వర న్యాయంతోపాటు నాణ్యమైన న్యాయసేవలూ అందించాలి. ఇందుకోసం సమర్థ పాలన అవసరం. ప్రస్తుతం చీఫ్ జ్యుడిషియల్ అధికారే పాలనా వ్యవహారాలను చూస్తున్నారు. ఇండియన్ కోర్టులు, ట్రిబ్యునల్ సర్వీసుల వ్యవస్థకు ఇది అప్పగించాలి.

---

## పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరైన రాహుల్, ఏచూరి



**ముంబయి:** పరువు నష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం ముంబయిలోని మెట్రోపాలిటన్ కోర్టుకు హాజరయ్యారు. తమపై చేసిన ఆరోపణలు సరికావని తాము విచారణను ఎదుర్కోడానికి సిద్ధమని వారు కోర్టుకు తెలిపారు. పాత్రికేయురాలు గౌరీలంకేశ్ హత్యకు భాజపా, ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉన్న వారే కారణమని రాహుల్‌గాంధీ పేర్కొన్నారని ఆరోపిస్తూ ఆర్ఎస్ఎస్‌కు చెందిన న్యాయవాది ధ్రుతిమాన్ జోషీ పరువునష్టం దావా వేశారు. ఇదే అభియోగాలు ఏచూరిపై కూడా నమోదయ్యాయి. ఈ ఇరువురు నేతలూ విచారణను ఎదుర్కోవడానికే సిద్ధపడటంతో వారికి రూ.15వేల పూచికత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ సందర్భంగా కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం లేకుండా మినహాయింపునిచ్చింది. విచారణ సెప్టెంబర్ 21వ తేదీకి వాయిదా పడింది.

## ఖాదీ విక్రయాలకు ప్రత్యేక పోర్టల్

**దిల్లీ:** ఖాదీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తులకు విస్తృత విపణి అవకాశాలను కల్పించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభకు తెలిపారు. చైనా వాణిజ్య పోర్టల్ అలీబాబా, అమెరికాకు చెందిన అమెజాన్‌ల మాదిరిగా ఆన్‌లైన్ ద్వారా చిన్న పరిశ్రమల ఉత్పత్తులను విక్రయించే వీలుకల్పిస్తామన్నారు. జీడీపీలో 29శాతం వాటా చిన్న, మధ్య తరహా పరిశ్రమలదేనని, వచ్చే అయిదేళ్లలో దానిని 50శాతానికి తీసుకెళ్లాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు గడ్కరీ వివరించారు. మరో 15 కోట్ల ఉద్యోగాల కల్పన ఈ రంగం ద్వారా జరుగుతుందన్నారు.

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
'ఇ' టెండర్ నోటీసు
TSTransco (ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్) టెండర్ స్పెసిఫికేషన్ నెం.ల వివరాలు : TSPMM21-21/2019 & TSPMM21-22/2019 మీద ట్యాబులేటర్ & ట్యాబులర్ బ్యాటరీ యొక్క సరఫరా నిమిత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ కింద ఆన్‌లైన్ బిడ్లను కోరుతున్నది.
టెండరుదారులు తదుపరి వివరములను 'ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్' అనగా www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును మరియు టెండరు షెడ్యూల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. కాంటాక్ట్ నెం.లు.: చీఫ్ ఇంజినీర్/P&MM, TSTransco, ఫోన్ నెం.: 040-23396000 (Extn.: 3460/3583/3487/3332). www.transco.telangana.gov.in
R.O. No. 19/19 సం/- చీఫ్ ఇంజినీర్/P&MM

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్
ఈ- ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు
టెండర్ నోటీసు నెంబర్ : 2299/ 1/ CDS/ DIMS/ 2019 తేది : 04-07-2019
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసులు, విజయవాడ నియంత్రణ క్రింద ఉన్న ఇ.యస్.ఐ హాస్పిటల్స్, ఇ.యస్.ఐ డిస్పెన్సరీలు, ఇ.యస్.ఐ డయాగ్నోస్టిక్ సెంటర్లకు మందులు సరఫరా నిమిత్తం తయారీదారులు / అధీకృత పంపిణీదారుల నుండి ఈ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫామ్ మీద బిడ్స్ కోరబడుచున్నవి. తదుపరి వివరములకు https://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. ప్రాసెస్సింగ్ ఫీజు INR (₹) రూ.5,000/- డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, విజయవాడ పేరట DD రూపములో చెల్లించవలెను. షెడ్యూల్ అమ్మకం ప్రారంభతేది 06-07-2019 10 గం. లనుండి షెడ్యూల్ అమ్మకం ముగింపు తేది 26-07-2019 17.00 గం.ల వరకు. బిడ్ దాఖలుకు ముగింపు తేదీ 26-07-2019, 12 గం.లు. డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, AP విజయవాడ వారి కార్యాలయము వద్ద టెక్నికల్ బిడ్ హార్డ్ కాపీల దాఖలు తేదీ 26-07-2019, 17.00 గం.లు. టెక్నికల్ బిడ్ తెరచుట 28-07-2019 10గం.లకు ప్రైస్ బిడ్ తెరచుట 28-07-2019 15.00 గం.లకు తదుపరి వివరములు కొరకు eprocsupport@vupadhi.com లేదా ఫోన్ : 08645-246370/71/72/73/74.
సం/- డైరెక్టర్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విజయవాడ
DIPR No. 53PP/CL/Advt/1/1/2019-20

# 'ఆధార్' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**దిల్లీ:** బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్ పొందేందుకు ఆధార్‌ను గుర్తింపు పత్రంగా స్వచ్ఛందంగా ఉపయోగించుకునేందుకు వీలు కల్పించే బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'ఆధార్, ఇతర చట్టాల (సవరణ)బిల్లు, 2019'ను గురువారం లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఆధార్ స్వచ్ఛందమని అంతకుముందు ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. గోప్యత, భద్రతలకు సంబంధించిన అంశాల పరిష్కారం కోసం సవరణలు తీసుకొచ్చామని, ఆధార్ లేనంతమాత్రాన ఎలాంటి సేవలు, పథకాల ప్రయోజనాల్ని తిరస్కరించడం జరగదని చెప్పారు. కేంద్రమంత్రి సభలో తన కార్డును ప్రదర్శిస్తూ.. కార్డులో కేవలం, పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, నివాస చిరునామా మాత్రమే ఉంటాయని, ఆరోగ్యం, కులం, మతం, వర్గపరమైన ఇతరత్రా ఎలాంటి సమాచారం ఉండదని స్పష్టం చేశారు. ఐటీ మంత్రిగా తాను ఆధార్ సమాచారాన్ని కోరితే తనకూ మూడేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం త్వరలోనే డేటా రక్షణ చట్టాన్ని తీసుకొస్తుందని, డేటా అనలిటిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్ చౌదరి బిల్లును వ్యతిరేకించారు. ఆధార్ విషయంలో గోప్యతను ఉల్లంఘించడంపై సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వాన్ని మందలించిందన్నారు. ఒక వ్యక్తి స్వచ్ఛందంగా తన ఆధార్ సంఖ్యను తొలగించుకునే హక్కును కల్పించాలని కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా ప్రైవేటు సంస్థలకు ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం చూస్తోందని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, తెదేపా సభ్యుడు రామ్మోహన్‌నాయుడు, ఆర్ఎస్పీ సభ్యుడు ప్రేమచంద్రన్ ఆరోపించారు.

- ఏవైనా ప్రైవేటు సంస్థలు ఆధార్ డేటాను సేకరించి నిల్వ చేసుకున్నట్లయితే సవరణ బిల్లు ప్రకారం రూ.ఒక కోటి జరిమానా పడుతుంది. దీనితోపాటు జైలుశిక్ష కూడా విధించవచ్చు.
- ఇకపై కేవైసీ నిర్ధరణకు స్వచ్ఛంద పద్ధతిలోనే ఆధార్ సంఖ్యను ఉపయోగించాల్సి ఉంటుంది.
- ఆధార్‌ను ఉపయోగించే విషయంలో నిర్దేశించిన నిబంధనల్ని, గోప్యత నియమాల్ని ఉల్లంఘించేవారిపై కఠిన జరిమానాలు విధిస్తూనే.. చిన్నారులు 18 ఏళ్లు వచ్చాక బయోమెట్రిక్ ఐడీ కార్యక్రమం నుంచి వైదొలిగే ఐచ్ఛికాన్ని సవరణ బిల్లులో కల్పించారు.
- ఆధార్ సవరణ బిల్లును జూన్ 24న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రాజ్యసభలో కూడా ఆమోదం పొందితే మార్చిలో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో చట్టం వస్తుంది.

### 'ఐఎంసీ' బిల్లుకు పార్లమెంటు సమ్మతి

భారతీయ వైద్య మండలి (ఐఎంసీ) సవరణ బిల్లు-2019ను గురువారం పార్లమెంటు ఆమోదించింది. భారతీయ వైద్య మండలి స్థానంలో బోర్డు ఆఫ్ గవర్నర్లు 26 సెప్టెంబర్, 2018 నుంచి రెండేళ్లపాటు కొనసాగడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఫిబ్రవరి 21న జారీచేసిన అత్యవసర ఆదేశం స్థానంలో దీనిని ప్రవేశపెట్టారు. మంగళవారం లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

## ఏ క్షణమైనా హఫీజ్ సయీద్ అరెస్టు

**లాహోర్/ దిల్లీ:** జమాత్-ఉద్-దవా(జేయూడీ) ఉగ్రవాద సంస్థ అధినేత, 2008 నాటి ముంబయి దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ అరెస్టుకు రంగం సిద్ధమైంది! అతణ్ని అతి త్వరలో అరెస్టు చేయనున్నట్లు పాక్ పోలీసు వర్గాలు గురువారం వెల్లడించాయి. ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వ అనుమతి కోసమే తాము ఎదురుచూస్తున్నట్లు తెలిపాయి. సయీద్‌కు అత్యంత సన్నిహితులైన మరో 12 మందిని కూడా అరెస్టు చేయనున్నట్లు పేర్కొన్నాయి. వీరందరిపైనా పాక్‌లోని పంజాబ్ పోలీసు శాఖకు చెందిన 'ఉగ్ర వ్యతిరేక విభాగం(సీటీడీ)' బుధవారం 23 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. సయీద్ ప్రస్తుతం లాహోర్‌లోని జొహార్ పట్టణంలో ఉన్నాడని, ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే అరెస్టు చేయనున్నట్లు ఒక అధికారి వెల్లడించారు. ఈ నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ స్పందిస్తూ.. పైపై చర్యలతో పాక్ అంతర్జాతీయ సమాజాన్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**దావూద్ మా దేశంలో లేడు: పాక్**

**ఇస్లామాబాద్:** మాఫియా ముఠా నాయకుడు, ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం తమ దేశంలో లేడని పాకిస్థాన్ విదేశాంగ శాఖ గురువారం తెలిపింది. 1993 నాటి ముంబయి బాంబు దాడుల కేసులో వాంటెడ్‌గా ఉన్న అతడు పాక్‌లోనే ఉన్నాడని బుధవారం బ్రిటన్‌లోని ఒక కోర్టుకు అమెరికా తెలియజేసిన నేపథ్యంలో ఈ మేరకు స్పందించింది. దావూద్ ముఠాలోని సభ్యుడైన జబీర్ మోతిని అమెరికాకు అప్పగించే కేసుపై బుధవారం లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది.



## ఇంజినీర్‌పై బురద పోసిన ఎమ్మెల్యే

**ముంబయి:** మహారాష్ట్రలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) డిప్యూటీ ఇంజినీర్‌పై శాసనసభ్యుడు ఒకరు అనుచరులతో కలిసి బురద పోశారు. ముంబయి-గోవా జాతీయ రహదారిపై గుంతలు ఎక్కువగా ఉండడంపై ఆగ్రహించిన కణకావలీ కాంగ్రెస్ శాసనసభ్యుడు నీతేశ్ రాణె, కణకావలీ పురపాలక సంఘం ఛైర్మన్ సమీర్ నలవాడేలు డిప్యూటీ ఇంజినీర్ ప్రకాశ్ షెడేకర్‌పై రెండు బకెట్లతో బురద పోశారు. అనంతరం షెడేకర్‌ను వంతెనకు కట్టేసేందుకు యత్నించారు. కణకావలీ వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. నీతేశ్, ఆయన అనుచరులు 16 మందిని పోలీసులు అరెస్టుచేశారు. నీతేశ్ రాణె నిర్వాకం పట్ల ఆయన తండ్రి నారాయణ్ రాణె క్షమాపణలు తెలిపారు. మాజీ సీఎం అయిన నారాయణ్.. ప్రస్తుతం భాజపా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు.

## 114 యుద్ధవిమానాల కొనుగోలుకు ముందడుగు

**దిల్లీ:** వైమానిక దళం కోసం 114 యుద్ధవిమానాల కొనుగోలుకు భారత్ మరో అడుగు ముందుకేసింది. ప్రాథమిక బిడ్లను, వైమానిక దళ అవసరాలను మదింపు వేసే ప్రక్రియ ప్రారంభమైందని రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్ పార్లమెంటుకు తెలిపారు. 1500 కోట్ల డాలర్ల విలువైన ఈ కాంట్రాక్టును ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్నారు. దీనిపై అమెరికాకు చెందిన బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, స్వీడన్‌కు చెందిన సాబ్ తదితర కంపెనీలు పోటీపడుతున్నాయి. భారత్‌లోని పలు కంపెనీలతో భాగస్వామ్యాలను ఏర్పర్చుకుంటున్నాయి.

## ఐఎన్ఎక్స్ కేసులో అప్రూవర్‌గా ఇంద్రాణీ ముఖర్జియా!

### అనుమతించిన ప్రత్యేక కోర్టు

**దిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో అప్రూవర్‌గా మారేందుకు ఇంద్రాణీ ముఖర్జియాకు ప్రత్యేక కోర్టు గురువారం అనుమతించింది. ఈ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, ఆయన తనయుడు కార్తీ చిదంబరం అభియోగాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇంద్రాణీ ముఖర్జియా తన కుమార్తె షీనా బోరా హత్య కేసులో ముంబయిలోని బైకుల్లా జైలులో ఉన్నారు. జులై 11వ తేదీన కోర్టు హాజరు కావాలని జడ్జి ఆదేశించారు.

## వయస్సు సడలింపు పొందితే.. జనరల్‌కు మారలేరు: సుప్రీం

**దిల్లీ:** ఎంపిక ప్రక్రియలో వయసు విషయంలో సడలింపు పొందిన రిజర్వు కేటగిరీ అభ్యర్థులు.. ఆ తర్వాతి దశలో జనరల్ కేటగిరీలో అవకాశం కోరడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జస్టిస్ ఇందిరా బెనర్జీలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై ఇంతకుముందు గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. రిజర్వు కేటగిరీలో వయసుకు సంబంధించిన సడలింపు ప్రయోజనాల్ని పొందిన అభ్యర్థులను జనరల్ కేటగిరీలో పరిగణనలోకి తీసుకోవడం జరగదని గుజరాత్ హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. అలాంటి వారి కేసుల్ని రిజర్వ్ కేటగిరీల్లోనే పరిగణించడం జరుగుతుందని పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ నీరవ్‌కుమార్ అనే అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై తాజాగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఎస్సీ/ఎస్టీ, ఎస్ఈబీసీ కేటగిరీలోని అభ్యర్థికి ఎంపిక ప్రక్రియలో వయోపరిమితి, అనుభవం, అర్హత, రాతపరీక్షల్లో అవకాశాలు వంటి అంశాల్లో సడలింపు నిబంధనలు వర్తింపజేసినప్పుడు.. సదరు అభ్యర్థిని నిర్దిష్ట రిజర్వ్ పోస్టులో భాగంగానే పరిగణలోకి తీసుకుంటారని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. రిజర్వేషన్ లేని పోస్టుకు అలాంటి అభ్యర్థిని పరిగణించడం కుదరదని స్పష్టం చేసింది.

## కేంద్రీకృత వ్యవస్థతో అంతర్జాలంపై పర్యవేక్షణ!

**దిల్లీ:** మనదేశంలో ప్రతినిత్యం అంతర్జాలంలో మార్పిడి జరుగుతున్న సమాచారాన్ని ఒక కేంద్రీకృత వ్యవస్థ ద్వారా పర్యవేక్షించాలని ప్రభుత్వం యోచిస్తోంది. టెలికాం మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో రాతపూర్వకంగా గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. మొబైల్ ఫోన్లు, ల్యాండ్‌లైన్లు, అంతర్జాల ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు; అవసరమైన సమయాల్లో చట్టబద్ధంగా జోక్యం చేసుకునేందుకు 'కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థ(సీఎంఎస్)'ను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

## రథయాత్రలో నుస్రత్!



**కోల్‌కతా:** నుస్రత్ జహాన్! ఇటీవల ఆమె ఒక సంచలనం. తృణమూల్ ఎంపీగా ఎన్నికై.. హిందువును పెళ్లాడిన ఆమె.. నుదుట కుంకుమ, మెడలో తాళిబొట్టుతో ప్రమాణస్వీకారం చేశారు. సొంత సమాజం నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా... లెక్కచేయలేదు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి వార్తల్లో నిలిచారు. గురువారం ఆల్‌బర్ట్ రోడ్డులోని ఇస్కాన్ కేంద్రం వద్ద జగన్నాథ రథయాత్రకు భర్త నిఖిల్ జైన్‌తో కలిసి హాజరయ్యారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కలిసి పూజలు నిర్వహించారు. "మతం వేరు. రాజకీయం వేరు. లౌకిక, మానవత్వ సమాజం కోసం యువ భారత్ తపిస్తోంది. ఆ దిశగా కలిసిమెలిసి ముందుకెళ్దాం." అని నుస్రత్ అన్నారు.

## మంత్రులపై అవినీతి ఫిర్యాదులనూ వెల్లడించొచ్చు

### సీఐసీ స్పష్టీకరణ

**దిల్లీ:** కేంద్ర మంత్రులపై అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను బహిర్గతం చేయటంపై ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో) వ్యక్తం చేసిన అభ్యంతరాలను కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) తోసిపుచ్చింది. దీంతో ఆ ఫిర్యాదుల వెల్లడికి మార్గం సుగమమైంది. కేంద్ర మంత్రులపై 2014 నుంచి వచ్చిన అవినీతి ఆరోపణల ఫిర్యాదులను తెలపాలని కోరుతూ ఐఎఫ్ఎస్ అధికారి సంజీవ్ చతుర్వేది 2017 ఆగస్టులో సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద దరఖాస్తు చేశారు. ఆర్టీఐలోని సెక్షన్ 7(9) నిబంధనను సాకుగా చూపి పీఎంవో తిరస్కరించింది. దీనిపై చతుర్వేది సీఐసీని ఆశ్రయించారు. ఆ నిబంధన కింద సమాచారం నిరాకరణ సరికాదని ప్రధాన సమాచార కమిషనర్ సుధీర్‌భార్గవ ఈ నెల 1న ఉత్తర్వులిచ్చారు.

## కారున్న ఓనరూ.. కావాలివి

కారు కొనగానే యజమానులకు హుషారొచ్చేస్తుంది. జోరుగా షికారు చేయాలనిపిస్తుంది. అంతవరకు ఓకే. కానీ బండి నిర్వహణ సరిగా లేకపోయినా, ప్రతికూల పరిస్థితులకు తగ్గట్టు అప్రమత్తంగా ఉండకపోయినా లేనిపోని సమస్యలు వచ్చి పడతాయి. ఈ చికాకులు తప్పించుకోవడానికి, ఆపదలు ఎదుర్కొనేందుకు ప్రతి ఓనరు, డ్రైవరు కొన్ని అత్యవసరాలతో సిద్ధంగా ఉండాలి.



**కవర్ చేయాలి:** కారున్న ప్రతి ఒక్కరికీ గ్యారేజీ ఉండాలనేం లేదు. అలాంటప్పుడు వీధుల్లో పార్కింగ్ తప్పదు. దాంతో బండిపై దుమ్ముధూళి పేరుకుపోతుంది. పక్షులు రెట్టలేస్తాయి. వర్షం, ఎండ కారుని దెబ్బతీస్తాయి. వీటన్నింటి నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా కవర్ ఉండాల్సిందే. అలాగనీ రోజులకొద్దీ కప్పి ఉంచితే లోపల చెమ్మ పేరుకుపోతుంది. నీరు నిలిస్తే కొన్ని భాగాలు తుప్పు పట్టే ప్రమాదముంది. రెండ్రోజులకోసారైనా కవర్ తీసి శుభ్రం చేస్తుండాలి.




**పంక్చర్ రిపేర్, టూల్‌కిట్:** చిన్నచిన్న మరమ్మతులకు మెకానిక్ షెడ్డుకి పరుగెత్తలేం. అలాగే టైరు పంక్చర్ అయినప్పుడు ఒక్కోసారి మనమే మార్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటప్పుడు మనల్ని సమస్యల నుంచి గట్టెక్కించేవి టూల్‌కిట్, పంక్చర్ రిపేర్ కిట్‌లే. టైర్ ఇన్‌ఫ్లేటర్, ప్రెషర్ గేజ్, జాకీ, స్క్రూడ్రైవర్, రెంచీ, నట్‌బోల్ట్‌లతో కూడిన ఈ సరంజామా అందుబాటులో ఉండాలి.





**పార్కింగ్ సెన్సర్/పార్కింగ్ కెమెరా:** బండిని వెనక్కి తీస్తున్నప్పుడు, పార్కింగ్ చేస్తున్నప్పుడూ గోడలు, ఇతర వస్తువుల్ని ఢీకొట్టడం, పొరపాటున చిన్నపిల్లలపైకి ఎక్కించడంలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. వీటిని నివారించేవే పార్కింగ్ సెన్సర్లు, రేయర్ పార్కింగ్ కెమెరాలు. ప్రస్తుతం ఎక్కువ శాతం కార్లలో ఇన్‌బిల్ట్‌గానే వస్తున్నా, పాత వాహనాల్లో అమర్చుకోవడం అవసరం.



**పద్ధతిగా శుభ్రత:** ఎంత ఖరీదైన కారైనా శుభ్రంగా లేకపోతే చూడటానికి బాగుండదు. ఎప్పటికప్పుడు నీట్‌గా తుడుస్తుండాలి. అలాగని ఏదో ఒక గుడ్డతో తుడిస్తే గీతలు పడతాయి. రంగు డ్యామేజీ అవుతుంది. టర్కిష్ టవల్ లేదా మైక్రో ఫైబర్ వస్త్రాన్నే ఎంచుకోవాలి.



**సీట్ కవర్లు, ఫ్లోర్ మ్యాట్‌లు:** వాహనం కొంటున్నప్పుడు డీలర్లు సీటు కవర్లు, ఫ్లోర్‌మ్యాట్‌లు ఇస్తుంటారు. వీటితో అన్నివేళలా మన అవసరాలు తీరకపోవచ్చు. అదనంగా కొనాల్సిందే. సీట్లు ఎక్కువకాలం మన్నికగా ఉండటానికి, ఫ్లోర్‌లు మురికి కాకుండా ఇవి కాపాడతాయి.



**జంపర్ కేబుల్:** ఉన్నట్టుండి ఇంజిన్ ఆగిపోతే? బ్యాటరీ పాడైపోతే? రోడ్డుపై పడిగాపులు కాయాల్సిందే. ఆ గడ్డు సమయాల్లో ఇతర వాహనాల బ్యాటరీ నుంచి పవర్ తీసుకొని మన బండిని కొంతదూరమైనా నడిపించటానికి జంపర్ కేబుళ్లు అత్యవసరం.



**ఎయిర్ ఫ్రెష్‌నర్:** వాహనం ఎంత స్వచ్ఛంగా ఉన్నా లోపల్నుంచి చెడు వాసన వస్తుంటే అందులో ఒక్క క్షణం ఉండలేం. ఆహ్లాదకర వాతావరణం ఉంటేనే డ్రైవింగ్ ప్రశాంతంగా చేయగలుగుతాం. ఈ అనుభూతిని ఇచ్చేవే ఎయిర్‌ఫ్రెష్‌నర్లు.

## వాహ్.. వ్యానిటీ వ్యాన్

**సొగసుకి బ్రాండ్ అంబాసిడర్లు... బయటికొస్తే అభిమానుల జడివాన... నటిస్తే కోట్లు... సినిమా తారలకుండే ఆ క్రేజీనే వేరు... ఇంత పేరుండే సెలెబ్రిటీలు వాడే వాహనాలూ ప్రత్యేకమే... ముఖ్యంగా షూటింగ్ సమయాల్లో సేదతీరే వ్యానిటీ వ్యాన్లనైతే తమ అభిరుచికి అనుగుణంగా తయారు చేయించుకుంటారు... బాలీవుడ్‌లో అత్యుత్తమం అనదగ్గ కొన్ని వ్యానిటీ వ్యాన్లు.. వాటిలోని హంగులు.**



### సౌందర్యానికి చిరునామా

లేత భామ అలియాభట్ తన అభిరుచికి అనుగుణంగా ప్రముఖ డిజైనర్ అమృతా మహల్నాభనీతో వ్యానిటీ వ్యాన్‌ని క్యూట్‌గా డిజైన్ చేయించుకుంది. దీన్ని తన రెండో ఇల్లు అని చెబుతుంటుంది.

- వాహనం ఇంటీరియర్‌లో ఎనిమిది రకాల రంగులు అద్దారు. వాటిపై స్ఫూర్తిదాయక సూక్తులు, సూక్తి వాక్యాలు రాసుకుంది.
- చిన్నపాటి జిమ్, మేకప్‌రూం, రెస్ట్‌రూం, అన్ని వసతులతో కూడిన కిచెన్ ఉంది.
- ఖరీదైన సోఫాలు, టచ్‌స్క్రీన్‌తో కూడిన కంట్రోల్డ్ లైటింగ్, గేమింగ్ కన్సోల్, భారీ టెలివిజన్, మ్యూజిక్ సిస్టమ్.. ఎన్నెన్నో హంగులున్నాయి.

**విలువ: రూ.కోటిన్నర**




**విలువ: రూ.4 కోట్లు**





### స్టైలిష్ వాహనం

బాలీవుడ్‌లో అత్యంత స్టైలిష్ వ్యానిటీ వ్యాన్ సల్లూభాయ్‌ది అంటుంటారు. పూర్తి అద్దాలతో కూడిన బాడీతో బస్ డిజైనే ప్రత్యేకంగా ఉంటుంది. పొడవు 14 మీటర్లు.

- లోపల విశాలమైన రిహార్సల్ గది, జిమ్ ఉంది. షూటింగ్ స్పాట్‌కి వెళ్లడానికి ముందు సాధన చేసేదిక్కడే.
- మ్యూజిక్ సిస్టమ్, టీవీ, కంప్యూటర్.. ప్రతీదీ అత్యాధునిక గ్యాడ్జెట్స్‌నే అమర్చారు.
- అతిథులు వస్తే మాట్లాడటానికి మీటింగ్ రూం ఉంది. విశ్రాంతి తీసుకోవడానికి బెడ్‌రూం.
- బస్‌కి ఆనుకొని పోర్టబుల్ ర్యాంప్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా కారును నేరుగా వ్యానిటీ వ్యాన్ లోపలికి తీసుకు రావచ్చు.

### బాండ్ మెచ్చిన దిలీప్



తమ అభిరుచులకు అనుగుణంగా వాహనాలను మాడిఫై చేయించుకోవడానికి ఎంత ఖర్చుకైనా వెనుకాడరు కొందరు. ఆ ఆసక్తికి అద్దం పట్టేలా ఇంటీరియర్, బాడీ డిజైన్, అదనపు హంగులద్దడం.. ఇలాంటి వాటిలో చిన్న కార్ల నుంచి విమానాల దాకా వందల మాడిఫికేషన్లు చేసి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది డీసీ డిజైన్స్. బాలీవుడ్ తారలు, వ్యాపారవేత్తల్లో అత్యధికులకు వాహన డిజైనర్ డీసీనే. ఇరవై ఏళ్ల కిందట దిలీప్ ఛాబ్రియా డీసీ డిజైన్స్ ప్రారంభించారు. జిప్సీ కారు నుంచి బెంజ్ దాకా ఆయన మాడిఫై చేసిన ప్రతి వాహనం ఓ ప్రయోగమే. తను డిజైన్ చేసిన ఆస్టన్ మార్టిన్ డీబీ-8 కారుని జేమ్స్ బాండ్ సినిమాలోనూ ఉపయోగించారు. కేవలం ఉన్నవాటికే మెరుగులద్దడం కాదు.. డీసీ డిజైన్స్ సొంతంగా 'డీసీ అవంతి' అనే సూపర్ కార్‌ని తయారు చేసింది.

కండల వీరుడు హృతిక్‌రోషన్ వ్యానిటీ వ్యాన్ చూస్తే ఫ్యూచర్ మెషిన్‌లోకి అడుగుపెట్టినట్టే ఉంటుంది. పొడవు 12 మీటర్లు.

**విలువ: రూ.2కోట్లు**

బాలీవుడ్‌లో కింగ్‌ఖాన్ షారూఖ్. పారితోషికం అందుకోవడంలోనే కాదు.. తన వ్యానిటీ వ్యాన్‌ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుకోవడంలోనూ ముందున్నాడు. 14 మీటర్ల పొడవుండే వోల్వో బీఆర్ 9 బస్‌ని తీసుకొని ప్రత్యేకంగా మాడిఫై చేయించుకున్నాడు.

**విలువ: రూ.4 కోట్లు**

- సంజయ్‌దత్, దీపికా పదుకొన్, వివేక్ ఒబెరాయ్, ఐశ్వర్యారాయ్, సోనమ్‌కపూర్‌లు సైతం సకల హంగులతో కూడిన వ్యానిటీ వాహనాలు సమకూర్చుకున్నారు

### మెకానిక్‌గురూ



## చేతికందే ముందే చెక్ చేయాలి

■ నేను పల్సర్ 150 నియాన్ బైక్ కొనాలనుకుంటున్నాను. ఫీచర్లు వివరిస్తూ బండి కొనే సమయంలో డీలరు దగ్గర ఏమేం డాక్యుమెంట్స్ తీసుకోవాలో తెలియజేయండి.

**- టి.విష్ణుచైతన్య**

150సీసీ విభాగంలో అత్యధికంగా అమ్ముడవుతోందీ మోడల్. డీటీఎస్-ఐ ఇంజిన్‌తో పని చేస్తుంది. 14 పీఎస్ పవర్ దీని సొంతం. 144 కేజీల బరువుంటుంది. బండి షోరూం నుంచి బయటికి తీసుకొచ్చే ముందే దానిచుట్టూ ఓసారి కలియతిరగండి. ఏదైనా డ్యామేజీ ఉందా? రంగు వెలిసిపోయిందా? ప్రతి భాగాన్నీ జాగ్రత్తగా పరిశీలించాలి. బండి ఇన్‌వాయిస్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఓనర్ మాన్యువల్ గైడ్, సర్వీస్ బుక్‌లెట్, బీమా కాపీ.. తప్పనిసరిగా తీసుకోవాలి. తర్వాత వాహనం రోడ్డెక్కే ప్రతిసారీ ఆర్సీ, బీమా కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వెంట ఉంచుకోవాలి. వీటితోపాటు ఆర్టీఏ ఎం-వ్యాలెట్ యాప్‌ని మీ స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి. ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ అందులో భద్రపర్చుకోవచ్చు.

■ మారుతిసుజుకీ డిజైర్ 2015 కారు కొనాలనుకుంటున్నాను. ఈ మోడల్‌కి ధర ఎంతవరకు పెట్టొచ్చు? పాత కారు కొనేటప్పుడు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి?

**- మజహార్ మహ్మద్**

కారు కొనేముందు దానికి సంబంధించిన పత్రాలు క్షుణ్నంగా పరిశీలించాలి. వాహన బీమా, ఛాసిస్ నెంబర్, ఇంజిన్ నెంబర్ చూడాలి. వీలైతే ఓసారి మట్టిరోడ్లు, హైవేలు, ట్రాఫిక్‌లో టెస్ట్ డ్రైవ్ చేసి చూడండి. అధీకృత సర్వీసింగ్ సెంటర్‌కి వెళ్లి బండి ప్రమాద చరిత్రను పరిశీలించండి. అనుభవజ్ఞుడైన మెకానిక్‌తో బండి కండిషన్ ఎలా ఉందో చెక్ చేయించండి. పాత కారు కొనాలనుకున్నప్పుడు పేరున్న, నమ్మకమైన రీసెల్లర్ డీలర్ల దగ్గరే తీసుకోవాలి. వాహన స్థితి, మోడల్, ప్రయాణించిన దూరం, రంగు.. ఆధారంగా ధర ఎంత పెట్టాలో నిర్ణయించుకోవచ్చు. ఈ వివరాలతో అంతర్జాలంలో వెతికితే మీరు కోరుకున్న బండి ధర తెలుస్తుంది.

**- హర్షిన్ లాల్‌పేట్,** ఆటోమొబైల్ నిపుణుడు

(మీకూ ఇలాంటి సందేహాలు, సమస్యలుంటే రాసి పంపండి. నిపుణులతో పరిష్కారం ఇప్పిస్తాం)

## ఏఎంటీతో ఎక్స్‌యూవీ 300




**ధర: రూ. 11.50 లక్షలు**

స్పోర్ట్ యుటిలిటీ వాహన విభాగంలో మంచి అమ్మకాలతో ముందున్న మహీంద్రా ఎక్స్‌యూవీ 300 కొత్తగా ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ)తో వచ్చింది. డీజిల్ వేరియంట్‌లో మాత్రమే లభ్యమవుతోంది. రూ.55వేలు అదనం. మహీంద్రాకే ప్రత్యేకమైన ఆటోషిఫ్ట్ టెక్నాలజీతో వచ్చింది. పెరల్ వైట్, ఆక్వా మెరైన్, రెడ్.. మూడు రంగుల్లో దొరుకుతోంది. ఇందులో హిల్ స్టార్ట్ అసిస్ట్ టెక్నాలజీ ఫీచర్ జోడించారు. ఇది రోల్‌బ్యాక్‌ని ఆపుతుంది.

**ఇంజిన్:** 1.5లీటర్ల టర్బో డీజిల్, 115బీహెచ్‌పీ శక్తి, 300 ఎన్ఎం టార్క్.

### భద్రంగా — సమాచారం

## గూగుల్ స్టే సేఫర్

గూగుల్ మాప్స్‌లో కొత్త ఫీచర్ వచ్చింది. 'స్టే సేఫర్' అనే ఈ ఫీచర్‌ను కొన్ని నెలలుగా పరీక్షించారు కూడా. దీంతో ఉపయోగం ఏమిటంటే.. మనం ఎక్కడికెళ్లినా ఆ విషయాన్ని మన బంధువులు, స్నేహితులతో పంచుకోవచ్చు. ముఖ్యంగా మనకు తెలియని కొత్త ప్రదేశాల్లో ఏ టాక్సీనో, ఆటోనో ఎక్కితే ఇది బాగా ఉపయోగపడుతుంది. ఆండ్రాయిడ్ వినియోగదార్లు తమ స్మార్ట్‌ఫోన్‌లోని మాప్స్ అప్లికేషన్‌ను అప్‌డేట్ చేసుకుంటే స్క్రీన్ కింది భాగాన కుడివైపున స్టే సేఫర్ కనిపిస్తుంది.



దాన్ని క్లిక్ చేసిన వెంటనే రెండు ఆప్షన్లు వస్తాయి. తొలి ఆప్షన్‌లో 'షేర్ లైవ్ ట్రిప్' ఉంటుంది. దీనిని ఎంచుకుంటే కుటుంబం, స్నేహితులతో నేరుగా లైవ్ లొకేషన్‌ను పంచుకోవచ్చు. అంతే కాదు.. థర్డ్ పార్టీ అప్లికేషన్లయిన ఫేస్‌బుక్, వాట్సాప్‌లతోనూ ఈ లైవ్ లొకేషన్‌ను పంచుకోవడానికి వీలవుతుంది. ఇక రెండో ఆప్షన్ 'గెటాఫ్ రూట్ అలర్ట్స్'. మనం వెళుతున్న ఆటో లేదా టాక్సీ గూగుల్ సిఫారసు చేసిన మార్గంతో పోలిస్తే అరకిలోమీటరు అటుఇటైనా మనకు అలర్ట్ వస్తుంది. వెంటనే మనం అప్రమత్తమై డ్రైవర్‌తో మాట్లాడొచ్చు. ఇతరులకు సమాచారం పంపొచ్చు. ప్రస్తుతం ఆండ్రాయిడ్ వినియోగదార్లకు మాత్రమే ఈ ఫీచర్ అందుబాటులో ఉంది.

## బండి ఆగిందా?

సాఫీగా సాగిపోయే బండి ఉన్నట్టుండి ఆగిపోతుంది. అంగుళం కదలకుండా మొరాయిస్తుంది. మెకానిక్ షెడ్ అందుబాటులో ఉండదు. మనకేమో అత్యవసర పని ఉంటుంది. పైగా నిర్మానుష్యం. ఇలాంటప్పుడు మన బాధలు వర్ణనాతీతం. అంతలా కాకపోయినా చాలామందికి ఇలాంటి అనుభవం ఏదో ఒక సమయంలో ఎదురయ్యే ఉంటుంది. అసలు ద్విచక్రవాహనం ఉన్నట్టుండి ఎందుకు ఆగిపోతుంది? అప్పుడేం చేయాలి?

### పరిష్కారం



❑ **వీక్/డెడ్ బ్యాటరీ:** బండి ఆగిపోవడానికి మొదటి కారణం బ్యాటరీ పాడవడం. ఈ శక్తిని ఉపయోగించుకొని ఎలక్ట్రిక్ వ్యవస్థ ద్వారా వాహనంలోని భాగాలను కలుపుతారు. ఇది పాడైనప్పుడు బండి ముందుకెళ్లడం అసాధ్యం. హారన్ పనిచేయకపోవడం, హెడ్‌లైట్లు ఆన్ కాకపోవడం బ్యాటరీ చెడిపోయిందనడానికి సంకేతం.

❑ **ఇంధనం:** బండిలో పెట్రోల్ అయిపోయినప్పుడు ఆగిపోవడం సహజం. ఇది గమనించకుండా చాలామంది అదేపనిగా స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. సాధారణంగా బైక్‌లో పెట్రోల్ ఉందో, లేదో కనుక్కోవడమూ కష్టమే. అప్పుడు వాహనాన్ని అటూఇటూ ఊపి చూడటమే. పాతదే అయినా ఈ చిట్కా బాగా పని చేస్తుంది. లేదంటే మొబైల్‌ఫోన్ ఫ్లాష్‌లైట్ వేసి ట్యాంకులో చెక్ చేయాలి.

❑ **వ్యర్థాల అడ్డు:** ఫ్యుయెల్ ట్యాంక్ నుంచి ఇంజిన్‌కి నిరంతరం ఇంధనం సరఫరా కావడానికి ఫ్యుయెల్ ట్యాంక్ కిందిభాగంలో చిన్న వెంట్ ఉంటుంది. ఇందులో ఏవైనా వ్యర్థాలు ఇరుక్కున్నా, బిగుసుకుపోయినా ఇంధన సరఫరా నిలిచిపోయి బండి అకస్మాత్తుగా ఆగిపోతుంది. అడ్డుపడ్డ వ్యర్థాలను సన్నని తీగతో శుభ్రం చేయాలి.

❑ **క్లచ్ పనితీరు:** మీ బండి స్టార్ట్ చేసి గేరు వేసే ముందు క్లచ్ లీవర్‌ని కరెక్ట్‌గా లాగి పట్టి వేయాలి. ఒక్కోసారి క్లచ్ సరిగా పడనప్పుడు బండి స్టార్టింగ్ ప్రాబ్లెం వస్తుంది. మళ్లీ ఓసారి న్యూట్రల్‌కి వచ్చి గేర్ వేస్తే వాహనం స్టార్ట్ అవుతుంది.

❑ **బ్లాక్ అయినప్పుడు:** ఎయిర్‌బాక్స్‌లు బ్లాక్ అయిపోవడం లేదా ఎగ్జాస్ట్ సిస్టమ్‌లో ఏదైనా అడ్డుపడినప్పుడు బండి ఆగిపోతుంది. చిన్నపిల్లలు ఒక్కోసారి సైలెన్సర్‌ల్లో ఏవైనా దూరుస్తుంటారు. బైక్ ఆగిపోయినప్పుడు ఇన్‌టేక్, ఎగ్జాస్ట్ సిస్టమ్‌లో ఓసారి తప్పకుండా చెక్ చేయాలి.

❑ **స్పార్క్‌ప్లగ్ సమస్య:** వాహనం ఎక్కువసార్లు ఆగిపోవడానికి ఇదే కారణం. బండి వేగంగా వెళ్తున్నప్పుడు స్పార్క్‌ప్లగ్ వైరు కొంచెం పక్కకి జరిగినప్పుడు ఇలా జరుగుతుంది. దీనికి మెకానిక్‌తో అవసరం లేదు. స్పార్క్‌ప్లగ్‌ని ఓసారి బయటికి తీసి మళ్లీ బిగించి స్టార్ట్ చేస్తే చాలు.

❑ **స్విచ్చాన్:** ఇగ్నిషన్ కీని ఆఫ్‌లోనే ఉంచి చాలామంది బండి స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. ఇంజిన్‌కి ఇంధనం అందనప్పుడు టూవీలర్ స్టార్ట్ అవడం అసాధ్యమే కదా. బండి స్టార్ట్ కావడం లేదనుకున్నప్పుడు ఓసారి కీ ఆన్ చేశామా? లేదా? చూసుకోవాలి.

# ఈనాడు సినిమా

## నాపై నేనే ఒత్తిడి పెంచుకుంటున్నా

**ఈమధ్య సమంత పూర్తిగా మారిపోయింది. కమర్షియల్ సినిమాలకు చెక్ పెట్టింది. నటిగా తనకు సవాల్ విసిరే పాత్రలే చేస్తోంది. 'రంగస్థలం', 'మజిలి', 'యూటర్న్'.. తమిళంలో వచ్చిన 'సూపర్ డీలక్స్' సినిమాలే ఇందుకు నిదర్శనం. ఇప్పుడు 'ఓ బేబీ' లోనూ ఓ ప్రయోగం చేసింది. 70 ఏళ్ల బామ్మ పాత్రలో పరకాయ ప్రవేశం చేసింది. శుక్రవారం ఈ చిత్రం విడుదల కానుంది. మరి బేబీగా సమంత అనుభవాలేంటి? ఈ సినిమాతో ఆమెకు ఎదురైన సవాళ్లేంటి? ఇవన్నీ ఆరా తీస్తే...**


సమంత

**'మజిలీ', 'ఓ బేబీ'.. ఈ రెండు చిత్రాలకు సంబంధించి ప్రచార బాధ్యతలన్నీ మీరే భుజాన వేసుకుని మోశారు. కారణమేంటి?**

ఈ రెండు సినిమాల్నీ నేను అంతగా ప్రేమించాను. 'మజిలీ' నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. పెళ్లయ్యాక చైతో కలసి తొలిసారి నటించాను. అందుకే ఆ సినిమాని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలనుకున్నాను. 'ఓ బేబీ' కథ కూడా నా మనసుకి నచ్చింది. ఈ సినిమా చూడ్డానికి జనం రావాలి. అందుకే నా తాపత్రయం.

**కథానాయిక ప్రాధాన్యం ఉన్న సినిమా ఇది. ఇలాంటి చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకర్షించడం సవాల్‌గా మారింది కదా?**

అవును. నన్ను చూసి జనం థియేటర్లకు వస్తారో రారో అనే సంగతి నేను అంచనా వేయలేను. ఇది వరకు ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ ఇలా... స్టార్ కథానాయకుల చిత్రాల్లో నేనుండేదాన్ని. వాళ్ల కోసం ప్రేక్షకులు థియేటర్లకు వచ్చేవారు. ఇప్పుడు నన్ను చూసి ఎంత మంది వస్తారో చూడాలి. కథాబలం ఉన్న చిత్రమిది. 'ఇది మంచి సినిమా' అని ప్రేక్షకులకు తెలిస్తే చాలు. తప్పకుండా ఆదరిస్తారు.

**'యూటర్న్' ఆశించిన ఫలితాన్ని ఇచ్చిందా?**

నిజానికి చాలా మంచి చిత్రమది. విమర్శకులు కూడా ఆ చిత్రాన్ని మెచ్చుకున్నారు. కానీ అది వసూళ్ల రూపంలో కనిపించలేదు. ఈ విషయంలో నేనెవరినీ నిందించడం లేదు. థ్రిల్లర్ చిత్రాల్లో ఉన్న సమస్యే అది. అయితే 'ఓ బేబీ' అలాంటి సినిమా కాదు. ఇందులో వినోదం, కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, ఫాంటసీ అన్నీ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే ప్యాకేజీలా అనిపించింది. అందుకే ఈ కథని ఎంచుకున్నాను.

**'ఓ బేబీ' మీలో నటికి విసిరిన సవాళ్లేంటి?**

నా పాత్రే విచిత్రంగా ఉంటుంది. చూడ్డానికి పడుచు.. కానీ వయసు మాత్రం 70 ఏళ్లు. నేనొక్కసారిగా ముసలమ్మలా మారిపోవడం సవాలే కదా? భావోద్వేగ భరితమైన సన్నివేశాల్లో నటించడం చాలా సులభం. ఎందుకంటే ముందు నుంచీ అలాంటి పాత్రలతోనే ప్రయాణం చేస్తున్నాను. చిటికెలో నాకు కన్నీరు వచ్చేస్తుంది. కానీ నేనెప్పుడూ నవ్వించలేదు. వినోద సన్నివేశాలు చూడడం చాలా తేలిక. కానీ అందులో నటించడం మాత్రం చాలా కష్టం. అదెంత కష్టమో ఈ సినిమాతో అర్థమైంది. రాజేంద్రప్రసాద్‌గారి వల్ల.. నవ్వించే విషయంలోనూ పాసైపోయాను. ఓ డైలాగ్‌ని ఎక్కడ మొదలెట్టాలో, ఎక్కడ కట్ చేయాలో ఆయన్ని చూసి నేర్చుకున్నాను. పతాక సన్నివేశాలు చాలా ఇబ్బంది పెట్టాయి. రావు రమేష్‌ని నా కొడుకుగా ఊహించుకుని నటించడం కష్టమైంది. ఓ నటిగా నాకు సవాల్ విసిరిన సన్నివేశం అదే.

**ఈ పాత్ర ప్రభావం నుంచి బయటకు రావడానికి సమయం పట్టిందా?**

అవును. 70 ఏళ్ల బామ్మల అలవాట్లు, వాళ్ల మాట తీరు, బాడీ లాంగ్వేజీ ఇవన్నీ అర్థం చేసుకుని ఈ పాత్రలో నటించాను. సెట్లోంచి బయటకు వచ్చిన తరవాత కూడా ఆ లక్షణాలు వదల్లేదు. ఈమధ్య ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వెళ్లా. అక్కడ నాతోటి హీరోయిన్లంతా పద్ధతిగా, అమ్మాయిల్లా కూర్చుంటే - నేను మాత్రం బామ్మలా కూర్చున్నా. ఆ ఫొటో చూసి నాకే నవ్వొచ్చింది.

**సినిమా సినిమాకీ నటిగా మీ పరిధి పెంచుకుంటూ వెళ్తున్నారు. విజయాలూ సాధిస్తున్నారు. ఇవన్నీ మీపై ఒత్తిడి పెంచడం లేదా?**

నిజానికి నాపై నేనే ఒత్తిడి పెంచుకుంటుంటా. నేను చేసిన సినిమా కంటే చేయబోయే సినిమా ఇంకా బాగుండాలి, నా పాత్ర ఇంకా బాగా రావాలన్న తాపత్రయం నాది. అది కచ్చితంగా ఒత్తిడి పెంచేదే. ఓ సినిమా ఒప్పుకున్నప్పుడు ఆ పాత్ర నన్ను వెంటాడాలి. రేపు షూటింగ్ అంటే ఈ రోజు నిద్ర పట్టకూడదు. పాత్రలో అంత దమ్ముండాలి.

**ఈ మధ్య తిరుపతికి ఎక్కువగా వెళ్తున్నారు.. భక్తి పెరిగిందా?**

ప్రై సినిమా విడుదలకు ముందు తిరుపతి వెళ్లడం అలవాటైంది. తొలిసారి నా సినిమా విడుదలకు ముందు అక్కడికి వెళ్లాను.

**'అమ్మ ఎప్పుడు అవుతావు' అని తరచూ మిమ్మల్ని సోషల్ మీడియాలో అభిమానులు అడుగుతుంటారు. ఈ కామెంట్లు మీకు ఇబ్బంది కలిగిస్తున్నాయా?**

అలాంటిదేం లేదు. నాకో పెళ్లైన స్నేహితురాలు ఉండి, తను ఎదురైతే.. నేను కూడా ఆ ప్రశ్నే వేస్తాను కదా? ఇలాంటి విషయాల్ని వ్యతిరేక దృష్టితో చూడడం నాకిష్టం లేదు.

> ఈ సృష్టిలో నిస్వార్థ జీవి అమ్మనే. మా నాన్న డాక్టర్, మా నాన్న ఇంజనీర్ అని బయట గొప్పగా చెప్పుకుంటాం. మా అమ్మ గృహిణి అని చెప్పుకోవడానికి ఎందుకో అంత ఇష్టపడం. కానీ మన కోసం ఏమైనా చేసేది అమ్మే. కానీ తనకు థ్యాంక్స్ చెప్పాలనిపించదు మనకు. 'అమ్మా.. చిన్నప్పుడు దేని కోసమైనా కలలు కన్నావా? ఏదైనా దక్కకుండా పోయిందా?' అని అమ్మని అడిగాను. 'ఏమైంది నీకు..? నువ్వు బాగానే ఉన్నావ్ కదా' అని కంగారు పడింది. 'నువ్వు హ్యాపీగా ఉంటే.. నాకు అంతే చాలు, ఇంకేం అవసరం లేదు' అంది అమ్మ. అందరు అమ్మలూ అంతే కదా.

## మంచు కొండల్లో మహేష్


మహేష్‌బాబు

'మహర్షి'తో ఓ మంచి విజయాన్ని అందుకున్నారు మహేష్‌బాబు. ఇప్పుడు ఆయన దృష్టంతా 'సరిలేరు నీకెవ్వరు'పై ఉంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. రష్మిక కథానాయిక. విజయశాంతి కీలక పాత్రలో కనిపిస్తారు. ఈవారంలోనే కశ్మీర్‌లో చిత్రీకరణ మొదలు కానుంది. మంచు కొండల నేపథ్యంలో కొన్ని సన్నివేశాల్ని తెరకెక్కిస్తారు. ప్రస్తుతం చిత్రబృందం అక్కడే ఉంది. త్వరలోనే మహేష్‌బాబు కూడా సెట్లో అడుగుపెడతారు. మహేష్ ఓ సైనిక అధికారిగా కనిపించనున్నారు. కుటుంబ బంధాల నేపథ్యంలో సాగే కథ ఇది. యాక్షన్, వినోదం సమపాళ్లలో మేళవించారు. చాలాకాలం తరవాత విజయశాంతి వెండి తెరపై కనిపించబోతున్నారు. ఆమె పాత్ర చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. కొన్ని పాటల రికార్డింగ్ పూర్తయింది. సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు.


'రణరంగం'లో శర్వానంద్, కల్యాణి ప్రియదర్శన్

## హలో... మిస్టర్ కేకే


విక్రమ్

విక్రమ్ కథానాయకుడిగా నటించిన అనువాద చిత్రం 'మిస్టర్ కె.కె'. అక్షర హాసన్, అభిహాసన్ కీలక పాత్రధారులు. రాజేష్ ఎం.సెల్వ దర్శకత్వం వహించారు. టి.నరేష్ కుమార్, టి.శ్రీధర్ నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈనెలలోనే విడుదల చేస్తారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "యాక్షన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ఇది. విక్రమ్ గెటప్ విభిన్నంగా ఉంటుంది. సమర్థుడైన కమాండర్‌గా ఆయన నటన, పోరాట సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ప్రచార చిత్రానికి మంచి స్పందన వస్తోంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాము"న్నారు. సంగీతం: జిబ్రాన్


కార్తికేయ

## తప్పు చేస్తే శిక్ష ఎవరికి?

కార్తికేయ కథానాయకుడిగా నటించిన చిత్రం 'గుణ 369'. అనఘ కథానాయిక. అర్జున్ జంధ్యాల దర్శకుడు. తిరుమలరెడ్డి, అనిల్ కడియాల నిర్మాతలు. ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర సమర్పకురాలు ప్రవీ కడియాల మాట్లాడుతూ "మనం చేసే తప్పుల వల్ల మన జీవితానికి ఏం జరిగినా పర్వాలేదు. పక్క వాళ్ల జీవితాలకు మాత్రం ఎలాంటి నష్టం రాకూడదు. ఈ అంశం చుట్టూ తిరిగే కథ ఇది. యువతరానికి కావల్సిన అన్ని అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే సన్నివేశాలూ ఉంటాయ"న్నారు. "తెలుగులో మంచి సినిమాలు రావడం లేదని చాలామంది బాధ పడుతుంటారు. ఈ సినిమా చూస్తే ఆ లోటు తీరిపోతుంది. ఎవరు చేసిన తప్పుకి వాళ్లే శిక్ష అనుభవించాలి అనే అంశానికి వాణిజ్య హంగుల్ని మేళవించి తీర్చిదిద్దామ"న్నారు దర్శకుడు. సంగీతం: చైతన్ భరద్వాజ్

## నా కలంపై ఒట్టు పెట్టుకున్నా

**"ఒక సెల్‌ఫోన్‌లో రెండు సిమ్ కార్డులు ఉన్నట్టే, ఒక వ్యక్తికి రెండు మెదళ్లు ఉంటే ఎలా ఉంటుందన్న ఆలోచన నుంచి 'బుర్ర కథ' పుట్టింద"న్నారు డైమండ్ రత్నబాబు. పలు చిత్రాలకు రచయితగా పనిచేసి, 'బుర్రకథ'తో దర్శకుడిగా అవతారం ఎత్తారు. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో డైమండ్ రత్నబాబు విలేకరులతో మాట్లాడారు.**


డైమండ్ రత్నబాబు

"రెండు మెదళ్లతో పుట్టిన వాళ్ల గురించి ఇంటర్నెట్‌లో అన్వేషించాను. ప్రపంచంలో అలాంటి వాళ్లు దాదాపుగా పదహారు మంది ఉన్నార్ట. వాళ్లంతా ఇప్పుడు బతికిలేరు. ఎవరైనా బతికుంటే ఎలా ఉంటుందన్న ఊహకు తెర రూపమే 'బుర్ర కథ'. ఓ ఇంట్లో ఇద్దరు అబ్బాయిలుంటే ఒకరు క్లాస్, మరొకరు మాస్‌గా మారిపోతారు. కానీ ఆ రెండు లక్షణాలూ అభిరామ్‌లో ఉంటాయి".

- "రాజేంద్రప్రసాద్, ఆది తండ్రీకొడుకుల్లా నటించారు. వాళ్ల పాత్రలు సహజంగా ఉంటాయి. ఇలాంటి కథలు అర్థమయ్యేలా చెప్పాలి. ఆ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. విశ్రాంతి, పతాక సన్నివేశాల్లో వచ్చే మలుపులు ఎవరూ ఊహించలేరు".
- "చిన్నప్పటి నుంచి కవితలు రాసే అలవాటు ఉంది. 'డైమండ్' అనే కలం పేరుతో రాసేవాణ్ని. 'పిల్లా నువ్వు లేని జీవితం', 'పాండవులు పాండవులు తుమ్మెద', 'ఆడోరకం ఈడోరకం', 'గాయత్రి' చిత్రాలకు సహాయకుడిగా పనిచేశాను. హాలీవుడ్ సినిమాలు చూసి కథలు తయారు చేసుకోవడం నాకు నచ్చదు. హాలీవుడ్ సినిమాల స్ఫూర్తితో కథలు రాసుకోకూడదని నా కలంపై ఒట్టు వేసుకున్నా. రామాయణ మహాభారతాలు తరచి చూస్తే చాలు. చాలా కథలు దొరుకుతాయి".
- "దర్శకుడిగా నాకు దాసరి నారాయణ రావు ఆదర్శం. ఆయన దర్శకులకు గౌరవం తెచ్చారు. రచయిత దర్శకుడైతే కొన్ని సౌలభ్యాలు ఉంటాయి. రచయిత, దర్శకుడు.. రెండు విభాగాల్లోనూ కొనసాగుతాను. ఇప్పటికే అయిదుగురు నిర్మాతలకు కథలు చెప్పాను. అందులో ఓ చిత్రానికి దర్శకత్వం వహిస్తాను. నాలుగు చిత్రాలకు కథారచయితగా పనిచేస్తా".

## అరె.. ఏమైందిరా కిషోర్


అప్పిరెడ్డి, సాయి రోనక్, ప్రీతి, సుజై, సుశీల్

సాయి రోనక్, ప్రీతి అస్రాని జంటగా నటించిన చిత్రం 'ప్రెజర్ కుక్కర్'. సుజై, సుశీల్ దర్శకులు. వీళ్లతో పాటు అప్పిరెడ్డి నిర్మాతగా వ్యవహరించారు. 'అరె.. ఏమైందిరా కిషోర్' అనే ప్రచార గీతాన్ని హైదరాబాద్‌లో కథానాయకుడు సందీప్ కిషన్ ఆవిష్కరించారు. దర్శకులు మాట్లాడుతూ "యువతరానికి మంచి సందేశం ఇచ్చే చిత్రమిది. ఉద్యోగం కోసం అమెరికా వెళ్తే, డాలర్ల మోజులో పడి ఏం కోల్పోతున్నారో ఈ పాటతో చెప్పాము"న్నారు. "ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఏదో ఓ దశలో ఒత్తిడి అనుభవించాల్సివస్తుంది. దాని చుట్టూ నడిచే వినోదాత్మక కథ ఇది. రాహుల్ సిప్లిగంజ్ స్వరపరచి పాడిన పాటకు మంచి స్పందన వస్తోంద"న్నారు నిర్మాత అప్పిరెడ్డి.

## సాహోలో మెరిసిందా?


జాక్వెలైన్ ఫెర్నాండెజ్

శ్రీలంక అందం జాక్వెలైన్ ఫెర్నాండెజ్ తెరపై కనిపించి ఏడాది గడిచిపోయింది. గత ఏడాది సల్మాన్‌ఖాన్ 'రేస్ 3'లో ఆడిపాడింది. ఇప్పుడు ఈ అందాల తార 'సాహో'లో మెరిసిందంటూ వార్తలొస్తున్నాయి. ఇందులో ఓ ప్రత్యేక గీతంలో ప్రభాస్‌తో కలిసి జాక్వెలైన్ చిందేసిందంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. ప్రస్తుతం 'సాహో' చిత్రీకరణ ఆస్ట్రియాలో జరుగుతోంది. "జాక్వెలైన్ ప్రస్తుతం ఆస్ట్రియాలోనే ఉంది. ప్రభాస్‌తో సరదాగా సాగే ఓ పాటలో పాల్గొంది. బాద్‌షా ఆలపించిన ఈ గీతం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడే ప్రభాస్, శ్రద్ధాకపూర్‌పై వైభవీ మర్చంట్ నృత్య దర్శకత్వంలో మరో గీతాన్నీ తెరకెక్కించారు" అని జాక్వెలైన్ సన్నిహిత వర్గాలు చెప్పినట్టు సమాచారం. సుజీత్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మించిన 'సాహో' భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. ఆగస్టు 15న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# అడవుల్లో నివాసం ఆదివాసీల హక్కు

- వారిని తరలించడం తగదు
- కేంద్రానికి ఐక్యరాజ్య సమితి నిపుణుల సూచన

ఈనాడు - దిల్లీ

అటవీ భూములతో విడదీయరాని అనుబంధం ఏర్పరుచుకున్న 90 లక్షలమంది గిరిజనులను అక్కడి నుంచి తరలించే ప్రక్రియను నిలిపేయాలని ఐక్యరాజ్య సమితి నిపుణులు భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి మానవహక్కుల విభాగం గురువారం ప్రకటన విడుదల చేసింది. రక్షిత అటవీప్రాంతాలను ఆక్రమించడం వల్ల అడవులు అంతరించిపోతున్నాయంటూ వన్యప్రాణి సంరక్షణ సంస్థలు వేసిన కేసులో ఫిబ్రవరి 13వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వం ఆదివాసీలను ఖాళీచేయించేందుకు ఉపక్రమించిన విషయాన్ని గుర్తుచేసింది. 'ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం... ఆదివాసీలు అడవుల్లో అక్రమంగా నివసిస్తున్నారని చెప్పడమే. అది పూర్తిగా తప్పు. వాస్తవంగా స్థానిక ప్రజలే అక్కడి భూములు, అడవులకు యజమానులు'' అని ఐక్య రాజ్యసమితి మానవ హక్కుల విభాగంలో స్థానిక ప్రజల హక్కుల ప్రత్యేక పర్యవేక్షకురాలు విక్టోరియా టౌలీ పేర్కొన్నారు. ఆ భూములు ఆదివాసీలవే అయినా దశాబ్దాల తరబడి వాటిని రక్షించుకోవడంలో కీలక భూమిక పోషిస్తున్న దేశీయ ప్రజలు, స్థానిక సంఘాలపై కబ్జాదారులుగా ముద్రవేస్తున్నారు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.. 2006 అటవీహక్కుల చట్టం కింద గిరిజనులను ఖాళీచేయించాలన్న ఉత్తర్వులపై సుప్రీం కోర్టు 2019 ఫిబ్రవరి 28వ తేదీన స్టే విధించి, ఆదివాసీల అటవీహక్కులను ఏ ప్రాతిపదికన ఖరారు చేయాలనుకుంటున్నారో జులై 12వ తేదీలోపు చెప్పాలని రాష్ట్రాలను కోరినట్లు గుర్తుచేశారు. ఈ ఉత్తర్వుల మేరకు నాలుగు నెలలపాటు గిరిజనుల తరలింపును వాయిదా వేసినప్పటికీ లక్షలాది మంది గిరిజనుల పరిస్థితి ఇప్పటికీ ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు. వారిని ఖాళీచేయిస్తే నివాస ప్రాంతాలకు దూరమవడమే కాకుండా జీవనోపాధి, సంస్కృతినీ కోల్పోతారని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదివాసీలను అటవీ భూముల నుంచి బలవంతంగా తరలించే ప్రక్రియపై మారటోరియం విధించాలని 2016లో తాను సిఫార్సు చేసినట్లు గుర్తుచేశారు. బాధితులకు కనీసం తలదాచుకొనేందుకు వసతి కూడా చూపించకుండా ఖాళీ చేయించడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. పులుల సంరక్షణ పేరుతో ఇప్పటికే అటవీప్రాంతాల నుంచి ఖాళీ చేయించడం వల్ల అనేక మంది నివాసాలు కోల్పోయారన్నారు. పులుల సంరక్షణ ప్రాంతాల్లో స్థానిక ప్రజలు నివసించడం వల్లే పులుల సంఖ్య పెరిగిందన్న విషయాన్ని గుర్తుంచాలన్నారు. తరతరాలుగా భారతీయ ఆదివాసీలు వన్యప్రాణులతో కలిసి జీవించడంతోపాటు వాటిని అటవీ సంపదగా భావించి సంరక్షిస్తున్నారని తెలిపారు. వన్యప్రాణులు, అటవీప్రాంతాలను సంరక్షించాలనుకొనేవారు ఆదివాసీలను ఖాళీచేయించడానికి బదులు వారి అటవీ హక్కులను గుర్తించాలన్నారు. అటవీహక్కుల చట్టం స్ఫూర్తిని నిలబెట్టాలని తాము భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అటవీ హక్కుల కోసం గిరిజనులు పెట్టుకున్న దరఖాస్తులపై పారదర్శకమైన, స్వతంత్ర విచారణ జరగాలన్నారు. తద్వారా వారి జీవనానికి భరోసా ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా తరలించక తప్పని పరిస్థితి ఉంటే వారికి తగిన పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీచట్టం-1927కి తలపెట్టిన సవరణలను అమల్లోకి తీసుకొస్తే మరింత ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.



## గవర్నర్‌తో అటవీ, గిరిజన సంక్షేమ అధికారుల భేటీ

- కుమురం భీం, భద్రాద్రి జిల్లాల్లో ఘటనలపై నివేదికలు

ఈనాడు, హైదరాబాద్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇటీవల అటవీ శాఖాధికారులపై దాడులు, ఇతర అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు గవర్నర్ నరసింహన్‌కు నివేదిక సమర్పించారు. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. రెండు జిల్లాల్లోని సంఘటనల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు నివేదికలను తయారు చేసుకొని వెళ్లారు. గవర్నర్‌తో సమావేశం సందర్భంగా అక్కడి పరిస్థితులను వివరించారు. హరితహారం, పోడు భూములు, స్థానిక గిరిజనుల డిమాండ్లు, గొత్తికోయల వలసలు, శాంతిభద్రతలు, భూసేకరణకు ఎదురవుతున్న ఆటంకాలు ఇతర అంశాలను తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం, ప్రజాప్రతినిధుల వైఖరి తదితర అంశాల గురించి గవర్నర్ అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది.

## టీజీటీ పోస్టులకు బీటెక్ అభ్యర్థులు అర్హులే

### తీర్పు వెలువరించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల సొసైటీల్లో టీచర్ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ (టీజీటీ) పోస్టులకు బీటెక్ అభ్యర్థులను అర్హులుగా పరిగణించాలని హైకోర్టు పేర్కొంది. టీజీటీ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో బీఏ, బీకాం, బీఎస్సీ అభ్యర్థులే అర్హులంటూ పేర్కొనడాన్ని సవాలు చేస్తూ ఖమ్మం జిల్లాకు చెందిన కె.సంజీవరావు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్.ఉమాదేవి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ బీటెక్‌తోపాటు బీఎడ్ పూర్తి చేశారన్నారు. ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం ఏదేని డిగ్రీలో అర్హత సాధించాల్సి ఉందన్నారు. దీని ప్రకారం బీటెక్‌ను పరిగణనలోకి తీసుకోకుండా నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికే పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినప్పటికీ ఎంపిక ప్రక్రియలో పేర్లను చేర్చలేదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఎన్‌సీటీఈ 2014 నిబంధనల ప్రకారం టీజీటీ పోస్టుల భర్తీకి బీఏ, బీకాం, బీఎస్సీలతోపాటు బీటెక్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పిటిషనర్లకు అర్హతలుంటే వారిని టీజీటీ పోస్టులకు ఎంపిక చేయాలంటూ విచారణను ముగించారు.

### రోడ్డు ప్రమాదాలపై నివేదికివ్వండి

గత ఆరు నెలల్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత స్టేషన్ పరిధిలోని ప్రమాద క్లెయిం ట్రైబ్యునల్‌కు ఎన్ని కేసుల వివరాలు పంపారో స్పష్టంగా నివేదిక ఇవ్వాలని తెలంగాణ డీజీపీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ట్రైబ్యునల్‌కు వివరాలు పంపితే బీమా కంపెనీ 30 రోజుల్లో బాధితులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, ప్రమాద వివరాలను పోలీసులు పంపకపోవడంతో పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోందని వ్యాఖ్యానించింది. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 158(6) అమలుకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. డీజీపీ సమర్పించిన నివేదికను పరిశీలించిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఏడాది ప్రమాదాలకు సంబంధించి ట్రైబ్యునల్‌కు పంపిన వివరాలను, అక్కడ పెండింగ్‌లో ఉన్న కేసులతో నివేదిక సమర్పించాలంటూ విచారణను ఈ నెల 8 కి వాయిదా వేసింది.

### క్రీడల కోటా అమలుపై వివరణివ్వండి

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల ప్రక్రియలో క్రీడల కోటా అమలుకు తీసుకున్న చర్యలేంటో చెప్పాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాన్ని గురువారం హైకోర్టు ఆదేశించింది. మూడు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలంది. ప్రవేశాల కోసం ఈ ఏడాది యూనివర్సిటీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో క్రీడల కోటాను అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ మామిడాల సంజన అనే విద్యార్థిని హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలను విన్న ధర్మాసనం క్రీడా కోటా అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలంటూ విచారణను వాయిదా వేసింది.

## నకిలీ విత్తన విక్రయాల ఆటకట్టు

- విక్రేతలను పట్టుకునేందుకు 16 బృందాలు
- వ్యవసాయశాఖతో కలిసి పోలీసుల దాడులు

ఈనాడు, హైదరాబాద్: నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టేందుకు పోలీసుశాఖ మరోమారు కసరత్తు మొదలుపెట్టింది. వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా 16 బృందాలు ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తోంది. ఇప్పటికే 150 కేసులు నమోదు చేసిన పోలీసుశాఖ 44 మందిని అరెస్టు చేసింది. రాబోయే రోజుల్లో దాడులను మరింత ఉద్ధృతం చేయనుంది. ఈసారి ఎలాగైనా నకిలీ విత్తనాల అమ్మకాలు నిలిపివేయించాలని, ప్రధాన సూత్రధారులను గుర్తించి కట్టడి చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందాలు ముమ్మర దాడులు చేసి నకిలీ విత్తనాలు కర్నూలు, మహారాష్ట్రల నుంచి దిగుమతి అవుతున్నట్లు కనుగొన్నాయి. వీటిని హైదరాబాద్ శివార్లలో ప్యాక్ చేసి రాష్ట్రం మొత్తం రవాణా చేస్తున్నట్లు గుర్తించాయి. దుకాణాలపై దాడులు చేయడం కంటే అసలు సరఫరా కేంద్రాలను పసిగట్టి అరికట్టగలిగితే మరింత ప్రయోజనం ఉంటుందని, చాలావరకూ వీటి అమ్మకాలను నిరోధించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలను ప్యాక్ చేసి ఎగుమతి చేస్తున్న సంస్థను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న సూత్రధారులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### ఇక పకడ్బందీగా కేసులు

నకిలీ విత్తనాల విక్రేతలపై పీడీ చట్టం ప్రయోగించే వెసులుబాటు ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆచరణలో సాధ్యం కావడంలేదు. 2017లో మూడు కంపెనీలు, ఇద్దరు విక్రేతలపై పీడీచట్టం ప్రయోగించింది. మళ్లీ ఇప్పటివరకూ కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఈ చట్టం కింద అరెస్టయితే ఏడాది వరకూ బెయిల్‌రాదు. సదరు నిందితునిపై అంతకు ముందు రెండు కేసుల్లో అభియోగపత్రం దాఖలై ఉండాలి. వీరు గతంలో పట్టుబడ్డప్పటికీ వారిపై చిన్నాచితకా కేసులు పెట్టి వదిలేస్తున్నారు. ఇప్పుడు దొరుకుతున్న వారిపై రికార్డుల పరంగా తీవ్రమైన కేసులు లేవు. ఈ నేపథ్యంలో వారిపై పీడీచట్టం ప్రయోగించే అధికారం పోలీసులకు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో పోలీసులు ఇప్పుడు పట్టుబడుతున్న వారందరిపైనా కేసులు నమోదు చేసి మిగతా చట్టపరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# మళ్లీ.. మళ్లీ.. రిజిస్ట్రేషన్

- రెండుసార్లు తప్పుడు ప్రక్రియ
- మరో ఘటనను గుర్తించిన ఆ శాఖ ఐజీ
- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మొన్న మియాపూర్ భూముల వ్యవహారం, నిన్న మరణించిన వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ మరకలు మరిచిపోకముందే వరంగల్ అర్బన్ జిల్లాలో ఒకే భూమిని రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఓ బాలుడు భూమిని కొనుగోలు చేయడం, అమ్మిన యాజమాని పేరు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడం, భూమి ఒక గ్రామ పరిధిలో ఉంటే మరొక ఊర్లో ఉన్నట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం లాంటి అక్రమాలెన్నో ఇందులో ఉన్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా గిర్మాజీపేట సర్వే నం.20, 21, 22లోని భూమి తనదంటూ 1972లో జారీ చేసిన స్టాంప్ పేపరు ఆధారంగా గుండ్ల రమేశ్‌బాబు అనే వ్యక్తి 2006లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ సమయంలో ఆయన సమర్పించిన రేషన్‌కార్డులో 1965లో పుట్టారని ఉంది. ఈ లెక్కన 1972 నాటికి రమేశ్‌బాబు వయసు ఏడు సంవత్సరాలు. కానీ ఇతనికి 18 సంవత్సరాలని ఆర్డీవో జారీ చేసిన డి.డిస్.నెం.ఎ/4665/2000 ధ్రువపత్రంలో ఉంది. చట్టప్రకారం మైనర్లకు స్టాంప్ పేపర్లు జారీ చేయకూడదు. ఇదిలా ఉంటే భూమి కొన్నట్లుగా సమర్పించిన ఆర్డీవో ధ్రువపత్రంలో లక్ష్మీపురంలో భూమి అని ఉంటే, గిర్మాజీపేటలో భూమి అని రిజిస్ట్రేషన్ చేయించారు. రికార్డుల్లో లేని రాయబహదూర్ శ్రీకిషన్ అనే వ్యక్తి పేరుమీద భూమి కొన్నట్లు చూపించారు. ఇంతటితో ఆగకుండా 2011లో వంగల శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి ఈ భూమిని విక్రయించినట్లు రెండోసారి రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందులో భూమి అమ్మిన వ్యక్తి, కొన్న వ్యక్తిగా రెండుచోట్లా శ్రీనివాస్‌రెడ్డి ఫొటోలు, సంతకాలు ఉండటం కొసమెరుపు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పులు జరిగాయని బాధితులు ఆధారాలతో సహా ఇటీవల ఐజీకి ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీనిపై నివేదిక సమర్పించాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారు. గ్రామం మార్చి రిజిస్ట్రేషన్ చేయించారంటూ వారు విచారణ నివేదిక ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని ఐజీ మరో నివేదిక ఇవ్వాలని డీఐజీని ఆదేశించారు. ఇది జరిగి నెల కావస్తున్నా ఇప్పటివరకు స్పందించడం లేదని రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికార వర్గాలు చెబుతున్నాయి.

### సరిగ్గా చూసుకోకపోవడంతోనే

రిజిస్ట్రేషన్ సమయంలో లింక్ డాక్యుమెంట్లు చూసుకోకపోవడంతో ఇలాంటి తప్పులు జరుగుతున్నాయి. అసలు ధ్రువపత్రాలు సరిచూసే అధికారం మా శాఖకు లేదు. ఇకపై ప్రతి విషయాన్ని పరిశీలించాకే రిజిస్ట్రేషన్ చేసే అధికారాన్ని సబ్‌రిజిస్ట్రార్లకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. వరంగల్ ఘటనలో మా శాఖను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని, త్వరలో ఆ సమస్యను పరిష్కరిస్తాం.

- చిరంజీవులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ

## తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగా విభజన

- రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సమాఖ్య, విద్యుత్ ఇంజినీర్ల సంఘాల వినతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలో జరిగే తొమ్మిది, పదో షెడ్యూళ్ల సంస్థల విభజనలో తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సమాఖ్య, విద్యుత్ ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేశాయి. సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేశం, జీటీ జీవన్‌లు గురువారం సీఎస్ ఎస్కే జోషిని సచివాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర పునర్‌విభజన చట్టాన్ని అనుసరించి విభజన జరగాలన్నారు. తాజా పరిణామాలను అనుకూలంగా తీసుకొని ఏపీ ఉద్యోగులు తెలంగాణకు రావాలని ప్రయత్నిస్తున్నారని, దీని వల్ల ఇక్కడి ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. విద్యుత్ ఇంజినీర్ల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నెహ్రూ, ఎం.భాస్కర్‌లు గురువారం విద్యుత్ సౌధలో సీఎండీ ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు న్యాయం జరిగేలా విభజన ఉండాలని, ఎక్కడ ఉద్యోగులు అక్కడే పనిచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## రేపు పది సప్లిమెంటరీ ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం (ఈ నెల 6వ తేదీ) మధ్యాహ్నం 2 గంటలకు వెల్లడికానున్నాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బి.సుధాకర్ ఫలితాలను విడుదల చేస్తారు.

## జులై 7న మాదిగల ఆత్మగౌరవ సభ

### ప్రకాశం జిల్లా ఈదుమూడిలో..

ఈనాడు, హైదరాబాద్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల ఏడో తేదీన ఏపీలోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మాదిగల ఆత్మగౌరవ సభ(జాతర)ను నిర్వహిస్తున్నట్లు మాదిగ విద్యార్థి సమాఖ్య జాతీయాధ్యక్షుడు రుద్రవరం లింగస్వామి తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, లోక్‌సభ మాజీ సభాపతి మీరాకుమార్ ఇతర నాయకులు హాజరవుతున్నారని లింగస్వామి చెప్పారు.

## జ్యోతిష్యం, జాతకం, వాస్తులో ప్రవీణ, విశారద కోర్సులు

ఈనాడు, హైదరాబాద్: భారతీయ జ్యోతిష్య శాస్త్ర మండలి ఆధ్వర్యంలో వేదిక్‌సైన్స్‌ను విస్తృతం చేసేందుకు జ్యోతిష్యం, జాతకం, వాస్తులో ప్రవీణ, విశారద కోర్సులను నిర్వహించనున్నట్లు మండలి ఛైర్మన్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 7 నుంచి ప్రతి ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వివరాలకు 91777 47000, 99594 63939 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## హైదరాబాద్‌లో పింఛనర్ల భవన్‌ను నిర్మించాలి

### తెలంగాణ ప్రభుత్వ పింఛనర్ల ఐకాస

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో పింఛనర్ల భవన్ నిర్మించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల ఐకాస తీర్మానించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వేయి గజాల స్థలాన్ని కేటాయించాలని కోరింది. గురువారం హైదరాబాద్‌లో ఐకాస సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐకాస ఛైర్మన్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ.. వెల్‌నెస్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని, ఆరోగ్యకార్డులపై అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని, 70 సంవత్సరాల వయస్సు నిండిన వారికి కొత్త పీఆర్‌సీలో 15 శాతం అదనపు పింఛను ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 25న ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. సమావేశంలో ఐకాస నేతలు డి.సుధాకర్, రాజమల్లయ్య, సుధాకర్‌రావు, సూర్యనారాయణ, కృష్ణమూర్తి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 'కొత్త వీసీల్లో 50 శాతం బీసీలకే ఇవ్వాలి'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు త్వరలో చేపట్టనున్న కొత్త ఉపకులపతుల నియామకాల్లో 50 శాతం బీసీలకే ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గురువారం సచివాలయంలో ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి ఆయన వినతిపత్రం సమర్పించారు. వీసీల నియామకాల్లో ఆది నుంచి బీసీలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. బీసీ సామాజిక వర్గాల్లో పలువురు మేధావులున్నా వారి సేవలను ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని చెప్పారు.

## సొంతంగా ఎదగలేకే ఫిరాయింపులు

- భాజపాపై తెదేపా విమర్శ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: సొంతంగా ఎదగలేని భాజపా, ఫిరాయింపులతో తన బలాన్ని పెంచుకోవాలని చూస్తోందని తెదేపా విమర్శించింది. గురువారం తెదేపా హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఒకప్పుడు ఒక్క ఎంపీ సీటు తగ్గడంతో నైతిక బాధ్యత వహించి ప్రధాని పదవిని త్యాగం చేసిన వాజ్‌పేయీ ఆలోచనలకు భిన్నంగా.. నేడు ఆయన వారసులు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీని నాయకులు వదిలినా, కార్యకర్తలు మాత్రం కొనసాగుతున్నారని చెప్పారు. త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

## ఏపీలో చేశారు.. ఇక్కడా బదిలీలు చేయండి!

### రెవెన్యూ సంఘం విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల నిర్వహణ కోసం ఇతర జిల్లాలకు బదిలీ చేసిన తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేయాలంటూ గురువారం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సచివాలయంలో సీఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం అక్కడి వారిని తిరుగు బదిలీ చేసిందని, మీరూ మా విన్నపాన్ని పట్టించుకోవాలని కోరారు. కుటుంబాలను వదిలి సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల మానసిక ఆందోళనను పట్టించుకోవాలన్నారు. ఏపీ విడుదల చేసిన ఉత్తర్వు నకలు పత్రాన్ని అధికారులకు అందించి వారు చేపట్టిన చర్యలను వివరించారు. ఒకటి, రెండు రోజుల్లో తిరుగు బదిలీలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు భరోసా ఇవ్వడంతో నాయకులు వెనుతిరిగారు.

## ఇంజిన్ లేకుండా వెనక్కి వెళ్లిన రైలు

మధ్యప్రదేశ్‌లో గురువారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్ లేకుండానే సరకు రవాణా రైలు ఒకటి పట్టాలపై వెనక్కి పరుగులు తీసింది. ఆగి ఉన్న మరో సరకు రవాణా రైలును తక్కువ వేగంతో ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. స్థానిక మహేలా నుంచి నిమాడ్ ఖేడికి బొగ్గు రవాణా చేసేందుకుగాను ప్రత్యేకంగా ఓ రైల్వే ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. తాజాగా అక్కడికి కంకర, ఇతర సామగ్రిని ఓ రైల్లో తీసుకెళ్లారు. మహేలా స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో దాన్ని నిలిపి ఉంచారు. సిబ్బంది సరిగా లాక్ చేయకపోవడంతో ఇంజిన్ లేకుండానే ఆ రైలు ఉన్నట్టుండి వెనక్కి పరుగులు పెట్టింది. అదే పట్టాలపై నిలిపి ఉంచిన మరో సరకు రవాణా రైలును ఢీకొట్టి ఆగిపోయింది. ఆ మార్గంలో ప్రయాణికుల రైలు వచ్చి ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. తాజా వ్యవహారంపై విచారణ జరుపుతున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

- ఈటీవీ భారత్

## సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల పోరుబాట

రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మూడు దశల పోరాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నేతలు తెలిపారు. ఈ మేరకు వారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయ, ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ నెల 12న మండల కేంద్రాల్లో ధర్నాలు, 20న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, ఆగస్టు 3న హైదరాబాద్ ఇందిరాపార్కులో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీఎస్‌ను కలిసిన వారిలో సీహెచ్.రాములు, చావ రవి(యూటీఎఫ్), వై.అశోక్‌కుమార్, మైస శ్రీనివాసులు(టీపీటీఎఫ్), లింగారెడ్డి(డీటీఎఫ్), పోచయ్య(ఏటీటీఏ), మహిపాల్‌రెడ్డి(ఎస్‌జీటీయూ), కైలాసం, రమేష్(ఎస్‌సీఎస్‌టీయూఎస్) తదితరులున్నారు.

## పావగడ కోర్టుకు వరవరరావు



తుమకూరు, న్యూస్‌టుడే: పౌరహక్కుల నేత వరవరరావును గురువారం కర్ణాటకలోని తుమకూరు జిల్లా పావగడ జె.ఎం.ఎఫ్.సి. కోర్టులో హాజరుపరిచారు. పావగడలోని తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధి వెంకటమ్మనహళ్లిలో ఉన్న కె.ఎస్.ఆర్.పి. బెటాలియన్‌పై 2005లో దాడి చేసి ఓ వ్యక్తి, ఎనిమిది మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని మావోయిస్టులు హతమార్చిన కేసులో ఆయన్ని నిందితుడిగా పేర్కొంటూ ఇక్కడికి తీసుకొచ్చారు. కోర్టు ఆదేశం మేరకు విచారణ కోసం వరవరరావును రెండు రోజులు పోలీసు కస్టడీలోకి తీసుకున్నట్లు తుమకూరు ఎస్పీ వంశీకృష్ణ తెలిపారు. ఆయన పర్యవేక్షణలో పుణెలోని యరవాడ జైలు నుంచి పటిష్ఠ భద్రత మధ్య వరవరరావును పావగడకు తీసుకొచ్చారు.

## 8న జాతీయ బీసీ కమిషన్ పర్యటన

ఈనాడు, హైదరాబాద్: జాతీయ బీసీ కమిషన్ ఈనెల 8న హైదరాబాద్‌లో పర్యటిస్తుందని కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి తెలిపారు. ఛైర్మన్ భగవాన్‌లాల్ సహానీ, ఉపాధ్యక్షుడు లోకేష్ ప్రజాపతి, సభ్యులు సుధాయాదవ్, కౌశలేంద్ర పటేల్‌తో కూడిన కమిషన్ దక్షిణాది రాష్ట్రాల పర్యటనలో భాగంగా నగరానికి వస్తోందని పేర్కొన్నారు. గురువారమిక్కడ బీసీ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములుతో ఆచారి సమావేశమయ్యారు. ఈనెల 9న జాతీయ బీసీ కమిషన్ ఏపీలో పర్యటించనుందని వివరించారు.

## రెండేళ్ల పాపపై దూసుకెళ్లిన ట్రాక్టర్

- నిద్రలోనే తుది శ్వాస

చొప్పదండి, న్యూస్‌టుడే: ఆదమరచి నిద్రిస్తున్న రెండేళ్ల చిన్నారిపై ట్రాక్టర్ దూసుకెళ్లిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి గ్రామంలో చోటుచేసుకుంది. హన్సిక అనే ఆ పాప అక్కడికక్కడే మృతిచెందిందని.. కేసు దర్యాప్తు చేస్తున్న రామడుగు ఎస్సై రవి తెలిపారు. గ్రామంలోని సిమెంటు ఇటుకల తయారీ కేంద్రంలో కూలీలుగా ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన నీలం, నందకుమార్ పనిచేస్తున్నారు. వారి కుమార్తెను గురువారం పనిస్థలంలో నిద్రపుచ్చి, ఎండ తగలకుండా పైనుంచి ప్లాస్టిక్ కవర్ కప్పారు. అదే ప్రాంతంలో పనికి ఇసుకను తెచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ శంకరయ్య..చూసుకోకుండా వాహనాన్ని వెనక్కి తీయడంతో అది పాపపైకి దూసుకెళ్లి క్షణాల్లో ప్రాణాల్ని హరించిందని పోలీసులు చెప్పారు.



ట్రాక్టర్ టైరు కింద పసికందు మృతదేహం


ఉద్యోగ అవకాశాలు

కావలెను
ప్రముఖ NBFC సంస్థ వారికి తెలంగాణ రాష్ట్రమంతటా పనిచేయుటకు కావలెను
బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్
ఏదైనా డిగ్రీ చదివి, NBFC రంగంలో 2 సం॥ అనుభవం కలిగి ఉండవలెను.
ఆసక్తి గల అభ్యర్థులు జూలై 5,6 & 7 తేదీలలో ఉ॥10గం॥ - సా॥5గం॥ లోపు ఈ క్రింది చిరునామా నందు హాజరు కాగలరు.
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ ప్లాట్ నెం.2, లెజెండ్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా, JSN కాలని, హబ్సిగూడ, హైదరాబాద్.
Cell: 8328609022, 9704315566. e-mail:hrho1@kanakadurgafinance.com

WANTED
HOSPITAL ADMINISTRATOR
The incumbent should be Post Graduate with specialisation in Hospital Administration with minimum of 10 years administrative experience especially relevant to Medical Colleges and Healthcare Management. Candidate having exposure to MCI and NABH guidelines will be preferred.
PROFESSORS / ASSISTANT PROFESSORS
Required in the departments of General Medicine, Assistant Professors in General Surgery. Senior Residents/Assistant Professors in Radio- Diagnosis and Casuality Medical Officers.
EMERGENCY / CRITICAL CARE PHYSICIANS
Qualification: M.D.(A&E) or Diploma (A&E)
Deserving candidates will be offered attractive salary and other perks.
Interested candidates may apply to nrihr2015@gmail.com within a week.
NRI Medical College & General Hospital
CHINAKAKANI, Mangalagiri (M), Guntur Dist.
Ph: 08645 - 230101. visit : www.nrias.net





A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
అలుగునూర్, కరీంనగర్
Cell: 90001 80623

**అయిదేళ్లలో 5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.350 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థే లక్ష్యం.. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మంత్రులూ తరచు వెల్లడిస్తున్న ఆకాంక్ష ఇది. ఇది సాకారం కావాలంటే వాస్తవ వృద్ధి రేటు 8 శాతంగా స్థిరపడాల్సిందేనని 2018-19 ఆర్థిక సర్వే పేర్కొంది. 2019-20 బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు, ఆర్థిక సర్వేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశ పెట్టారు.**

దిల్లీ

మన ఆర్థిక వ్యవస్థ 2024-25కు రూ.350 లక్షల కోట్లకు చేరేందుకు వృద్ధిరేటు స్థిరంగా 8 శాతానికి పెరగాల్సిందేనని ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. ఆర్థిక వ్యవస్థను పరుగు పెట్టించడంతో పాటు గిరాకీ, ఎగుమతులు, ఉద్యోగాల కల్పన పెంచాలనే జాతీయ ప్రాధాన్యతాంశాలను సమస్యలుగా పరిగణించక, ఒకదానికొకటి పరస్పరం సహకరించుకునేవిగా భావించాలని సూచించింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం దృష్ట్యా, మన ఆర్థిక వ్యవస్థను అధిక నైతిక ప్రమాణాలు కలిగినదిగా, విషవలయంలో చిక్కుకున్నట్లు పరిగణించరాదని, సమతౌల్య ఆర్థిక వ్యవస్థ అనేదే ఇప్పుడు లేదని సర్వే తెలిపింది. పెట్టుబడులు ప్రధానంగా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంతోనే వృద్ధిరేటు పెరుగుతుందని, ఉద్యోగాల కల్పన, గిరాకీ, ఎగుమతులు వృద్ధి చెందుతాయని పేర్కొంది. ప్రజలను మానవత కలిగిన వారుగా, డేటాను ప్రజల మేలు కోసం, కాంట్రాక్టుల సక్రమ అమలు కోసం న్యాయవ్యవస్థ పరిశీలనను విస్తరించడం, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం వంటివి ముఖ్యమని సర్వేలో వివరించారు. సామాజిక పథకాలైన 'ఆడపిల్లను రక్షించి, చదివించు', 'స్వచ్ఛభారత్ మిషన్', 'జన్‌ధన్ యోజన' వంటివి గుణాత్మక మార్పునకు దోహద పడుతున్నాయని ప్రశంసించింది.

### 2018-19లో రూ.192 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నా కూడా, దేశ ఆర్థిక వ్యవస్థ 2015-16 నాటి 1.99 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.139.3 లక్షల కోట్ల) స్థాయి నుంచి 2018-19లో 2.75 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.192.5 లక్షల కోట్ల) స్థాయికి చేరిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వర్ధమాన మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల(ఈఎండీఈ) ఆర్థిక వ్యవస్థలు 2019లో 0.3 శాతం, 0.1 శాతం చొప్పున నెమ్మదిస్తాయనే అంచనాలున్నాయి. ఇదే సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం వృద్ధి చెందుతుందనే భావిస్తున్నారని పేర్కొంది.

- గత కొన్నేళ్లుగా ఈఎండీఈ ఆర్థిక వ్యవస్థల జీడీపీలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వాటా పెరుగుతూ వస్తోంది. గత దశాబ్దకాలంలోపే ఈఎండీఈ జీడీపీలో భారత వాటా 1.3 శాతం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 0.7 శాతం పెరిగాయి. 2018లో ఈఎండీఈ జీడీపీలో మనదేశ వాటా 8 శాతానికి చేరింది.
- ఈఎండీఈ ఆర్థిక వ్యవస్థల్లో భారత్, చైనా వృద్ధి చోదకాలుగా నిలుస్తున్నాయి.
- 2017-18లో జీడీపీ వృద్ధి 7.2 శాతం కాగా, 2018-19లో ఇది 6.8 శాతమే. అయినా కూడా ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి కలిగిన పెద్ద ఆర్థిక వ్యవస్థగా మనదేశం నిలిచిందని సర్వే వెల్లడించింది.
- ప్రపంచ వృద్ధిరేటుతో పాటు ఈఎండీఈ దేశాల వృద్ధి 2018లో నెమ్మదించేందుకు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు, చైనాలో కఠిన రుణ నిబంధనలు, అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక కఠిన నిబంధనలు కారణమని సర్వే తెలిపింది.
- ప్రపంచబ్యాంక్ అంచనాల ప్రకారం 2017లో, ఫ్రాన్స్‌ను అధిగమించి, ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. ప్రస్తుతం భారత్ కంటే అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్ మాత్రమే ముందున్నాయి. 2019లో యునైటెడ్ కింగ్‌డమ్‌ను కూడా అధిగమిస్తుందనే అంచనాలున్నాయి.

### ఈ ఏడాది 7 శాతం వృద్ధి!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉంటుందని ప్రభుత్వం ఆర్థిక సర్వేలో అంచనా వేసింది. 2018-19లో వృద్ధిరేటు 6.8 శాతం కావడం గమనార్హం. 2014-15 నుంచి చూస్తే, గత 5 ఆర్థిక సంవత్సరాలలో భారత వాస్తవ వృద్ధిరేటు సగటు 7.5 శాతంగా ఉందని సర్వే తెలిపింది. వ్యవసాయం, వాణిజ్యం, రవాణా సమాచారం, సేవల రంగాల్లో వృద్ధి నెమ్మదించడం వల్లే 2018-19లో జీడీపీ వృద్ధి 6.8 శాతానికి పరిమితమైనట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉంటాయని ఆశిస్తున్నందున, వృద్ధిరేటు పెరుగుతుందని అంచనా వేసింది. ద్రవ్యలోటు జీడీపీలో 3.4 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాధారణ ద్రవ్యలోటు 5.8 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. 2018-19లో ఇది 6.4 శాతం.

### ఎఫ్‌డీఐ నిబంధనల్లో సరళీకరణ

కరెంటు ఖాతా లోటు(క్యాడ్)ను నియంత్రణలో ఉంచేందుకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను ప్రభుత్వం మరింత సరళీకరించే అవకాశం ఉంది. 2018-19లో జీడీపీలో 2.1 శాతానికి (57.2 బిలియన్ డాలర్లు) క్యాడ్ పెరిగింది. 2017-18లో జీడీపీలో 1.8 శాతంగా (48.7 బి.డా.) నమోదైంది. 2018-19 నాలుగో త్రైమాసికంలో చమురు ధరలు పెరగడం, ఎగుమతుల వృద్ధి నెమ్మదించడం వాణిజ్య లోటు తగ్గడానికి దారితీసింది. 2018-19లో భారత్‌లోకి ఎఫ్‌డీఐలు స్వల్పంగా 1 శాతం మేర తగ్గి 44.37 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

# 350 లక్షల కోట్ల స్థాయికి..






- 2024-25కు భారత ఆర్థిక వ్యవస్థ
- 8 శాతం వృద్ధితోనే సాధ్యం
- భయపెడుతున్న ద్రవ్య లోటు
- ప్రైవేటు పెట్టుబడులతో అధిక వృద్ధి



### భారత్‌కు ఇది సరైన నమూనా

2018-19 ఆర్థిక సర్వే కోసం మా బృందానికి బ్లూ స్కై థింకింగ్ మార్గనిర్దేశం చేసింది. అంటే ఎలాంటి అవరోధాలు లేని ఆలోచనా విధానంతో రూపొందించాం. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఎలాంటి అవరోధాలు అడ్డు రావు. భారత్‌కు సరిగ్గా సరిపోయే ఆర్థిక నమూనాను (ఎకనమిక్ మోడల్) రూపొందించాం. ఈ ప్రయత్నం సర్వే కవర్ పేజీలోనూ (స్కై బ్లూ- ఆకాశం రంగు) ప్రతిబింబించింది. 8 శాతం స్థిరమైన వృద్ధితో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.350 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మార్చాలన్న యోచన సహేతుకం.

- ముఖ్య ఆర్థిక సలహాదారు
కె.సుబ్రమణియన్

**7 శాతం**
**2019-20**
జీడీపీ వృద్ధి అంచనా

**ఆర్థిక సర్వే**
**2018-19**

### ఎఫ్‌పీఐలు రూ.38,931 కోట్ల ఉపసంహరణ



గత ఆర్థిక సంవత్సరంలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐలు) పెట్టుబడులు నికరంగా రూ.38,931 కోట్లు వెనక్కి వెళ్లాయని సర్వే తెలిపింది. 2017-18లో నికరంగా రూ.1,44,681 కోట్లు వచ్చాయని తెలిపింది. 2018 మార్చి 31 నాటికి ఎఫ్‌పీఐల మొత్తం పెట్టుబడులు రూ.2,53,653 కోట్లు కాగా.. 2019 మార్చి నాటికి రూ.2,48,154 కోట్లకు తగ్గాయి. కానీ ఎఫ్‌పీఐల ఆస్తుల విలువ మాత్రం 2019 మార్చి 31 నాటికి రూ.33,42,680 కోట్లకు పెరిగాయి.

### ఐటీ, బీపీఓ రంగాలు కొత్త విపణులకు చేరాలి

దేశీయ ఐటీ, ఐటీ ఆధారిత సేవా రంగాలు (ఐటీఈఎస్) సంప్రదాయకంగా సేవలందిస్తున్న దేశాల నుంచి సమస్యలు ఎదురవుతున్నందున, కొత్త విపణులకు విస్తరించేందుకు కృషి చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. దేశీయంగా, అమెరికా, ఐరోపాల్లోనూ మన భారీ ఉద్యోగావకాశాలను దేశీయ ఐటీ సంస్థలు కల్పిస్తున్నాయని పేర్కొంది. 'దేశీయ ఐటీ ఎగుమతుల్లో 90 శాతం అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఐరోపా సమాఖ్యలకే వెళ్తున్నాయి. అక్కడ నుంచి కొన్ని సవాళ్లెదురవుతున్నాయి. ప్రస్తుత మార్కెట్లను పటిష్ఠం చేసుకుంటూనే, ఆసియా పసిఫిక్, లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్య దేశాల్లోనూ అవకాశాలు పెరుగుతున్నాయి. ఐరోపా, జపాన్, చైనా, ఆఫ్రికా, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, వంటి దేశాలకూ విస్తరించాలి' అని సూచించింది.

- 181 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12.67 లక్షల కోట్లు): దేశీయ ఐటీ-బీపీఓ పరిశ్రమ విలువ
- 136 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9.52 లక్షల కోట్లు): ఐటీ-బీపీఓ ఎగుమతుల విలువ

### ఎగుమతుల వృద్ధిపై ప్రత్యేక దృష్టి




ఎగుమతులకు ఊతమిచ్చే నిమిత్తం అత్యున్నత స్థాయి సలహాదారుల కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. కార్పొరేట్ పన్ను రేటు కోత, మూలధన వ్యయాలను తగ్గించడం, విదేశీ పెట్టుబడుల ఫండ్‌లకు సంబంధించి నియంత్రణ నిబంధనలు, పన్నుల విధానాల సరళీకరించడం లాంటివి ఇందులో ప్రధానమైనవి. 2018-19లో భారత ఎగుమతులు 9 శాతం పెరిగి 331 బిలియన్ డాలర్లకు చేరాయి.

### ప్రపంచ మార్కెట్లకు 5జీ తో దూసుకెళ్లొచ్చు

ప్రపంచ మార్కెట్లకు దేశీయ పరిశ్రమ చేరేందుకు 5జీ సాంకేతికత చక్కని అవకాశమని ఆర్థిక సర్వే పేర్కొంది. డిజిటల్ చెల్లింపులు, మేథో-సేవలతో కూడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించవచ్చని తెలిపింది. 8,644 మెగాహెర్ట్జ్ 5జీ స్పెక్ట్రమ్‌ను రూ.4.9 లక్షల కోట్ల కనీస ధర ద్వారా ఈ ఏడాది వేలం నిర్వహించి, వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వ యోచన. ప్రభుత్వ సేవలు ఇంటి వద్దే లభిస్తాయని, వైద్య సలహాలు, భారీసంఖ్యలో లావాదేవీలతో వ్యయాలు తగ్గుతాయని, విద్య, వినోద రంగాల తీరూ మారుతుందని సర్వే వివరించింది. 'నెట్‌వర్క్ సొసైటీ సామర్థ్యం విస్తరించేందుకు 5జీ ఉపకరిస్తుంది. స్మార్ట్ విధులను అధికసంఖ్యలో అనుసంధానించేందుకు దోహద పడుతుంది' అని తెలిపింది. అయితే 5జీ స్పెక్ట్రమ్ కనీస ధర అధికంగా ఉందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి.

### సీపీఎస్ఈల్లో వాటా విక్రయం వేగవంతం



28 ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియను ఆర్థిక శాఖ వేగవంతం చేసిందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇప్పటికే మూడు సంస్థల్లో వాటాను విక్రయించిందని పేర్కొంది. మిగిలిన వాటిల్లోనూ వాటా విక్రయం వేర్వేరు దశల్లో ఉందని పేర్కొంది. 2018-19లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈలు) వాటా విక్రయం ద్వారా పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం రూ.85,000 కోట్లను సమీకరించింది.

### స్థిరంగా.. అతి తక్కువగా ద్రవ్యోల్బణం

'ద్రవ్యోల్బణ రేటు అధికస్థాయి, తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యే స్థితి నుంచి గత 5 ఆర్థిక సంవత్సరాల్లో అతి తక్కువగా, స్థిరంగా నమోదయ్యే పరిస్థితి ఏర్పడింది. ధరల పెరుగుదలను ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణను కీలకంగా భావించి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది' ఆర్థిక సర్వే పేర్కొంది. వస్తువులను దాచి పెట్టి, అధిక ధరలకు విక్రయించడాన్ని నిరోధించేందుకు రాష్ట్రాలను అప్రమత్తం చేయడంతో పాటు నిత్యావసరాల లభ్యత ఎలా ఉందీ కూడా ఎప్పటికప్పుడు కేంద్రం పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటోందని పేర్కొంది. పప్పుదినుసులు, ఇతర పంటల సాగును ప్రోత్సహించేందుకు కనీస మద్దతు ధర పెంచడం, పంట దిగుబడుల సేకరణకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడమూ కలిసొచ్చింది.

| రిటైల్ ద్రవ్యోల్బణం ఇలా |
|---|
| 2018 – 19: 3.4% |
| 2017 – 18: 3.6% |
| 2016 – 17: 4.5% |
| 2015 – 16: 4.9% |
| 204 – 15: 5.9% |

### సెన్సెక్స్ ఆకర్షణీయ ప్రతిఫలం



2018–19లో సెన్సెక్స్ 17% ప్రతిఫలాన్ని పంచిందని ఆర్థిక సర్వే పేర్కొంది. గరిష్ఠంగా 38,897 స్థాయిని అందుకోగా.. కనిష్ఠంగా 33,019 స్థాయిని నమోదు చేసిందని వెల్లడించింది. 2019 మార్చి 31న 38,673 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 14.9% మేర రాణించిందని తెలిపింది. స్టాక్ మార్కెట్ జోరుతో మదుపర్ల సంపద రూ.8.83 లక్షల కోట్లు పెరిగింది. ఇక 2019-20లో తొలిసారిగా సెన్సెక్స్ 40,000 మైలురాయిని కూడా అందుకుంది.

### బ్యాంకింగ్ భేష్




'గత ఆర్థిక సంవత్సరంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గడం వల్ల బ్యాంకింగ్ రంగం మెరుగు పడింది. రుణాల జారీ పెరిగింది. అయితే క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ తగ్గడం, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై ఉన్న ఒత్తిడి వల్ల నిధుల ప్రవాహానికి ఆటంకాలున్నాయని' ఆర్థిక సర్వే పేర్కొంది.

2018 మార్చిలో ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 11.5% కాగా 2018 డిసెంబరుకు 10.1 శాతానికి చేరాయి.

### అంకురాలకు పన్నుల హేతుబద్ధీకరణ

ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఉద్యోగుల సృష్టికి దోహదం చేసే అంకుర సంస్థలకు ప్రోత్సాహం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్థిక సర్వే సూచించింది. అంకురాలకు సంబంధించి పన్నుల విధానాన్ని హేతుబద్ధీకరించాలని తెలిపింది. వినూత్నతకు పెద్దపీట వేసేందుకు పన్నుల వ్యవస్థను సులభతరం చేయాల్సిన అవసరాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఆవిష్కరణలకు, కొత్త వ్యాపారాలకు ప్రోత్సాహకం అందించే వ్యవస్థ లేకుంటే ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో వేగం కనిపించదని తెలిపింది. సాంప్రదాయ వ్యాపార సంస్థలతో పోలిస్తే అంకురాలకు అవరోధాలు ఎక్కువగా ఎదురవుతాయని, విధానాల్లోనూ సందిగ్ధత నెలకొంటే నష్టాలకోర్చి పెట్టే పెట్టుబడులకు ముప్పు వాటిల్లుతుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. అంకురాల వృద్ధికి ఊతమిచ్చే లక్ష్యంతో 2015లో స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. 2019 మార్చి 1 నాటికి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కొత్త అంకురాల సంఖ్య 16,578. వీటిల్లో 47 శాతం అంకురాలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటయ్యాయి.




### మౌలిక వసతులపై ఏటా రూ.14 లక్షల కోట్లు వెచ్చించాలి

ప్రభుత్వం నిర్దేశించుకున్నట్లు 2032 నాటికి 10 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.700 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా మారాలంటే, మౌలిక వసతుల కల్పనపై ఏటా వెచ్చిస్తున్న మొత్తాన్ని రెట్టింపు చేసి 200 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14 లక్షల కోట్ల)కు పెంచాలని ఆర్థిక సర్వే సూచించింది. ప్రస్తుతం ఏడాదికి 100-110 బి.డా. (సుమారు రూ.7-7.70 లక్షల కోట్ల) మొత్తాన్ని రోడ్లు, రైళ్లు, విమానాశ్రయాలు, జల రవాణా వంటి మౌలిక వసతుల కల్పనకు వెచ్చిస్తున్నారు. ఈ మొత్తాన్ని రెట్టింపు చేయాలంటే (జీడీపీలో 7-8 శాతం) ప్రభుత్వం ఒక్కటే వెచ్చించలేదు కనుక, ప్రైవేటు పెట్టుబడులను భారీగా ఆకర్షించాలని సూచించింది.

- **1.32 లక్షల కిలోమీటర్లు:** దేశంలో జాతీయ రహదారుల పొడవు. ఇందులో 20 శాతం గత 4 ఏళ్లలోనే నిర్మించారు. 2014-15లో రోజుకు 12 కి.మీ. పొడవునా నిర్మిస్తే, 2018-19కి ఇది 30 కి.మీ.కు చేరింది.
- బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్లు అన్నింటినీ 100 శాతం విద్యుదీకరణ చేస్తే, డీజిల్ వినియోగం తగ్గించవచ్చు.

### విద్యుత్తు వాహనాలపై భారం తగ్గిద్దాం



భవిష్యతరం సుస్థిర రవాణాకు దోహదపడేలా విద్యుత్తు వాహనాల (ఈవీ)ను తీర్చిదిద్దేందుకు , వాటిపై ఆర్థికభారం తగ్గే విధానాలు అవసరమని ఆర్థికసర్వే స్పష్టంచేసింది. ఛార్జింగ్ వ్యవస్థలు లేకపోవడం వల్లే, దేశీయంగా ఈ వాహనాల కొనుగోళ్లు అతి తక్కువగా ఉన్నాయని వివరించింది. వ్యక్తిగత కార్లలో 30 శాతం, వాణిజ్య కార్లలో 70 శాతం, బస్సుల్లో 40 శాతం, 2-3 చక్రాల వాహనాల్లో 80 శాతం కనుక విద్యుత్తుతో నడిచేలా 2030కి మారితే, 846 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను నివారించవచ్చని, 474 మిలియన్ టన్నుల ఇంధనం ఆదా చేయొచ్చని తెలిపింది

### 128.6 మి.టన్నులకు ఉక్కు ఉత్పత్తి



దేశంలో ఉక్కు ఉత్పత్తి 2021 కల్లా 128.6 మిలియన్ టన్నులకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. వినియోగం కూడా 2023 నాటికి 140 మిలియన్ టన్నులకు పెరుగుతుందని భావిస్తోంది. విస్తరణ, సామర్థ్య పెంపు నిమిత్తం మౌలికం, నిర్మాణం, వాహన రంగాల్లో భారీగా పెట్టుబడులు వస్తుండటంతో ఉక్కుకు గిరాకీ పెరగనుంది. 2018-19లో ముడి ఉక్కు ఉత్పత్తి 106.56 మిలియన్ టన్నులుగా నమోదైంది.

# నేడు 20 కొత్త జడ్పీల ఆవిర్భావం

**మొత్తం 28 జడ్పీల్లో కొలువుదీరనున్న పాలకవర్గాలు ● ఆగస్టు 7న మరో నాలుగింటిలో పాలన ఆరంభం**

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కొత్త రూపు సంతరించుకోబోతోంది. జిల్లా స్థాయి పంచాయతీగా వ్యవహరించే జిల్లా పరిషత్(జడ్పీ)ల సంఖ్య 9 నుంచి ఒకే సారి 32కు పెరగనుంది. వీటిలో 20 కొత్త జడ్పీలు శుక్రవారం ఆవిర్భవించనుండగా.. మరో మూడు కొత్త జడ్పీలు ఆగస్టు 7న ప్రారంభమవుతాయి. జడ్పీలకు దండిగా నిధులను ఇవ్వనున్నట్లు సర్కారు వెల్లడించిన నేపథ్యంలో వాటికి గత వైభవం తథ్యమనే భావన జడ్పీటీసీ సభ్యుల్లో వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో ఇంతకు ముందు హైదరాబాద్ మినహా మిగతా 9 జిల్లాలకు 9 జడ్పీలు ఉండేవి. రెవెన్యూ జిల్లాల సంఖ్య పెరిగి చాలా కాలమైనప్పటికీ.. పాత 9 జడ్పీల్లోని పాలకవర్గాల పదవీ కాలం ముగియక పోవటం వల్ల ఇప్పటివరకు పాత జడ్పీలే అన్ని జిల్లాల్లోను మనుగడలో ఉంటూ వచ్చాయి. ఖమ్మం మినహా మిగతా 8 పాలకవర్గాల పదవీకాలం గురువారం ముగియటంతో ఇప్పుడు కొత్త జడ్పీల ఆవిర్భావం మొదలు కానుంది.

## నేడు తొలి సమావేశాలు

కొత్తగా ఏర్పాటు కావాల్సిన మొత్తం 23లో 20 జడ్పీలు శుక్రవారం తొలి సమావేశాల నిర్వహణ ద్వారా ఆయా జిల్లాల్లో అవతరిస్తాయి. మిగతా మూడు.. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు.. ఆగస్టు 7న మొదలవుతాయి. ఎందుకంటే ఇవి.. పదవీ కాలం ఇంకా నెల రోజుల పాటు ఉన్న ఖమ్మం జడ్పీ నుంచి ఏర్పాటు కావాల్సి ఉంది. ఇక పాత వాటి విషయానికి వస్తే.. వాటిలో 8 జడ్పీలకు శుక్రవారం నూతన పాలకవర్గాలు కొలువుదీరతాయి. అంటే కొత్తవి 20, పాతవి 8 కలిపి మొత్తం 28 జడ్పీల పాలకవర్గాలు శుక్రవారం విధి నిర్వహణను చేపడతాయి. ఇక ఆగస్టు 7వ తేదీన మూడు కొత్తవి, ఖమ్మం కలిపి మొత్తం 4 జడ్పీల పాలకవర్గాలు పరిపాలనను ఆరంభిస్తాయి. మే నెలలో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన జడ్పీటీసీ సభ్యులంతా కలిసి జూన్ 8న ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్, కో ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకున్న సంగతి తెలిసిందే.

అన్ని జడ్పీల్లోను ముఖ్యకార్యనిర్వహణ అధికారి (సీఈవో), అకౌంట్స్ అధికారి (ఏవో) పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసి..వాటిలోకి అర్హులను పదోన్నతుల ద్వారా గురువారం నియమించింది. మిగతా ఉద్యోగులను మాత్రం ఉమ్మడి జడ్పీల నుంచి ఆయా కొత్త జడ్పీల్లోని మండలాల సంఖ్య ఆధారంగా పంపిణీ చేసింది. ఫర్నిచర్తో సహా వివిధ రకాల వస్తువులనూ ఇదే పద్ధతిలో పంచింది. కొత్తవాటికి ఖజానా, బ్యాంకు ఖాతాలను ప్రారంభించిన తర్వాత వాటికి నేరుగా నిధులను జమ చేస్తుంది.

### నిధులు, విధులపై సభ్యుల ఆశాభావం

పాత జడ్పీలు గత కొన్నేళ్లగా నిధులంటూ లేక ముక్కుబడిగానే కొనసాగుతూ వచ్చాయి. ఇప్పుడు పంచాయతీరాజ్ నూతన చట్టం అమల్లోకి రావటం, అవసరమైన మేర నిధులను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటం.. మరోవైపు స్థానిక సంస్థలకు సాయంపై కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నివేదికలు త్వరలోనే వెలువడనుండటం.. వంటి కారణాల వల్ల జడ్పీలకు నూతన వైభవం వస్తుందనే ఆశాభావం కొత్త పాలకవర్గాల్లో, జడ్పీటీసీ సభ్యుల్లో వ్యక్తమవుతోంది.

రాష్ట్ర సచివాలయం తరలింపు, ఇతర కీలక అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి శుక్రవారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో సమావేశం కానున్నారు. నూతన సచివాలయ నిర్మాణానికి గత నెల 27న శంకుస్థాపన జరగడం తెలిసిందే. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

Admission Guidence for AP/TS/KS/UP
MBBS
LOW SCORE / LOWEST PACKAGE
8466029052/8466963781

TRINITY SCHOOL OF MEDICINE
♦USA ♦CARIBBEAN
MBBS
MEET UNIVERSITY OFFICIALS & AVAIL SPOT ADMISSIONS
on 6th July 2019 11-00 am to 4-00 pm @ HYDERABAD
MY MBBS ABROAD
on 7th July 2019 11-00 am to 4-00 pm @ VIJAYAWADA.
♦ 95% ♦ Success in USMLE ♦ CAAM-HP Accredited School (Compulsory as per US Licensure Rules) ♦ Scholarship up to INR 35 Lakhs ♦ Clinicals in USA Top Hospitals
Call & Register - Free Entry : 91606 23377, 91608 63377



పూరీలో భక్తజనసంద్రం మధ్య గుండిచా మందిరానికి వెళ్తున్న ముగ్గురు మూర్తుల రథాలు

# జనం మధ్య జగన్నాథుడు

**● కన్నుల పండువగా సాగిన రథయాత్ర**

**పూరీ నుంచి న్యూస్టుడే బృందం:** విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రవాసుని రథయాత్రను గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి తన శిష్యబృందంతో రథాలపైకి వెళ్లి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పూరీ రాజు గజపతి దివ్యసింగ్దేవ్ బలభద్ర, సుభద్ర, జగన్నాథుల సన్నిధిలో(రథాలపై) 'ఛెరాపహరా'గా బంగారు చీపురుతో ఊడ్చి పూజలు నిర్వహించారు. తర్వాత మూడు రథాలూ వరుసక్రమంలో గుండిచాదేవి(పెంచిన తల్లి) మందిరానికి కదిలాయి. భక్తులు ఆనందపారవశ్యంతో రథాల తాళ్లు లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఒడిశా గవర్నరు గణేశీలాల్, సీఎం నవీన్ పట్నాయక్ పాల్గొన్నారు.

## నేడు శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

**తిరుమల, న్యూస్టుడే:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లను తితిదే శుక్రవారం విడుదల చేయనుంది. అక్టోబరుకు సంబంధించి ఆన్లైన్లో టిక్కెట్లను ఉదయం పదింటికి అందుబాటులోకి తీసుకురానుంది. ఆన్లైన్ డిప్ విధానం కింద సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన, నిజపాద దర్శనం టిక్కెట్లను కేటాయించనుంది. టిక్కెట్ల విడుదల సమయం నుంచి నాలుగు రోజులపాటు నమోదు అవకాశం కల్పిస్తుంది. అనంతరం డిప్ విధానం కింద టిక్కెట్ల కేటాయింపు, నగదు చెల్లింపునకు అవకాశం ఇవ్వనుంది. ఆన్లైన్ జనరల్ కేటగిరి కింద విశేషపూజ, కల్యాణోత్సవం, ఊంజలసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ టిక్కెట్లను విడుదల చేసిన వెంటనే కొనుగోలుకు అవకాశం ఉంటుంది. దాదాపు 55,355 ఆర్జిత సేవా టిక్కెట్లు అందుబాటులోకి రానున్నాయి.

**డయల్ తితిదే ఈవో కార్యక్రమం రద్దు:** తిరుమలలో శుక్రవారం నిర్వహించాల్సిన డయల్ తితిదే ఈవో కార్యక్రమాన్ని తితిదే రద్దు చేసింది. పరిపాలన పరమైన కారణాలతో కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకటించింది. ప్రతినెలా మొదటి శుక్రవారం కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

**ఎస్వీబీసీ ఛైర్మన్గా వై.వి.సుబ్బారెడ్డి:** శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ మండలి ఛైర్మన్గా తితిదే ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వై.వి.సుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఛానల్ డైరెక్టరుగానూ వ్యవహరించనున్నారు. ఇదివరకు బాధ్యతలను దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు నిర్వహించారు.

## పీహెచ్డీల సమాచారం ఇవ్వకపోవడంపై గవర్నర్ ఆగ్రహం

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో చేరిన పీహెచ్డీ విద్యార్థుల సమాచారాన్ని అడిగినప్పటికీ నివేదిక ఇవ్వకపోవడంపై గవర్నర్ నరసింహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆగస్టు 8న ఉపకులపతులతో సమావేశం నిర్వహించి, పీహెచ్డీలపై పూర్తి సమాచారం పంపించాలని ఆదేశించినా ఇవ్వకపోవడంపై ఉన్నత విద్యామండలిని ప్రశ్నించారు. వర్సిటీల నుంచి సమాచారం సేకరించి ఇవ్వాలన్నారు.

# 'మై హోం'లో ఐటీ సోదాలు

**ఈనాడు, హైదరాబాద్:** ప్రముఖ స్థిరాస్తి వ్యాపార సంస్థ మైహోం గ్రూప్ కార్యాలయాల్లో గురువారం ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. బెంగళూరు నుంచి వచ్చిన అధికారులు హైదరాబాద్ సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు జరిపారు. దాదాపు 50 మంది ఇందులో పాల్గొన్నారు. బెంగళూరులోని ఓ స్థిరాస్తి సంస్థతో మైహోం గ్రూప్ 2017లో ఓ ప్రాజెక్టులో ఒప్పందం కుదుర్చుకుంది. దీనిపై వచ్చిన ఫిర్యాదుల్లో భాగంగా అక్కడి ఆదాయ పన్ను అధికారులు తొలుత బెంగళూరులోని స్థిరాస్తి సంస్థకు చెందిన కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇదే సంస్థతో భాగస్వామిగా ఉన్నందున గురువారం మైహోం గ్రూప్లోనూ సోదాలు చేశారు. హైదరాబాద్లోని నందిహిల్స్, మాదాపూర్, బేగంపేటలతోపాటు మొత్తం ఐదు ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. హైదరాబాద్ చేరుకున్న బెంగళూరు అధికారులు స్థానిక ఉద్యోగులతో కలిసి సోదాలు మొదలుపెట్టారు. రాత్రి పొద్దుపోయే వరకూ తనిఖీలు జరుగుతూనే ఉన్నాయి. దేశంలో స్థిరాస్తి రంగానికి సంబంధించి స్టీలు, సిమెంటు ధరల నియంత్రణ కోసం పనిచేసే కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా సోదాల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ సంస్థ బెంగళూరుతో పాటు హైదరాబాద్లో నిర్వహించిన దాడుల్లో కూడా పాల్గొంది.

## 3 ఇండిగో ఎయిర్లైన్స్ దేశీయ విమానాల రద్దు

**శంషాబాద్ గ్రామీణ, న్యూస్టుడే:** ప్రతికూల వాతావరణం, నిర్వహణ సమస్యల కారణంగా ఇండిగో ఎయిర్లైన్స్ సంస్థకు చెందిన మూడు దేశీయ విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు కోల్కతాకు వెళ్లాల్సిన 6ఈ-6927 విమానం, రాత్రి 9.40గంటలకు దిల్లీ వెళ్లాల్సిన 6ఈ-564 విమానం, ముంబయికి వెళ్లాల్సిన 6ఈ-5384 విమాన సర్వీసులను అర్థాంతరంగా రద్దు చేశారు. విమానాశ్రయం చేరుకున్న ప్రయాణికులు ఆందోళనకు దిగడంతో కొంతమందిని ఇతర విమానాల్లో గమ్యస్థానాలకు పంపించారు. మరి కొంతమంది ప్రయాణికులకు టికెట్ల డబ్బులను వెనక్కి ఇస్తామన్నారు.







Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Eenadu epaper